హైదరాబాద్
శనివారం
3-3-2018
సంపుటి: 2, సంచిక: 93
పేజీలు: 12+16, వెల: రూ. 5
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథిః విదియ రా. 2.19 తదుపరి తదియ; నక్షత్రం : ఉత్తర రా.8.53 తదుపరి హస్త; వర్జ్యం : ఉ.7.12 – 8.42, రా. 10.29 –12.00; దుర్ముహూర్తం : ఉ.6.37 – 8.11; రాహుకాలం : ఉ. 9.33 – 11.00; అమృతఘుడియలు : మ.2.05 – 3.37; శుభసమయం : ఉ.11.01 – 1.00;

సూర్యోదయం : 6.37,
సూర్యాస్తమయం : 6.20

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

అడవిలో నెత్తుటేరు



తొండపాల్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్
12 మంది మావోయిస్టుల మృతి
గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్ మరణం
దద్దరిల్లిన తెలంగాణ.. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు



- కొనసాగుతున్న ఎదురు కాల్పులు
- మృతుల్లో కీలక నేత హరిభూషణ్?
- మరో అగ్రనేత ఉన్నట్టు సమాచారం
- 2 ఏకే 47లు.. 10 ఆయుధాల స్వాధీనం
- ఏవోబీ ప్రాంతం మొత్తం రెడ్ అలర్ట్

అది.. తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లోని అటవీ ప్రాంతం. శుక్రవారం తెల్లవారుజాము సమయం. రెండు రాష్ట్రాలకు చెందిన గ్రేహౌండ్స్ బలగాలు, పోలీసులు ముమ్మరంగా కూంబింగ్ చేస్తున్నారు. ఉన్నట్టుండి వారికి భారీ సంఖ్యలో మావోయిస్టులు కనిపించారు. వెంటనే ఇరుపక్షాల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. కొన్ని గంటలపాటు అటూ ఇటూ తుపాకుల నుంచి వెలువడిన బుల్లెట్ల మోతతో అటవీ ప్రాంత మంతా దద్దరిల్లింది. కాసేపటికే అక్కడ రక్తం ఏరులా పారింది.

వివరాలు 6లో..

డిప్యూటేషన్‌పై వెళ్లి...



భార్య, కుమార్తెతో సుశీల్ (ఫైల్)

వికారాబాద్, మార్చి 2 (మనం ప్రతినిధి):

భద్రాద్రి జిల్లా సరిహద్దులలో జరిగిన ఎదురు కాల్పులలో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సుశీల్‌కుమార్ మృతిచెందారు. ఆయన సైబరాబాద్ సివిల్ పోలీసు దళంలోని 2004 బ్యాచ్‌కి చెందిన కానిస్టేబుల్. 2010లో

మిగతా 6లో..



15 లక్షల పెంగ్విన్లు!

ఇక్కడ మీరు చూస్తున్నవేంటో గుర్తుపట్టారా? గునగున నడుస్తూ.. చూడగానే ఎంతో ముచ్చటగొలిపే పెంగ్విన్ పిల్లలు!! అవును.. ఇటీవలి కాలంలో దాదాపు అంతరించే దశకు చేరుకున్నాయని భావిస్తున్న పెంగ్విన్లు ఒకేచోట 15 లక్షలు కనిపించాయి. అంటార్కిటికాలోని డేంజర్ దీవుల్లో ఇవి ఇంత పెద్ద సంఖ్యలో కనిపించడంతో శాస్త్రవేత్తలు ఎంతగానో ఆనందించారు.

7లో..

మోదీని కించపరిచే ఉద్దేశం లేదు!

'గారు' అనబోయి.. జరిగిన పొరబాటు



- కేసీఆర్‌కు బాసటగా నిలిచిన కవిత
- ప్రధాని మోదీ 600 కోట్ల ఓటర్లనలేదా
- నాడు మేం విమర్శలు చేశామా?: ఎంపీ

హైదరాబాద్, మార్చి 2 (మనం ప్రతినిధి):

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కించపరిచే ఉద్దేశమేదీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు లేదని ఆయన కుమార్తె, నిజామాబాద్ ఎంపీ కవిత వెల్లడించారు. మాటల మధ్యలో 'మోదీ గారు' అనబోయి పొరబాటున 'గాడు' అని వచ్చిందని చెప్పారు. ప్రధానిపై కేసీఆర్ చేసిన

మిగతా 6లో..

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో శనివారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలో మార్పులేదు. గంటకు 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 37 డిగ్రీలు
కనిష్ఠ ఉష్ణోగ్రత: 20 డిగ్రీలు

ఇదీలోకం!



దీన్ని బట్టిచూస్తే.. మోత్కుపల్లి తెరాసలో చేరడానికి తేదీ ఒక్కటే నిర్ణయం కానట్టుంది సార్..!

మూడో సీటు ఎవరికి?

రాజ్యసభ స్థానంపై సంకటంలో టీఆర్ఎస్..
తెరపైకి అమరుల కుటుంబాలు

- గట్టిగా డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్
- 'కారు'కు ఇరకాటమేనంటున్న నేతలు



హైదరాబాద్, మార్చి 2(మనం ప్రతినిధి):

రాజ్యసభ ఎన్నికలు తెలంగాణలో రాజకీయ వేడిని రాజేస్తున్నాయి. సాధారణంగా అయితే మూడు సీట్లను టీఆర్ఎస్ పార్టీనే ఏకగ్రీవంగా గెలుచుకుంటుంది. భారీగా రాజకీయ ఫిరాయింపులు జరగకుండా ఉంటే, మూడో సీటు విషయంలో పోటీ తప్పేదికాదు. తాజాగా శాసనసభలో

మిగతా 6లో..



హోలీ విషాదం

రోడ్డు ప్రమాదంలో ఐదుగురి దుర్మరణం



- వేడుకల్లో పాల్గొని వస్తూ..
- ప్రమాదంలో ఐదుగురి మృతి
- వాహనం తుక్కుతుక్కు.. సంగారెడ్డిలో ఘటన

6లో..

కేంద్ర పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

- పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశంలో రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్
- కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలపై బీజేపీ నేతల ఆగ్రహం



హైదరాబాద్, మార్చి 2(మనం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేయాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలపై మాట్లాడేందుకు స్వర్గీయ వి.రామారావు ఇంట్లో బీజేపీ రాష్ట్ర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కీలకనేతలతో శుక్రవారం ఆమె సమావేశమయ్యారు. తెలంగాణలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. ప్రధాని మోదీ పట్ల కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను నేతలు ఖండించారు. కేంద్రం రాష్ట్రానికి ఇస్తున్న నిధులు, వివిధ అభివృద్ధి పథకాల్లో అందిస్తోన్న తోడ్పాటు తదితర అంశాలపై కేంద్ర మంత్రులు శాఖల వారీగా సమీక్షలు నిర్వహించేలా చూస్తామని ఈ సందర్భంగా మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్ర నాయకులకు హామీ ఇచ్చారు. పేద ప్రజల సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతుందని, వాటిని ప్రజలకు చేరవేయడంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. కేంద్రమంత్రులు తరచుగా తెలంగాణలో పర్యటించేలా చేస్తామన్నారు. పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత మరోమారు రాష్ట్ర పర్యటనకు వస్తానని నిర్మలా సీతారామన్ చెప్పారు. కాగా ప్రధాని మోదీపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన వెంటనే ఉపసంహరించుకోవాలని, వివరణ ఇవ్వాలని పార్టీ నేతలు డిమాండ్ చేశారు.

ఎంపీ కవితతో సన్ ఫౌండేషన్ ఛైర్మన్ భేటి



హైదరాబాద్, మార్చి 2 (మనం ప్రతినిధి): నిజామాబాద్ ఎంపీ కవితతో సన్ ఫౌండేషన్ చైర్మన్ కావేరి శుక్రవారం సమావేశమయ్యారు. నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గంలోని పోతంగల్ గ్రామాన్ని అభివృద్ధి విషయమై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే షకీతోపాటు పలవురు నేతలు పాల్గొన్నారు.

స్పైసెస్ పార్కు ఏర్పాటుకు సహకరిస్తాం

- కేటీఆర్‌కు కేంద్ర మంత్రి సురేష్ ప్రభు లేఖ

హైదరాబాద్, మార్చి 2(మనం ప్రతినిధి): తెలంగాణలో స్పైసెస్ పార్క్ ఏర్పాటుకు సహకరిస్తామని కే ంద్ర మంత్రి సురేష్ ప్రభు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని రైతులను ఆదుకునేందుకు ప్రత్యేకంగా పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ గతంలో కేంద్ర మంత్రి సురేష్ ప్రభుకు ఓ లేఖ రాశారు. కేటీఆర్ వినతికి సురేష్ ప్రభు స్పందించారు. ఈ మేరకు ఓ లేఖ పంపారు. పసుపు పంట మార్కెటింగ్ రీసెర్చి ద్వారా పంట అభివృద్ధి చేయా ల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్రాల వ్యవసాయ శాఖలపైన ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. స్పైసెస్ బోర్డు ద్వారా పసుపుతోపాటు ఇతర స్పై సెస్ ఎగుమతులు, నాణ్యత ప్రమాణాల పర్యవేక్షణ వంటి కార్య క్రమా లను నిర్వహిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే తెలంగాణ కోసం ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే 'ట్రేడ్ ఇంఫ్రాస్ట్రక్చర్ ఫర్ ఎక్స్‌పోర్ట్ స్కీం'(టీఐఈఎస్) పథకం కింద పసుపు కోసం ప్రత్యేకంగా ఒక స్పైసెస్ పార్కు కూడా నెలకొల్పుతామని ఆయన లేఖలో పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు, వెనుక నిందితులు

భార్యే హంతకురాలు

- ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య
- ఫిబ్రవరి 24న హైదరాబాద్‌లో ఘటన
- అనుమానాస్పద మృతి కేసు ఛేదించిన పోలీసులు

హైదరాబాద్/బాలానగర్, మార్చి 2(మనం న్యూస్): వివాహేతర సంబంధం కోసం కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి చంపింది ఓ భార్య. ఆపై గుండెపోటుతో భర్త చనిపోయాడని అందరిని నమ్మించే ప్రయత్నం చేసింది. చివరికి పోలీసు విచారణలో దొరికిపోయింది. గత నెల 24న హైదరాబాద్‌లోని బాలానగర్ పోలీసుస్టేషన్ పరిధి రంగారెడ్డినగర్‌లో ఈ ఘటన జరిగింది. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో నిజాన్ని రాబట్టారు. బాలానగర్ ఏసీపీ టీ.గోవర్ధన్, సీఐ కిషన్ కుమార్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లాకు చెందిన పెద్దింటి జగదీశ్వర్ రావు(33)కు అదే జిల్లాకు చెందిన తులసితో ఏడేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. బాలానగర్‌లో రంగారెడ్డినగర్‌లో నివాసముంటున్నారు. ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చిన జగదీశ్వర్‌రావు గాంధీనగర్‌లోని ఓ పరిశ్రమలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తోటి కార్మికుడైన సూర్యాపేట జిల్లా మునగాల మండలానికి చెందిన చీమ వీరబాబుతో జగదీశ్వర్‌రావుకు స్నేహం కుదిరింది. దీంతో వీరబాబు తరచూ ఇంటికి వస్తుండేవాడు. ఈ క్రమంలో జగదీశ్వర్ భార్య తులసితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. వీరి విషయంపై అనుమానం వచ్చిన జగదీశ్వర్ ఏదో ఒకరోజు ఇద్దరిని పట్టుకుంటానని తులసీతో చెప్పాడు. ఎప్పటికైనా విషయం బయట పడుతుందనే భయంతో తులసి భర్తను చంపడానికి సిద్ధమయ్యింది. వీరబాబుతో కలిసి ప్లాన్ చేసింది. గత నెల 24న మధ్యాహ్నం జగదీశ్వర్ భోజనానికి ఇంటికి వచ్చాడు. అదే సమయంలో వీరబాబు ఇంట్లోకి రావడంతో ఇద్దరు గొడవ పడ్డారు. గొడవ జరుగుతుండగానే భార్య లోపలి నుండి ఇంటి తలుపులు మూసి గడియ పెట్టింది. తన చున్నీని భర్త గొంతుకు వేసి గట్టిగా బిగించింది. తులసీ కాళ్లు పట్టుకోగా, వీరబాబు ఊపిరి ఆడకుండా చేసి జగదీశ్వర్ ప్రాణం తీశారు. వెంటనే వీరబాబు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తన భర్త గుండెపోటుతో చనిపోయాడని తులసీ చుట్టుపక్కల వారిని పొగేసీ కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చింది. ఈ విషయంపై సమాచారం అందుకున్న బాలానగర్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారించారు. పోలీసుల పద్ధతిలో విచారణ చేయగా అసలు విషయం బయటపడింది.

బీసీలకోసం ప్రత్యేక పార్టీ: జాజుల

హైదరాబాద్ సిటీ, మార్చి 2(మనం ప్రతినిధి):కేంద్రంలో, రాష్ట్రంలో బీసీలకు జనాభా దామాష ప్రకారం అన్ని రంగాల్లో సమాన వాటా, హక్కుల సాధనకు ఒక్కటై ఉద్యమిద్దామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ బిల్డింగ్‌లో తెలంగాణ బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో 'కేంద్ర,రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల వాటా 'అంశంపై బీసీ సంఘాల, కులసంఘాల రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అన్ని కులసంఘాలు, బీసీ సంఘాల నేతలు, వందలాదిగా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మంత్రులు నివేదిక ముగించి మూడునెలలు గడిచిపోయిందని దానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉలుకూ, పలుకూ లేదని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. నెలరోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా ఎంబీసీ కార్పొరేషన్‌కు నిధుల విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా, బీసీ ప్రధానమంత్రి ఉన్నా దేశవ్యాప్తంగా బీసీలకు న్యాయం జరగకపోవడం ఎంతో విచారకరమన్నారు. సమావేశంలో రాష్ట్రస్థాయి, కేంద్రస్థాయి డిమాండ్లపై చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో వివిధ కులసంఘాల నాయకులు మాట్లాడారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: తుమ్మల

ఖమ్మం, మార్చి 2(మనం బ్యూరో): రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం సర్దార్ వల్లాబాయ్‌పటేల్ స్టేడియంలో రైతులకు సబ్సిడీపై 578 ట్రాక్టర్లు, 16 హార్వెస్టర్లు, 24 మినీ ట్రాక్టర్ల పంపిణీ శుక్రవారం జరిగింది. రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, మంత్రి తుమ్మల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టుతో జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. జిల్లాకు కేవలం 250 ట్రాక్టర్లు మంజూరయ్యాయని మంత్రి పోచారంను ఒప్పించి అదనంగా మరో 250 ట్రాక్టర్లు పంపిణీకి సిద్ధం చేశామన్నారు. మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతును రాజుగా చూడాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమన్నారు. మండలానికి పది చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 5500 నాటు వేసే యంత్రాలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అజయ్‌కుమార్, కలెక్టర్ డీఎస్ లోకేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లెక్కలు తేలుతాయి

భూ రికార్డులకు ఆధార్ అనుసంధానం.. ఇకపై ఆన్‌లైన్‌లో హక్కుదారుని వివరాలు

- బట్టబయలుకానున్న భూముల బండారం
- బినామీల పేరు మీద మహానగర పరిధిలో..
- అక్రమార్కుల చేతిలో వేల ఎకరాల భూములు
- ఆధార్ లింక్‌తో అవినీతి రాయుళ్ల హడల్
- వివరాలు ఇచ్చేందుకు తిరస్కరిస్తున్న బినామీలు
- 'పెట్టుబడి' నగదు తీసుకునేందుకు వెనకడుగు



హైదరాబాద్, మార్చి 2(మనం ప్రతినిధి): భూ రికార్డులకు ఆధార్ అనుసంధానం చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పలువురి గుండెల్లో గుబులు రేపుతోంది. బినామీల పేరుతో ఎకరాల కొద్ది భూమిని కొనుగోలు చేసిన వారు తమ అవినీతి ఎక్కడ బయటపడుతుందోనని హడలి పోతున్నారు. పన్ను ఎగవేత ఉద్దేశంతో చాలామంది వ్యాపారులు, ఉన్నతాధికారులు, రాజకీయనేతలు తమ అనునాయుల పేర్ల మీద భూములు కొనుగోలు చేశారు. భూముల రికార్డులపై ఇన్నాళ్లు క్షేత్రస్థాయి పర్యవేక్షణ లేకపోవడంతో చాలామంది తమ అక్రమార్జనను భూములపై పెట్టుబడిగా పెట్టేవారు. ఎకరాల కొద్ది భూమి కొని దానిని బినామీల పేరు మీద రిజిస్టర్ చేయించేవారు. కొందరు ఆ భూములను రియల్ ఎస్టేట్‌లోకి తీసుకురాగా, కొందరు ప్రహరీలు నిర్మించి వదిలేశారు. కొందరు వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. ఆధార్ అనుసంధానం పేరుతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని అలాంటి వారంతా అయోమయంలో పడ్డారు. ఈ నేపథ్యంలో కొందరు ప్రభుత్వం అందజేస్తున్న ఎకరాకు రూ.4వేలు పెట్టుబడిని కూడా వదులుకునేందుకు సిద్ధపడుతున్నారు.

మహానగర శివారులోనే అధికం..

అక్రమార్జనతో బినామీల పేర్లతో కొనుగోలు చేసిన భూముల్లో అధికశాతం హైదరాబాద్ నగర శివారులోని ఉన్నాయి. నల్లగొండ, యాదాద్రిభువనగిరి, మల్కాజిగిరి, మేడ్చల్, మెదక్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో వేల ఎకరాల్లో భూములు ఉన్నాయి. రాష్ట్రంలోనే బడా నేతలు, ప్రముఖ వ్యాపారులు, ప్రజాప్రతినిదులు, ఉన్నతాధికారులతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఈ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. అవినీతి సొమ్ము పెట్టుబడి కావడంతో చాలా మంది తమ నమ్మకస్తులుగా ఉండే వారి పేరు మీద భూములు రిజిస్టర్ చేయించారు. కొందరు పన్ను ఎగవేత కోసం వేరొకరి పేరు మీద భూములు కొనుగోలు చేశారు. ఇలాంటి వ్యవహారాల వల్ల పన్నుల రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంలో భారీగా గండి పడుతుంది. బినామీలకు తృణమో.. పణమో.. పడేసి.. వారి ఆస్తులను కాపాడుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే భూరికార్డులను దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ చేసేందుకు నడుం బిగించింది. ఇందుకుగాను అన్ని రాష్ట్రాలకు 50 శాతం నిధులు కేటాయించింది. అయినా ప్రక్రియ వేగం పుంజుకోకపోవడంతో వంద శాతం నిధులు కేటాయించి దస్త్రాలను ఆన్‌లైన్ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. భూరికార్డుల ప్రక్షాళనలో భాగంగా రెవెన్యూ అధికారులు భూ యజమానుల నుంచి ఆధార్ కార్డు వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటికీ ఆధార్ వివరాలు సమర్పించని వారి సంఖ్య దాదాపు 10 లక్షలు దాకా ఉంది.

ఫాంహౌస్‌లు.. రిసార్ట్స్ పేరుతో..

అక్రమార్జన కలిగిన చాలామంది ఎక్కువగా ఫాంహౌస్‌లు, రిసార్టుల నిర్మాణానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. నగర శివారుల్లో భూములు కొని, దానిని చుట్టూ ప్రహరీ నిర్మించి మధ్యలో ఓ ఫాంహౌస్ ఏర్పాటు చేసుకుంటారు. దాని యజమాని ఎవరో ఎవరికీ తెలియదు. అక్కడ నిర్వహణ బాధ్యతలను చూసుకునేవారినడిగినా వివరాలు రాబట్ట లేము. వారాంతాల్లో ఇక్కడ పెద్ద ఎత్తున పార్టీలు జరుగుతుంటాయి. నగర శివారుల్లో ఇలాంటి ఫామ్ హౌస్‌లు, రిసార్టులు లెక్కకు మించి ఉన్నాయి. గ్రామాల రెవెన్యూ అధికారులు అటువైపు చూడకపోవడంతో దస్త్రాల్లో తప్ప వాస్తవంగా యజమాని ఎవరనేది తెలుసుకోవడం అసాధ్యమైన విషయంగా ఉంటూ వస్తోంది. కానీ ఆధార్ అనుసం ధానంతో వేల కోట్ల విలువైన తమ భూసామ్రాజ్యాలు నేల కూలక తప్పని పరిస్థితి నెలకొందనే విషయం ఇప్పటికే చాలామందికి అర్థమైంది.

భూములపై పెట్టుబడే శ్రీరామరక్ష..

సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు తమ ఆదాయాన్ని భూములపై పెడితేనే తమ సంపదకు శ్రీరామ రక్ష అని భావిస్తారు. ఇదే దారిలో ఓ ప్రముఖ సినీ నటుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఇబ్బడిముబ్బడిగా భూములను కొనుగోలు చేశాడు. తన ఆర్థిక ప్రగతికి భూములే కారణమని, తన తోటివారికి కూడా భూములపైనే పెట్టుబడి పెట్టండి అంటూ సలహా ఇచ్చేవాడు. ఈ విషయాన్ని ఆయనే పలు సందర్భాల్లో చెప్పాడు. అయితే అక్రమార్కులు కూడా భూములనే ఎంచుకున్నారు. భాగ్యనగరం చుట్టుపక్కల ఒక్కొక్కరి పేరు మీద వందల ఎకరాల భూములు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. రంగారెడ్డి, యదాద్రిభువనగిరి, చౌటుప్పల్ వంటి ప్రాంతాల్లో భూములకు రియల్ ఎస్టేట్ రంగంలో మంచి డిమాండ్ ఉంది. ఇకపోతే.. మెదక్, సంగారెడ్డి, పటాన్‌చెరువు, జీడిమెట్ల వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో వందల ఎకరాలు కొంతమంది చేతుల్లోనే ఉన్నాయి.

'పెట్టుబడి' తీసుకునేందుకు వెనకడుగు

అక్రమార్జనతో బినామీల పేరు కొనుగోలు చేసిన భూముల్లో కొన్నింటిల్లో నేటికి సాగు జరుగుతుంది. ఆయా భూముల యజమానులు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసా యానికి ముందస్తు పెట్టుబడిగా అందజేయనున్న ఎకరానికి రూ.4వేలు పథకాన్ని వదులుకునేందుకు సిద్ధపడుతున్నారు. పథకం కింద లబ్ధి పొందాలంటే.. భూ యాజమాని ఆధార్ సంఖ్యను భూములకు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. అలా చేస్తే.. సదరు వ్యక్తికి ఎక్కడెక్కడ.. ఎంత భూములు ఉన్నాయనే విషయం తెలుస్తుంది. ఫలితంగా ఏ ఆదాయం మేరకు అంత భూములను కొనుగోలు చేశారనే విషయాలను ప్రభుత్వానికి చెప్పాల్సి వస్తుంది. రూ.4వేలు కోసం చూసుకుంటే.. మొత్తానికే ఎసరు వస్తుందనే ఉద్దేశంతో వందల ఎకరాలు కలిగిన భూయాజమానులు పెట్టుబడి రాయితీ వద్దంటూ తిరస్కరిస్తున్నారు. మరీ దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

ఆధార్‌తో వెలుగులోకి..

భూదస్త్రాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తే.. ఇప్పటివరకు దస్త్రాలకు పరిమితమైన యజమానుల వివరాలు.. ఇక నుంచి ఆన్‌లైన్‌లో ప్రత్యక్ష్య ్యమవుతాయి. ఒక వ్యక్తి ఎక్కడెక్కడో ఉన్న భూముల వివరాలు(అన్ని సర్వే సంఖ్యలు) ఒకే ఖాతా కిందకు వస్తాయి. ఆ ఖాతా సంఖ్యను సంబంధిత యాజమాని ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేస్తారు. ఇదే తరహాలో రాష్ట్రావ్యాప్తంగా ఉన్న భూయజమానుల భూవివరాల్ని ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమవుతాయి. దీంతో ఎవరికీ ఎక్కడ భూములు ఉన్నాయనే విషయం స్పష్టమవుతుంది. అయితే ఇప్పటిదాకా బినామీలుగా కొనసాగిన వారి ఆధార్ సంఖ్యను ఇస్తే ఎలా ఉంటుందనే విషయంపైనా అక్రమాల్లో తలపండిన మేధావులు ప్రయత్నించారు. కానీ బినామీ పేరుతో ఆధార్ సంఖ్య అనుసంధానం అయితే.. ఇకపై అది పూర్తిస్థాయిలో వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పించినట్టవుతుందని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు బినామీలు ఆధార్ ఇచ్చేందుకు వెనకడుగు వేస్తున్నారు. వారి భూములకు తమ ఆధార్ సంఖ్యను అనుసంధానం చేస్తే.. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి ఆదాయపరమైన విషయాల్లో చిక్కులు ఎదుర్కొవాల్సి వస్తుందనే ఉద్దేశంతో నిరాకరిస్తున్నారు.

ప్రకృతి ఒడిలో.. ఒళ్లంత తుళ్లింత!

భూపాలపల్లి అడవుల్లో 'ఎకో టూరిజం'

- అందుబాటులోకి మూడు ప్యాకేజీలు..
- సాహస క్రీడలకూ చోటు..: అటవీ శాఖ



హైదరాబాద్, మార్చి 2(మనం ప్రతినిధి): ఎటుచూసినా దట్టమైన అడవి.. చుట్టూ అందమైన ప్రకృతి ప్రసాదించిన అందాలు.. ఓవైపు గలగల పారేటి సెలయేర్లు.. మరోవైపు పక్షుల కిలకిలరావాలు. ఇవన్నీ తెలంగాణ అడవుల్లో నిక్షిప్తమయ్యాయి. వీటిని ప్రజలు అస్వాదించేందుకు ప్రభుత్వం 'ఎకో టూరిజం' పేరుతో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా భూపాలపల్లిలోని అడవులను సందర్శించేందుకు తెలంగాణ అటవీ శాఖ ప్రత్యేక ప్యాకేజీలను ప్రవేశపెట్టింది. ఈ ప్యాకేజీల ద్వారా భూపాలపల్లి జిల్లాలోని ఎకో టూరిజం ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి పెరగనుంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు సందడి చేస్తున్నారు. తాజాగా ఈ ప్యాకేజీలు అందుబాటులోకి రావడంతో భాగ్యనగరంతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు, యువత అధికంగా వచ్చే అవకాశం ఉంది.



సందర్శించే ప్రాంతాలు..

ఈ ప్రత్యేక ప్యాకేజీల్లో భాగంగా ఏటూరు నాగారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, లక్నవరం లేక్, బొగతా జలపాతం, సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంతం, కాళేశ్వరం గుడి, ప్రతాపగిరి కోట వంటి ప్రాంతాలను పర్యాటక ప్రేమికులకు చూపించనున్నారు.

ఒకట్రెండు రోజులు అడవిలోనే..

ఈ ప్రాంతాలను సందర్శించేందుకు అటవీ శాక మూడు ప్రత్యేక ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పర్యాటకులు ఒకట్రెండు రోజులు అడవిలోనే గడిపేందుకు వీలుగా తాడ్వాయి హట్స్ కూడా కొత్తరూపు సంతరించుకున్నాయి. అడవిలోనే గడిపేందుకు ఇష్టపడే వారి కోసం టెంట్లను ఏర్పాటు చేసి రాత్రి పూట బస చేసే సౌకర్యాన్ని కల్పిస్తోంది.

ప్యాకేజీ వివరాలు ఇవీ..

అడవి ప్రాంతంలో సైక్లింగ్, ట్రెక్కింగ్, పర్యావరణంపై అవగాహన కల్పించే సెంటర్ సందర్శన, ఆదిమ మానవుల గుహలు, బ్లాక్ బెర్రీ ద్వీపం, కొండేటి వ్యూ పాయింట్ వంటి ప్రాంతాలకు ఒక రోజు బస, భోజన సౌకర్యం, గైడ్‌తో కలిపి ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున ఒక ప్యాకేజీ ఉంది. ఇదికాకుండా లక్నవరం ఫెస్టివల్‌లో భాగంగా మరో ప్యాకేజీని అందుబాటులోకి తెచ్చింది. ఇందులో రాత్రిపూట టెంట్లలో బస, క్యాంప్ ఫైర్, బోటింగ్, ద్వీపం సందర్శన, అడవిలో ట్రెక్కింగ్, ఎడ్ల బండిపై విహారం, లేక్ వ్యూ సఫారి ఉంటాయి. ఈ ప్యాకేజీకి ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. మూడో ప్యాకేజీలో భాగంగా పాండ వుల గుట్ట సందర్శన ఉంటుంది. ఇక్కడ రాక్ క్లైంబింగ్, రాప్లింగ్, ట్రెక్కింగ్, బౌల్డరింగ్ వంటి సహాస క్రీడలను ఇష్టపడే వారి కోసం తెలంగా ణ అటవీ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సహాస క్రీడలను నిపుణుల సహకారంతో అస్వాదించవచ్చు. ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు (మధ్యలో భోజనంతో కలుపుకుని) ఒక్కొక్కరికి రూ.500 చెల్లించే విధంగా ప్యాకేజీని రూపొందించారు. పర్యాటకులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎకోటూరిజం.భూపాలపల్లి.కామ్ వెబ్‌సైట్, ఎకో టూరిజం సమన్వయకర్త సుమన్‌ను ఫోన్ నంబర్:73826193963లో సంప్రదించి ప్యాకేజీని బుక్ చేసుకోవచ్చు.



తెలంగాణ వ్యాప్తంగా గుర్తిస్తున్నాం..

తెలంగాణ వ్యాప్తంగా అడవుల్లో దాగి ఉన్న కొత్త వ్యూ పాయింట్లు, జల పాతాలు, ఇతర అటవీ అందాలను గుర్తిస్తున్నాం. పర్యావరణహిత, పర్యాటకాని కి అనువుగా ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

- పీకే ఝా, పీసీసీఎఫ్

'నీట్'గా నిర్వహించండి

- ఎలాంటి తప్పులు జరగొద్దు.. వైద్య విద్య పీజీ అడ్మిషన్లపై మంత్రి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మార్చి 2: మొదటిసారి నేషనల్ పూల్‌లో మన రాష్ట్రం చేరినందున మరింత జాగ్రత్తగా వైద్య విద్య (నీట్) పీజీ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించాలని మంత్రి లక్ష్మారెడ్డి సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. త్వరలో నిర్వహించనున్న నీట్ పీజీ అడ్మిషన్లపై మంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఎండీ, ఎంఎస్, పీజీ డిప్లొమా కోర్సుల్లో అడ్మిషన్లు ఈ సారి 'నీట్' ప్రకారం జరగనున్నాయని వెల్లడించారు. 50 శాతం సీట్లను నేషనల్ పూల్‌కి వదలాల్సి ఉందన్నారు. అలాగే మన రాష్ట్ర విద్యార్థులు దేశ వ్యాప్తంగా ఇతర ప్రాంతాల్లోనూ అడ్మిషన్లు పొందడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. ఆ రకంగా 8వేల మందికి అవకాశాలు లభించవచ్చన్నారు. తాజా పరిస్థితులకు అనుగుణంగా అడ్మిషన్ల ప్రక్రియను రూపొందించుకోవాలని, సజావుగా జరిగే విధంగా చూసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సమావేశంలో తెలంగాణ వైద్య సేవలు, మౌలిక వసతుల కల్పనా సంస్థ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్ల ఆస్పత్రి నమూనాను పరిశీలిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్లలో 100 పడకల ఆస్పత్రి

- 20 కోట్ల వ్యయంతో నిర్మాణం.. త్వరలో శంకుస్థాపన.. ఏడాదిలో పూర్తి
- నమూనాలు పరిశీలించిన మంత్రి లక్ష్మారెడ్డి

హైదరాబాద్, మార్చి 2: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో రూ.20 కోట్ల వ్యయంతో 100 పడకల హాస్పిటల్ నిర్మించనున్నారు. త్వరలో శంకుస్థాపన చేసి ఏడాదిలో పూర్తి చేస్తామని మంత్రి లక్ష్మారెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన నిర్మాణ నమూనాలను మంత్రి శుక్రవారం పరిశీలించారు.జడ్చర్ల(బాదేపల్లి)లో చాలా కాలంగా 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం పని చేస్తున్నది. కాల క్రమేణా గ్రామంగా ఉన్న బాదేపల్లి, జడ్చర్లలు కలిసి విస్తరించాయి. రోగుల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. ఇందుకు అనుగుణంగా వైద్యశాలను విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన డిజైన్లను పరిశీలించిన మంత్రి త్వరలో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆస్పత్రిలోకి అవసరమైన పరికరాలను అత్యాధునికమైనవి తీసుకోవాలని సూచించారు.



కాళేశ్వరం వేగం పెంచండి

- అనంతగిరి, రంగనాయకి సాగర్
- పనులను జూన్ కల్లా పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి హరీశ్ ఆదేశం

హైదరాబాద్, మార్చి 2: కాళేశ్వరం ప్రాజెక్టు పనులలో భాగంగా సిద్దిపేట జిల్లాలో చేపడుతున్న పనుల్లో వేగం పెంచాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. సిద్ధిపేట, రాజన్న సిరిసిల్లా జిల్లాలోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ఆయా ప్యాకేజీలలోని పనులలో వేగం పెంచాలని,.కాళేశ్వరం ప్రాజెక్టు పనులకు సంబంధించి అనుకున్న లక్ష్యాలను సాధించేలా, పనులు వేగవంతం చేసేలా ప్రతి ఒక్కరూ తమ విధులు నిర్వర్తించాలని ఇరు జిల్లాల అధికారులకు మంత్రి సూచించారు. శుక్రవారం కాళేశ్వరం పనులపై సిద్దిపేట సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతగిరి, రంగనాయకి సాగర్ పనులను జూన్ చివరి కల్లా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు-ప్యాకేజీ 9 పనులు తొందరగా పూర్తి చేయాలని, టన్నెల్ లైనింగ్, పంప్ హౌస్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాజన్న సిరిసిల్లా జిల్లా ఇరిగేషన్ ఈఈ బుచ్చిరెడ్డిని ఆదేశించారు.కాళేశ్వరం ప్రాజెక్టు -9వ ప్యాకేజీ పనులలో భాగంగా టన్నెల్, సర్జిపుల్, పంప్ హౌస్ నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అనంతగిరి రిజర్వాయరు-బండ్ 3 పనులు నెల రోజులలో పూర్తి చేయాలని క్వాలిటీ కంట్రోల్- నాణ్యత-నియంత్రణ అధికారులను ఆదేశించారు. నిత్యం క్షేత్రస్థాయిలో పనులు పరిశీలన చేయాలని సూచనలు చేశారు. అనంతగిరి రిజర్వాయరు భూ సేకరణ పనులను తొందరగా పూర్తి చేసినందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్, ఆ జిల్లా అధికార యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు. రంగనాయక సాగర్ పనులు వేగవంతం చేసేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని మంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు వెంకటరామిరెడ్డి, కృష్ణభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో రియల్ జోరు

అన్నివిధాలా సహకరిస్తాం.. నిర్మాణరంగానికి తోడ్పాటు: ఈటల.. క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం

- జీఎస్టీని 6 శాతానికి తగ్గించండి
- సర్కారుకు క్రెడాయ్ విజ్ఞప్తి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో క్రెడాయ్ ప్రతినిధులు

హైదరాబాద్, మార్చి 2 (మనం ప్రతినిధి): మూడన్నర సంవత్సర కాలంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా తెలంగాణ ప్రభుత్వం అందించిన స్ఫూర్తి, ప్రోత్సాహంతో రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ రంగాలు వేగం పుంజుకున్నాయని మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఆ రంగాల్లో విశ్వాసం కలిగించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని అభిప్రాయపడ్డారు. క్రెడాయ్ మరింతగా ఎదగాలనీ, దేశవ్యాప్తంగా విస్తరించాలని, ఆ వృద్ధిలో తెలంగాణ పురోగతి కూడా ఉంటుందని అన్నారు. క్రెడాయ్ ఆధ్వర్యంలో 'హైదరాబాద్ రైజింగ్' పేరుతో మూడు రోజుల పాటు హైటెక్స్‌లో నిర్వహిస్తున్న ప్రాపర్టీ షో ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని నిర్మాణ రంగం పది లక్షల పైచిలుకు మందికి ఉద్యోగాలను అందిస్తోందని, తెలంగాణ రాష్ట్ర జీఎస్‌డీపీ గ్రోత్ రేట్ 8 లక్షల కోట్లయితే, క్రెడాయ్ వాటా 40 వేల కోట్లని, ఇది చిన్నమొత్తం కాదని ఆయన తెలిపారు. రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ రంగాలు తెలంగాణ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించే దిశగా దృష్టి సారించాలని, ప్రధానంగా ఇంజనీరింగ్, పీజీ చదివిన ఫస్ట్ జనరేషన్ గ్రామీణ విద్యార్థులకు ఉద్యోగాలు అందించాలన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నామని, ప్రజలను పనివైపు తీసుకెళ్లేందుకు, వారి స్కిల్స్ పెంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. భూములు, ప్లాట్లు కొనేందుకు ఒకనొక సమయంలో భయాందోళనలో ఉండేదని, అభద్రతాభావం వెంటాడేదని కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఆ భయాలన్నీ పోయి విశ్వాసం పెరిగిందన్నారు. కబ్జాలు, గూండాగిరి లేకుండా చేయడంలో తెలంగాణ ప్రభుత్వం కృషి దాగుందన్నారు. దేశంలోనే లా అండ్ ఆర్డర్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను దేశంలోనే తొలిగా ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానికి దక్కుతుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ కార్యక్రమాలకు ఆతిథ్యం ఇవ్వడంలో ప్రపంచ చిత్రపటంపై హైదరాబాద్ చెరగని ముద్ర వేసిందన్నారు. మౌలిక వసతుల కల్పన పరంగా కూడా నగరం గొప్పగా ఉంటుందన్నారు. దేశంలోనే అర్థికంగా ఎదిగే రాష్ట్రం తెలంగాణ అని వ్యాఖ్యానించారు. ఈ కారణాలతో పాటు, నగరంలో ఉండేందుకు, పెట్టుబడులు పెట్టేందుకు ఎంతోమంది ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. సామాన్య ప్రజల అవసరాలను, కలలను నెరవేర్చిన నగరం హైదరాబాద్ అని అన్నారు. ప్రజల మన్ననలు పొందే, హర్షించే సంస్కరణలు రావాలని ముఖ్యమంతి కేసీఆర్ కాంక్షిస్తారని, అందుకు అనుగుణంగానే తెలంగాణ ప్రభుత్వం అనేక సాహోసోపేతమైన నిర్ణయాలు తీసుకుందని చెప్పారు.

రియల్ ఎస్టేట్‌కు అత్యుత్తమ నగరం: రామిరెడ్డి

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగానికి అత్యుత్తమ సంవత్సరంగా ఇది నిలుస్తుందని, మౌలిక వసతులు, జరుగుతున్న అభివృద్ధి పరంగా ఇతర నగరాలతో పోలిస్తే ప్రాపర్టీ ధరలు ఇక్కడ చాలా తక్కువని క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ ఎస్. రామిరెడ్డి అన్నారు. నగరంలో ఆస్తులను కొనుగోలు చేయాలనుకునే కొనుగోలుదారులకు సహాయ పడేందుకు అన్ని ప్రాజెక్టులనూ ఒకే దరికి చేర్చామన్నారు. డెవలపర్లు ఆకర్షణీయమైన ఫైనాన్స్ అవకాశాలతో పాటు, ప్రమోషనల్ స్కీములను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. నిర్మాణ సమయంలో విద్యుత్ పరంగా కమర్షియల్ చార్జీలు వసూలు చేయకుండా నామినల్ చార్జీలు వసూలు చేయాలని, తక్కువ ధరలో నీళ్లు సమకూర్చాలని మంత్రికి ఆయన విన్నవించారు. చార్జీలు రెవెన్యూలో కట్టడం వల్ల సమయం చాలా వృథా అవుతుందని అలా కాకుండా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలో చెల్లించే దిశగా చర్యలు చేపట్టాలని మంత్రికి విన్నవించారు. జీఎస్టీ చార్జీలను 6శాతానికి తగ్గించేందుకు ప్రయత్నించాలని, దాని ద్వారా సామాన్యులపై భారం పడదని మంత్రికి ఆయన తెలిపారు. సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీ ప్లాంట్) కోసం కూడా విద్యుత్ చార్జీలు తక్కువగా తీసుకోవాలని మంత్రిని కోరారు. రానున్న మూడేళ్లలో హైదరాబాద్‌లో ప్రత్యక్షంగా 3 లక్షల ఉద్యోగాలు, పరోక్షంగా వేలాది మందికి ఉద్యోగాలు అం దిస్తామన్నారు. కార్యక్రమంలో క్రెడాయ్ ఉపాధ్యక్షుడు ఆదిత్యాగౌర, ఆనంద్‌రెడ్డి, డాక్టర్ ఎంఎస్.ఆనంద్‌రావు, డి.మురళీకృష్ణ, కోశాధికారి కె.రాజేశ్వర్, జాయింట్ కార్యదరుశులు వి.రాజేశ్వర్‌రెడ్డి, సీజీ.మురళీమోహన్, క్రెడాయ్ సీనియర్ ప్రతినిధులు, డెవలపర్లు, స్టేక్ హోల్డర్లు, ఇండస్ట్రీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'ఫారెస్టు బీట్ ఆఫీసర్ల' ఫలితాలు వాయిదా

- టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 2 (మనం లీగల్ ప్రతినిధి): తెలంగాణలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాల్ని రెండు నెలలపాటు నిలిపివేయాలని హైకోర్టు న్యాయమూర్తి ఎంఎస్ రామచందర్‌రావు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఆదేశించారు. అటవీ శాఖలో 1857 బీట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సర్వీస్ కమిషనర్ జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ మాజీ సైనిక ఉద్యోగి రఘుపతిరెడ్డి వేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు శుక్రవారం విచారించి మధ్యంతర ఆదేశాలిచ్చింది. మాజీ సైనికులకు రెండు శాతం పోస్టుల్ని రిజర్వు చేయాలని, తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉద్యోగ నోటిఫికేషన్ ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. అయితే గతేడాది అక్టోబర్‌లో నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాలను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు రెండు నెలల పాటు నిలిపివేయాలని హైకోర్టు ఆదేశించింది.ప్రతివాదులైన సర్వీస్ కమిషన్ సెక్రటరీ, అటవీ శాఖ కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది.

ఏపీ డీఎల్ ఫలితాల్లో టాపర్ తెలంగాణ వాసి

- ప్రథమస్థానంలో నిలిచిన కుర్మేటి సుధాకర్

హైదరాబాద్, మార్చి 2(మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లోని డిగ్రీ కాలేజీ లెక్చరర్(డీఎల్) పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో తెలంగాణలోని నల్గొండ జిల్లా చింతపల్లి మండలం ఘడియగౌరారం గ్రామానికి చెందిన కుర్మేటి సుధాకర్ టాపర్‌గా నిలిచాడు. సుధాకర్ పదో తరగతి వరకు ఘడియగౌరారం, ఇంటర్‌ను భువనగిరిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో చదివాడు. డిగ్రీ నల్గొండలోని ఎన్జీ కళాశాలలో పూర్తి చేయగా, పోస్టు గ్రాడ్యుయేషన్(ఎంఎస్సీ, జువాలజీ) ఉస్మానియాలో పూర్తి చేశాడు. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో జువాలజీ విభాగంలో ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేస్తున్నారు. 2013లో సీఎస్ఐఆర్ పరీక్షలో అర్హత సాధించి జూనియర్ రీసర్చ్ ఫెలోషిప్‌ను సాధించాడు. 2017లో నిర్వహించిన టీఎస్ సెట్‌లోనూ అర్హత సాధించిన సుధాకర్, డిగ్రీ అధ్యాపక పోస్టులకు ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో 500 మార్కులకు 350.35 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు.

ఊపందుకున్న ఉత్తరాల ఉద్యమం

- సీఎంకు చేరిన 2.2 లక్షల పోస్టు కార్డులు
- తక్షణం 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి: కోదండరాం

హైదరాబాద్, మార్చి 2 (మనం ప్రతినిధి): నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి తెలంగాణ జేఏసీ చేపట్టిన పోస్టు కార్డు ఉద్యమం తార స్థాయికి చేరిందని టీజేఏసీ చైర్మన్ కోదండరాం స్పష్టంచేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగులు సమస్యలపై తెలంగాణ సర్కారులో చలనం తెచ్చేందుకు జనవరి 22న మొదలుపెట్టిన ఉత్తరాల ఉద్యమం తక్కువ రోజుల్లోనే ఊపందుకొని ప్రజల్లోకి వెళ్లిందన్నారు. ఇప్పటి వరకు దాదాపు 2.2 లక్షల మంది నిరుద్యోగులు సీఎంకు ఉత్తరాలు రాశారని కోదండ రాం తెలిపారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు రాసిన కొన్ని ఉత్తరాలను కోదండరాం చదివి వినిపించారు. తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ చచ్చుడో అని గతంలో సీఎం కేసీఆర్ చెప్పారని, ఇప్పుడు ఉద్యోగాలు ఇస్తారో కేసీఆర్ చస్తారో అని ఉత్తరాల ద్వారా విద్యార్థులు నిరసన తెల్పుతున్నారని ఆయన పేర్కొన్నారు. తక్షణం 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని, లేకపోతే నిరుద్యోగుల ఉసురు ఈ ప్రభుత్వానికి తగులుతుందని అన్నారు. శుక్రవారం నిరుద్యోగ సమస్యపై తాను స్వయంగా సీఎం కేసిఆర్‌కు ఒక పోస్టు కార్డు రాసినట్లు కోదండరాం తెలిపారు.

కేంద్రంపై యుద్ధానికి సై

- మార్చి 5 నుంచి బడ్జెట్ సమావేశాలు
- బీజేపీతో అమీతుమీకి టీఆర్ఎస్ ఎంపీలు రెడీ
- నేడు ప్రగతిభవన్‌లో పార్లమెంటరీ సమావేశం
- హాజరవుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్
- ఎంపీలకు దిశానిర్దేశం చేయనున్న సీఎం



హైదరాబాద్, మార్చి 2 (మనం ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు టీఆర్ఎస్ ఎంపీలు సిద్ధమయ్యారు. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటా, పెండింగ్ బిల్లులు, విభజన చట్టం హామీలు, హైకోర్టు విభజన తదితర అంశాలపై అమీతుమీకి రెడీ అయ్యారు. మార్చి 5వ తేదీ నుంచి పార్లమెంట్‌లో జరిగే బడ్జెట్ సమావేశాల్లో తాడోపేడో తేలుస్తామని టీఆర్ఎస్ ఎంపీలు చెబుతున్నారు. సభలో ఎలా వ్యవహరించాలో అనే అంశంపై (నేడు) శనివారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో పార్లమెంటరీ సమావేశం నిర్వహిస్తున్నారు. సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎంపీలంతా వ్యూహరచన చేయనున్నారు. తెలంగాణ హక్కుల సాధన కోసం ఎంతవరకైనా సరేనన్న ధోరణిలో ఎంపీలు ఉండడంతో శనివారం జరిగే పార్లమెంటరీ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదే చివరి బడ్జెట్ సెషన్ కావడంతో టీఆర్ఎస్ ఎంపీలు పట్టుదలతో ఉన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న అంశాల అమలులో జరుగుతున్న జాప్యంపై సభలో గళమెత్తేనున్నారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కేంద్రం ఇవ్వాల్సిన బయ్యారం ఉక్కు కర్మాగారం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, అసెంబ్లీ స్థానాల పెంపు, ఎయిమ్స్, హైకోర్టు విభజన, ట్రైబల్ యూనివర్సిటీ హామీలను ప్రధానంగా ప్రస్తావించనున్నారు. వీటితో పాటు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అసెంబ్లీలో చేసి పంపిన పలు తీర్మాణాలపై కూడా మాట్లాడనున్నారు. మహిళా బిల్లు, బీసీలకు చట్ట సభలో రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ, మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా, లంబాడీలకు రిజర్వేషన్లు, బైసాన్ పోలో గ్రౌండ్‌లో నూతన సచివాలయానికి అనుమతితో పాటు పలు అంశాలపై శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. ఎకరాకు నాలుగువేలు పెట్టుబడి పథకాన్ని కూడా కేంద్రం ముందు ఉంచినట్లు తెలుస్తోంది. ఆయా తీర్మానాలపై ఎలాంటి స్పందన లేకపోవడంతో కేంద్రం తీరుపై టీఆర్ఎస్ నేతలు చాలాకాలంగా గుర్రుగా ఉన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో సాధ్యమైనంత వరకు కేంద్రం నుంచి సాధించుకోవాలని నేతలు భావిస్తున్నారు.

కొనసాగుతున్న మాటల యుద్ధం

ఎన్నికలు సమీపిస్తుండడంతో టీఆర్ఎస్ నేతలు ఇటీవల అవకాశం చిక్కినప్పుడల్లా కేంద్రాన్ని టార్గెట్ చేస్తున్నారు. రెండు రోజుల కిందట కరీంనగర్‌లో జరిగిన రైతు సమన్వయ సమితి సభలో సీఎం కేసీఆర్ ప్రధాని మోదీపై విరుచుకుపడ్డారు. 'మోదీ గాడు' అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. ప్రసంగంలో భాగంగా దొర్లిన చిన్న తప్పు అని, ఉద్దేశపూర్వకంగా చేసిన వ్యాఖ్యలు కావని ఎంపీ కవిత వివరణ ఇచ్చారు. పొరపాటును కేసీఆర్ నొరుజారారని కేటీఆర్ తనతో అన్నాడని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. వివరణల సంగతి ఎలా ఉన్నా టీఆర్ఎస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. సోమవారం పార్లమెంట్‌లో జరిగే బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైతే కానీ టీఆర్ఎస్ ఎంపీల చేసిన వ్యూహాలు ఏమిటి, కేంద్రం నుంచి ఎంత మేరకు సాధిస్తారు అనే విషయాలు తెలుతాయి.




ఆవేదనతోనే విలీన వ్యాఖ్యలు

- కార్యకర్తలు క్షమించాలి.. టీఆర్ఎస్‌తో పొత్తుకు సిద్ధమే..
- జీవితాంతం బాబు నేతృత్వంలోనే పనిచేస్తా
- చంద్రబాబుకు నేను తమ్మున్ని..పార్టీని వీడబోను
- రేవంత్ పార్టీని భ్రష్టుపట్టించాడు: మోత్కుపల్లి నర్సింహులు

హైదరాబాద్, మార్చి 2(మనం ప్రతినిధి): టీటీడీపీని టీఆర్ఎస్‌లో విలీనం చేయాలని వ్యాఖ్యానించిన మోత్కుపల్లి నర్సింహులు ఎట్టకేలకు తన వ్యాఖ్యలపై కార్యకర్తలకు క్షమాపణ చెప్పారు. పార్టీ దుస్థితిని చూసి తట్టుకోలేక ఆవేదనతో అలా వ్యాఖ్యానించానని చెప్పారు. జీవితాంతం చంద్రబాబు నాయకత్వంలోనే పనిచేస్తానని, పార్టీని వీడేదిలేదని మోత్కుపల్లి స్పష్టంచేశారు. శుక్రవారం ఆయన ఇక్కడి తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో టీడీపీని బలపరిచేందుకు కృషిచేస్తానని చంద్రబాబునాయుడు ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బాబు తప్ప మరెవరూ పార్టీని చక్కదిద్దలేరని అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన టీటీడీపీ సర్వసభ్య సమావేశంలో చంద్రబాబు చెప్పినట్టు టీఆర్ఎస్‌తో పొత్తు మాత్రమే ఉంటుదని, విలీనం ఉండబోదని మోత్కుపల్లి అన్నారు. టీఆర్ఎస్‌తో పొత్తు వల్ల కేడర్‌లో మనోస్థైర్యం వస్తుందని అభిప్రాయపడ్డారు. కేసీఆర్ సహా టీఆర్ఎస్‌లో ఉన్నవాళ్లంతా ఎన్టీఆర్, చంద్రబాబు శిష్యులైనందున ఆ పార్టీతో కలిసి పనిచేయడంలో ఇబ్బందేమీ ఉండదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాను బాబుకు అన్ని విధాలుగా అండగా ఉన్నానని మెత్కుపల్లి చెప్పారు. సర్వసభ్య సమావేశానికి తనను పిలవకపోవడం, చంద్రబాబు కూడా ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంతో ఏడుపొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ఏమిచ్చినా, ఇవ్వకపోయినా తాను ఆయనకు తమ్ముడి నేనని, ఈ విషయం బాబుకు కూడా తెలుసునని మోత్కుపల్లి వ్యాఖ్యానిం చారు. ఓటుకు నోటు కేసుతో రేవంత్‌రెడ్డి చంద్రబాబుకు తలవంపులు తీసుకొ చ్చాడని మోత్కుపల్లి విమర్శించారు. ఆనాడే రేవంత్‌ను సస్పెండ్ చేసుంటే టీటీడీపీకి ఇప్పుడు ఈ దుస్థితి వచ్చేదికాదన్నారు. బాబు ఎంతో నమ్మకంతో పార్టీ నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే రేవంత్ పార్టీని భ్రష్టుపట్టించాడని ధ్వజమెత్తారు. అతను పార్టీని బజారుకీడుస్తుంటే ప్రశ్నించడంలో, అడుకోవడంలో టీటీడీపీ నాయకత్వం విఫలమైందని మోత్కుపల్లి ఆరోపించారు. తాను ఎప్పటికీ చంద్రబాబు నాయకత్వంలోనే పనిచేస్తానని స్పష్టం చేసిన మోత్కుపల్లి, ఆయన ఏ బాధ్యతలు అప్పజెప్పినా స్వీకరిస్తానని తెలిపారు.

అలీబాబా ఔర్ చార్‌చోర్

- రైతులపై ముఖ్యమంత్రిది మొసలి కన్నీరు
- టీఆర్ఎస్, బీజేపీ ఆటలాడుతున్నాయి
- శంకరమ్మకు రాజ్యసభ సీటు ఇవ్వండి
- క్రీమీలేయర్ రద్దుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంత్‌రావ్



హైదరాబాద్, మార్చి 2, మనం ప్రతినిధి : ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎంపీ కవిత, సంతోశ్‌కుమార్‌ను 'అలీబాబా ఔర్ చార్‌చోర్' అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావ్ పోల్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో శుక్రవారం వీహెచ్ విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పట్ల మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని ఆరోపించారు. మద్దతు ధర అడిగిన రైతులకు సంకేళ్లు వేయించిన కేసీఆర్, రైతు సంక్షేమం అంటూ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతుల ఆత్మహత్యలు పెరిగా యన్నారు. అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు కానీ, అమరుల కుటుంబాలకు చెందిన వారికి గాని రాజ్యసభ సీటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత కీలక పదవులన్నీ కేసీఆర్ కుటుం బానివేనన్నారు. ప్రస్తుతం రాజ్యసభ సీటును తన బంధువైన సంతోశ్‌కే కేసీఆర్ కేటాయిస్తున్నట్టుగా ప్రచారం జరుగుతుం దన్నారు. ప్రధాని మోదీని కించపర్చే విధంగా కేసీఆర్ మాట్లాడినా రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ పెద్దగా పట్టించుకోకపోవడం విచా రకరమన్నారు. ఇందుకు సంబంధించి కేవలం కేటీఆర్‌ను వివరణ అడిగి సరిపుచ్చుకున్నారన్నారు. తాము ప్రధానిని విమర్శిస్తాం గానీ, కించపర్చేలా మాట్లాడలేదన్నారు. ప్రధానిని కించపర్చేలా మాట్లాడిన కేసీఆర్ క్షమాపణ చెప్పకపోయినా, రాష్ట్రంలోని బీజేపీ నేతలు మిన్నకుండటంలో ఆంతర్యమేమిటన్నారు. బీసీలపై కేసీఆర్ కపట ప్రేమ కనబరుస్తున్నారని ఆరోపించారు. నిజంగా ప్రేమ ఉంటే క్రీమీలేయర్‌ను రద్దు చేయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీజేపీ, టీఆర్ఎస్ దాగుడుమూతలు ఆడుతున్నాయన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, గిరిజన విశ్వవిద్యాలయం, ఐఐఐటీ, రైల్వేకోచ్ ఫ్యాక్టరీల విషయంలో కేంద్రంపై పోరాడటంలో టీఆర్ఎస్ ఎంపీలు విఫలమయ్యారన్నారు. కేసీఆర్ పచ్చిఅవకాశవాది అని విమర్శించారు. తెలంగాణ ఇచ్చిన సోనియానే మోసం చేసిన వ్యక్తి కేసీఆర్ అన్నారు. నక్సల్స్ ఎజెండా మాది, తెలంగాణ వస్తే ఎన్‌కౌంటర్లుండవు అని ఎన్నికల సమయంలో చెప్పారు, ఇప్పుడేమో ఎన్‌కౌంటర్ల పేర నక్సల్స్‌ను చంపుతున్నారని వీహెచ్ విమర్శించారు.

మహబూబ్‌నగర్‌లో నేడు సర్పంచుల సమ్మేళనం

- హాజరుకానున్న మంత్రి జూపల్లి.. నిజామాబాద్‌లో ఈ నెల 5న

హైదరాబాద్, మార్చి 2 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో మూడు చోట్ల సర్పంచుల సమ్మేళనం నిర్వహించేందుకు తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా శనివారం మహబూబ్‌నగర్‌లో సర్పంచుల సమ్మేళనాన్ని నిర్వహిస్తుంది. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. మహబూబ్‌నగర్ జిల్లా అప్పన్నపల్లిలోని వైట్ హౌస్ కన్వెన్షన్ హాల్లో జోగులాంబ-గద్వాల, మహబూబ్‌నగర్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, నల్గొండ, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి జిల్లాల సర్పంచులతో సమ్మేళనం జరుగుతుంది.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
శనివారం, మార్చి 3

కాబూల్ శాంతి ప్రక్రియ

కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో యుద్ధం శాంతిగాను, శాంతి యుద్ధంగాను పరిణామం చెందుతాయన్న నియమం ఆఫ్ఘనిస్థాన్ రాజకీయ పరిణామాల్లో అనేకమార్లు వ్యక్తమైంది. అంతర్యుద్ధపీడిత ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబుల్‌లో జరిగిన ఒక అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో తాలిబాన్ మిలిటెంట్లతో శాంతి కుదుర్చుకునేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అంతమాత్రాన ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ ప్రతిపాదించిన అంశాలతో అక్కడ శాంతి నెలకొంటుందని ఆశించకపోయినా, తాలిబన్ సంస్థను రాజకీయ సంస్థగా గుర్తించడం ఒక శుభ పరిణామం. అందులో భాగంగా తాలిబన్ ప్రతినిధులకు పాస్‌పోర్టులు జారీ చేయడం, కాబూల్‌లో కార్యాలయం ఏర్పాటుకు అవకాశం కల్పించడం వంటి చర్యలు శాంతి ప్రక్రియకు ముందస్తు చర్యలుగా ఉపయోగపడే అవకాశం లేక పోలేదు. ఈ శాంతి సంకేతాలను తాలిబన్‌లు సవ్యంగా ఆమోదించడంపై అనేక సందేహాలున్నాయి. అమెరికా తొత్తు ప్రభుత్వంగా కొనసాగుతున్న అష్రాఫ్ ఘనీ ప్రభుత్వ సూచనలను తాలిబన్ ఎలా పరిగణిస్తుందో వేచి చూడాలి. అమెరికాతో నేరుగా చర్చలు అర్ధాంతరంగా ముగిసిన అనంతరం, మళ్ళీ ఘనీ ప్రభుత్వం ద్వారా కదలిక ప్రారంభం కావడం మంచి పరిణామమని విశ్లేషకుల అభిప్రాయం. తాలిబన్‌తో సాగే శాంతి ప్రక్రియలో, ఆ తర్వాత అభివృద్ధిలో ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వానికి బాసటగా ఉంటామని భారత విదేశాంగ కార్యదర్శి విజయ్ గోఖలే హామీ ఇచ్చారు.

కాబూల్ శాంతి ప్రక్రియ మొదటి విడత చర్చలు ఏడాది కిందట జరిగాయి. ఐక్యరాజ్యసమితి, యూరోపియన్, నాటో ప్రతినిధులతో సహా 23 దేశాలు తాజా కాబూల్ చర్చలకు హాజరయ్యాయి. గతంతో పోలిస్తే అంతర్జాతీయ సమాజంలో తాలిబన్‌ను రాజకీయ పార్టీగా గుర్తించి దేశ ప్రధాన రాజకీయ స్రవంతిలో భాగస్వామి కావాలనే అభిప్రాయం బలపడుతున్నది. 'కాబూల్ ప్రాసెస్' పేరిట సాగుతున్న రెండవ విడత చర్చల సందర్భంగా తాలిబన్‌తో చర్చలకు షరతులేవీ విధించడంలేదని ప్రకటించడం ఆహ్వానించదగ్గ పరిణామం. అయితే అదేసమయంలో తాలిబన్‌లు ఆయుధాలను వదిలిపెట్టాలని, ఘనీ ప్రభుత్వాన్ని, రాజ్యాంగాన్నీ ఆమోదించాలనీ అందుకు ప్రతిగా తాలిబన్‌లకు రాజకీయ పార్టీ హోదా కల్పిస్తామని ఘనీ ప్రకటించారు. సహజంగా సాయుధంగా తలపడే వాళ్ళు ఒకరిపై సాయుధ చర్యలతో ఒత్తిడి పెంచడం ద్వారా తమకు అనుకూలమైన డిమాండ్లను నెరవేర్చుకునే ఎత్తులు వేయడం కద్దు. అదేతీరులో తాలిబన్లు ఈ మధ్యకాలంలో జరిపిన వరుస ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో ఘనీ ప్రభుత్వం శాంతి చర్చల డిమాండ్‌తో ముందుకు వచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. తాలిబన్లు ఈ అవకాశాన్ని వినియోగించుకొని మరింత సాయుధ ఒత్తిడి పెంచే అవకాశమూ లేకపోలేదు. అలాగని దీర్ఘకాలంగా సాయుధ పోరాటంలో కూరుకుపోయి, అనేక నష్టాలతో అతలాకుతలమవుతున్న తాలిబన్ సంస్థ శాంతి ఒప్పందానికి సుముఖంగానే ఉంది. అయితే కీలుబొమ్మ ఘనీ ప్రభుత్వంతో కాకుండా అమెరికాతో చర్చలు జరుపుతామని తాలిబన్ ప్రకటించింది. ఖతార్‌లోని తాలిబన్ కార్యాలయం ద్వారా అమెరికాతో నేరుగా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆఫ్ఘనిస్థాన్ శాంతి ప్రక్రియ నల్లేరుపై బండి నడకలా సాఫీగా జరిగేట్టులేదు.

తాలిబన్ ప్రతిపాదనను అమెరికా తిరస్కరించే పరిస్థితి కూడా లేదు. ఏళ్ళ తరబడి అమెరికా సైన్యం ఆఫ్ఘనిస్థాన్‌లో తిష్ఠవేసినా తాలిబన్‌లను నిర్మూలించక పోగా, జాతీయంగా, అంతర్జాతీయంగా ఒత్తిడి పెరుగుతోంది. అమెరికా సైన్యాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించినప్పటికీ, ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వం, సైన్యం తాలిబన్ మిలిటెంట్ల ధాటికి నిలువరించ లేకపోతే అరుదైన లోహాలు సహా పలురకాల ఖనిజాలు సహజ వనరుల విషయంలో అమెరికా ప్రయోజనాలు దెబ్బతింటాయి. ఈ నేపథ్యంలో అమెరికా సైన్యం లేకపోతే ఆఫ్ఘాన్ ప్రభుత్వం ఉనికే ఉండదు. 'అమెరికాకే ప్రాధాన్యం' అనే విధానాన్ని అమలు చేస్తున్న అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఆఫ్ఘనిస్థాన్ నుంచి సైన్యాన్ని ఉపసంహరించడం ద్వారా ఆర్థిక భారాన్ని వదిలించు కోవాలనుకుంటోంది. అందుకు భారత్‌ను పావుగా వినియోగించుకొని ఆఫ్ఘనిస్థాన్ సహా దక్షిణాసియాలో తమ భౌగోళిక రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను నెరవేర్చుకోవాలని చూస్తోంది. భారత్‌కు అన్నివిధాల సహకారమందిస్తూ ఆఫ్ఘనిస్థాన్ పాలన, అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్‌ను ప్రోత్సహిస్తున్నా ఆశించిన ఫలితాలు రాకపోవడంతో తాలిబన్‌తో నేరుగా శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు అమెరికా ప్రయత్నాలు ప్రారంభించింది. అయితే ఆఫ్ఘనిస్థాన్ ప్రభుత్వం, అమెరికా బలహీనతలను గుర్తించిన తాలిబన్ దాడులకు తెగబడుతూ క్రమంగా నగరప్రాంతాలను వశం చేసుకుంటూ బలపడుతున్నది. ప్రభుత్వ ఆధీనంలో మూడోవంతు భూభాగం కూడా లేదని ఇటీవల బీబీసీ అధ్యయనం వెల్లడించింది. అమెరికా బలగాలు తాలిబన్‌ను సైనికంగా ఓడించగలిగే పరిస్థితి లేకపోవడంతో శాంతి ఒప్పందం తప్ప అమెరికాకు మరో ప్రత్యామ్నాయం లేదు. అదే సమయంలో మూడింట రెండువంతులు భూభాగంలో ఒక సాయుధ సంస్థలాగా కాకుండా, ప్రజా సంక్షేమాన్ని అందించే ప్రభుత్వ పాలనను అందించేందుకు తాలిబన్ చొరవ చూపుతోంది. ఆఫ్ఘాన్ ప్రజలకు లబ్ధిచేకూరే మౌలిక వసతులకు తమ మద్దతు ఉంటుందని, అందులో భాగంగా టర్క్‌మెనిస్థాన్, పాకిస్తాన్, భారత్ సహజ వాయువు పైప్‌లైన్‌కు తమ ప్రాంతంలో భద్రత కల్పిస్తామని తాలిబన్ ప్రకటించడం మంచి పరిణామం. భారత్ సహకారంతో నిర్మించిన నీటి పారుదల ప్రాజెక్టుల వల్ల 75 వేల హెక్టార్ల బీళ్ళు పంటపొలాలుగా మారడమే కాక, ఇరాన్‌లో భారత్ నిర్మించి, నిర్వహణ చేపట్టిన ఇరాన్‌లోని చబహార్ రేవు ఆఫ్ఘానిస్థాన్‌తో రవాణా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇనుప గనుల తవ్వకం, ఉక్కు కర్మాగారం, విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని, సరఫరా మౌలిక సదుపాయాలు, వసతులు రంగంలో భారీ పెట్టుబడులు పెట్టాలని భారత్ ప్రతిపాదిస్తోంది. ఈ నేపథ్యంలో ఆఫ్ఘానిస్థాన్ శాంతి ప్రక్రియలో భారత్ క్రియాశీల పాత్ర పోషించవలసిన అవసరం ఉంది. లేదంటే పాకిస్థాన్ , చైనా దేశాలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటాయి. కానీ తాలిబన్ వంటి కరడుగట్టిన సంస్థతో వ్యవహరించడానికి సహనంతో పాటు నేర్పుకూడా అత్యవసరం.

ఆర్థిక నేరస్థులపై క్రిమినల్ చర్యలు


అభిమతం

దేశంలో 20 ప్రభుత్వరంగ బ్యాంకుల, హెడ్‌డిఎఫ్‌సి, యాక్సిస్, ఐసిఐసిఐ బ్యాంకులలో లక్షల కోట్ల రూపాయలు డిపాజిట్లు ఉండి లాభాల కోసం రుణాలు ఇస్తే, తీసుకున్న రుణాలు చెల్లించలేక చేతులెత్తేస్తే సెక్షన్ 42, 52, 53 ప్రకారం రుణగ్రహీతల ఆస్తులు జప్తులు చేయాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి, ఎ.పి.టి.బి.ఇ.ఎఫ్‌లు సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ప్రభుత్వ బ్యాంకుల నుంచి వివిధ కార్పొరేట్ పెట్టుబడిదారులైన విజయ్‌మాల్యా, హర్షద్‌మెహతా, కేతన్ పరేక్, నీరవ్ మోదీ, కొఠారి తదితరుల్లో కొందరు వేల కోట్ల రూపాయలు తీసుకొని చెల్లించకుండా విదేశాలకు వెళ్లి, జల్సా చేసుకొంటున్నవారి ఆస్తులను స్వాధీనం చేసుకొని బ్యాంకులకు చెల్లించే విధంగా చూడాలి. బ్యాంకులలో అప్పులు తీసుకొని చెల్లించకుండా ఎగగొట్టే ఆర్థిక నేరస్థులను ఆస్తులను స్వాధీనం చేసుకొని వారిపై క్రిమినల్ కేసులు పెట్టి శిక్షించాలి. ప్రభుత్వ బ్యాంకులకు తగిన విధమైన రక్షణ కల్పించాలి. ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లును ఉపసంహరించుకొని బ్యాంకు డిపాజిట్‌దారులకు రక్షణ కల్పించాలి.

- ఉజ్జిని రత్నాకర్ రావు
ప్రధానకార్యదర్శి
ఎఐటియుసి, తెలంగాణ



మంచిమాట



'పూల పరిమళం గాలివాటుకే వెలుతుంది... మనిషి మంచితనం ప్రతి దిక్కుకూ ప్రసరిస్తుంది.'

- చాణక్యుడు

ముందస్తు ఎన్నికలు జరిగేనా?

లోక్‌సభకు, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు సాధ్యమా అన్నది ఇక్కడ ఆలోచించాల్సి ఉంది. 2019 మేలో జరగాల్సిన లోక్‌సభ ఎన్నికలను ముందుకు తీసుకు వచ్చి రాష్ట్రాల శాసనసభల ఎన్నికలతో పాటు జరిపే బదులు, కొన్ని రాష్ట్రాల ఎన్నికలను ముందుకు తీసుకువెళ్లి 2019 మేలో లోక్‌సభ ఎన్నికలతో పాటు జరపడం మంచిదేమో బీజేపీ నాయకత్వం ఆలోచించాలి.



జి. రాజశుక

సచేతన

దేశంలో లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని ఈ మధ్య కాలంలో అనేక వార్తలు వస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ముందుగానే లోక్‌సభను రద్దుచేసి ఈ ఏడాది డిసెంబర్‌లోనే ఎన్నికలు జరిపే అవకాశం ఉందని వదంతులు వ్యాపించాయి. ఈ ఏడాది ఆఖరులోనే చత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల శాసనసభలకు కూడా ఎన్నికలు జరగాల్సి ఉంది. శాసనసభల ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు ఒకేసారి జరపాలని మోదీ చాలాకాలంగా కోరుకుంటున్నారు కాబట్టి, ఈ మూడు రాష్ట్రాల ఎన్నికలతో పాటే లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని పత్రికలు రాస్తున్నాయి. కొన్ని పత్రికలు మరో అడుగు ముందుకు వేసి, మరో వందరోజుల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని కూడా రాశాయి. అంటే ఈ ఏడాది మే నెలలో ఎన్నికలు జరుగుతాయని అవి చెబుతున్నాయన్నమాట.

2014 ఎన్నికల్లో మోదీకి ప్రచారకర్తగా సేవలు అందించిన టెక్నాలజీ నిపుణుడు రాజేశ్ జైన్ తరచూ చేసే వ్యాఖ్యలు, వ్యాఖ్యానాలు కూడా ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. 2014 తర్వాత నుంచి మోదీ నాయకత్వంలోని బీజేపీ సీట్లు క్రమంగా తగ్గుతున్నాయే తప్ప ఏమంత పెరగడం లేదంటూ ఆయన ఈ మధ్య ఓ పత్రికలో కాలమ్ రాశారు. మళ్లీ తన బలాన్ని నిరూపించుకోవాలంటే మోదీకి ముందస్తు ఎన్నికలకు వెళ్లడం తప్ప మార్గం లేదన్నట్టుగా ఆయన రాశారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లడానికే మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా సుముఖంగా ఉన్నారని, ఎంత ముందుగా ఎన్నికలకు వెళతారన్నది చెప్పలేమని బీజేపీ నాయకులు కూడా అడపాదడపా సూచనలు వదులుతున్నారు. మామూలుగా అయితే 2019 మేలో ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇటీవలి బడ్జెట్ సమావేశాల్లో మోదీ చేసిన ప్రసంగం ఎన్నికల ప్రచారంలా ఉందన్న సంగతి వారు గుర్తు చేస్తున్నారు.

వచ్చే ఏడాది వరకూ మోదీ ఎన్నికలు జరపకుండా ఆగడమంటే, ప్రజాభిమానం మరింత దూరం కావడం తప్ప ప్రయోజనం లేదు. ప్రభుత్వ వ్యతిరేకత రానురానూ పెరిగిపోతున్న సంగతి బీజేపీ అగ్రనాయకులు కూడా గ్రహించే ఉన్నారు. నిరుద్యోగ సమస్య క్రమక్రమంగా పెరిగిపోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల కష్టనష్టాలు కూడా పట్టణాల వరకూ వినిపిస్తున్నాయి. మరోపక్క చమురు ధరలు పెరుగుతూ నిత్యావసరాల ధరలను ఆకాశానికి చేరుస్తున్నాయి. ఈ ఏడాది సరిగ్గా వర్షాలు పడలేదంటే మోదీ సమస్యలు పేట్రేగిపోవడం ఖాయం. ఈ కారణాలన్నిటి కంటే, హఠాత్తుగా ఓ నిర్ణయం తీసుకుని ప్రజలను, ప్రతిపక్షాలను దిగ్భ్రాంతుల్ని చేయడం కూడా జరగవచ్చు. అవతలివారిని ఆశ్చర్యచకితుల్ని చేస్తూ ఆకస్మిక నిర్ణయాలు తీసుకోవడమంటే మోదీకి ఎంతో ఇష్టం. హఠాత్తుగా ముందస్తు ఎన్నికలు ప్రకటిస్తే, ప్రతిపక్షాలకు కూడగట్టుకోవడానికి సమయం ఉండదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమర్థంగా ప్రచారం చేయడానికి కూడా పెద్దగా అవకాశం ఉండదు.

చుట్టూరా సమస్యలు, సంక్షోభాలు

ఈ ఊహాగానాలు, ఆలోచనలు ఎలా ఉన్నా ఒక్కటి మాత్రం నిజం. గ్రామీణ ఆర్థికరంగం విషయంలో, ముఖ్యంగా చిన్న రైతుల విషయంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకత ఎదుర్కుంటోంది. గ్రామీణ ఆర్థికరంగం ఓ సంక్షోభంలో చిక్కుకుని ఉంది. అసలు దేశ ఆర్థిక వ్యవస్థే మందకొడిగా ముందుకు అడుగులు వేస్తోంది. ప్రైవేట్ పెట్టుబడులు పెరగడం లేదు. ప్రభుత్వం ఒకపక్క బ్యాంకులకు ఆర్థిక సహాయం పెంచుతోంది. రాని బాకీలతో అవస్థలు పడుతున్న బ్యాంకులను ఆర్థికంగా ఆదుకునే ప్రయత్నాలు చేస్తోంది. మరోపక్క పెద్దయెత్తున జాతీయ ఆరోగ్య బీమా పథకాన్ని చేపట్టింది. కానీ, ప్రభుత్వం ఓటర్లను తన వైపునకు తిప్పుకోవడానికి మాత్రం మరెంతో చేయాల్సి ఉంది.



బీజేపీ నాయకత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డీఏ)లో లుకలుకలు దేశప్రజలు గమనించకపోలేదు. మిత్రపక్షాలతో బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు కూడా బీజేపీ వ్యతిరేకతను పెంచి పోషిస్తోంది. ముఖ్యంగా శివసేన, తెలుగుదేశం పార్టీలతో వివిధ సందర్భాలలో తలెత్తిన విభేదాలకు అటు నరేంద్ర మోదీ నుంచి గానీ, ఇటు అమిత్ షా నుంచి గానీ సరైన స్పందన వ్యక్తం కాకపోవడం అగ్నికి ఆజ్యాన్ని తోడు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగుదేశం ప్రభుత్వానికి రాష్ట్ర విభజన సందర్భంగా చేసిన వాగ్దానాల్లో ఒక్క వాగ్దానాన్ని కూడా కేంద్రం సంతృప్తికరంగా పరిష్కరించకపోవడం దేశ రాజకీయాలపై తప్పనిసరిగా ప్రభావం కలగజేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇస్తామని పార్లమెంట్‌లో ప్రకటించిన బీజేపీ చివరికి దాన్ని ప్రత్యేక ప్యాకేజీగా కూడా సక్రమంగా ఇవ్వకపోవడం ఆ పార్టీ పట్ల వ్యతిరేకతను పెంచేదే తప్ప బలం చేకూర్చేదిగా లేదు.

ఇక మోదీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు గడుస్తున్నా తమకు ఒరిగిందేమీ లేదని మధ్యతరగతి ఆందోళన, ఆవేదన వ్యక్తం చేస్తోంది. అధికారంలోకి రాగానే ఆదాయపు పన్ను పరిధిని అయిదు లక్షలకు పెంచుతామని వాగ్దానం చేసిన మోదీ ప్రభుత్వం ఆ తరువాత ఆదాయపు పన్ను పరిధి పెంచే విషయంలో పెద్దగా చేసిందేమీ లేదన్న విమర్శలు మధ్యతరగతి నుంచి వ్యక్తమవుతున్నాయి. మున్ముందు మోదీ ప్రభుత్వ పరిస్థితి మరింత దిగజారే అవకాశాలే ఉన్నట్టు రాజేశ్ జైన్ వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితి ప్రభుత్వానికి కూడా అర్థమై ఉండాలి. గుజరాత్ ఎన్నికల్లో ఆశించినంత మెజారిటీ లభించలేదు. బీజేపీ అధికారంలో ఉన్న రాజస్థాన్ ఉప ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోలేదు. ప్రభుత్వం సాఫీ రోడ్డు మీద ప్రయాణిస్తున్నట్టు లేదు. అది శిఖరారోహణ చేస్తున్నట్టుగా ఉంది.

నిజానికి ముందస్తు ఎన్నికలకు వెళ్లడం కూడా సాహసంతో కూడిన పనే. ఇందులో కొన్ని ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. 1999 అక్టోబర్‌లో అటల్ బిహారీ వాజ్‌పేయి మూడవసారి ప్రధానిగా ఎన్నికయ్యారు. తదుపరి ఎన్నికలు 2004 అక్టోబర్‌లో జరగాల్సి ఉంది. అయితే, 2003 డిసెంబర్‌లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎన్నికలు జరిగినప్పుడు బీజేపీ విజయాలు సాధించింది. ఈ విజయాలను చూసి బీజేపీ మితిమీరిన ఆత్మవిశ్వాసంతో 2004 ఏప్రిల్-మే నెలల్లోనే ఎన్నికలు నిర్వహించింది. అయితే ఆ ఎన్నికల్లో ఘోరంగా పరాజయం పాలయింది. వాజ్‌పేయి చేసిన పొరపాటునే మోదీ చేస్తారా అన్నది తెలియడం లేదు. అధికారంలో ఉన్న కొద్దీ ప్రతిరోజూ ఏదో విధంగా ఓటర్లకు అపీలు చేసుకుంటూ ఉండవచ్చు. అధికారంలో లేకపోవడమంటే ఓటర్లకు దూరం కావడమే అవుతుంది. అందువల్ల ముందస్తు ఎన్నికలంటే ఓ సదవకాశాన్ని చేజార్చుకున్నట్టే అవుతుంది.

మితిమీరిన ఆత్మవిశ్వాసం


తాను దేశంలో బలమైన శక్తిగా ఉండి, తన హవాకు తిరుగులేదని, తాను తారస్థాయిలో ఉన్నానని భావించినప్పుడే ఏ అధికార పక్షమైనా ముందస్తు ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. అంత ఆత్మవిశ్వాసం ఇప్పుడు బీజేపీలో సాధ్యమా అన్నది పరిశీలించాల్సిన విషయమే. 2002 జూలైలో ముఖ్యమంత్రిగా ఉన్న మోదీ గుజరాత్ శాసనసభను రద్దుచేశారు. అదే ఏడాది డిసెంబర్‌లో ఎన్నికలు జరిగాయి. గోద్రా విధ్వంసకాండతో ఓటర్ల పునరేకీకరణ జరిగి ఉంటుందని బీజేపీ భావించడం వల్లే ముందస్తు ఎన్నికలు ప్రకటించడం జరిగింది. జాతీయ స్థాయిలో బీజేపీలో అటువంటి ఆత్మవిశ్వాసం పెంచడానికి జరిగిందేమీ లేదు. 2016లో పాకిస్థాన్ మీద సర్జికల్ దాడులు జరిగినప్పుడు బీజేపీలో అటువంటి ఆత్మవిశ్వాసమే వ్యక్తమైంది. ఇప్పుడు కూడా అటువంటి చర్యేదో తీసుకుంటే తప్ప బీజేపీలో ఆత్మవిశ్వాసం తారస్థాయికి చేరదు. అందువల్ల ముందస్తు ఎన్నికలకు వెళ్లే ముందు బీజేపీ నాయకత్వం ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సి ఉంటుంది.

'ముందస్తు' వ్యూహంపై పునరాలోచించాలి

లోక్‌సభకు, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు సాధ్యమా అన్నది కూడా ఇక్కడ ఆలోచించాల్సి ఉంది. 2019 మేలో జరగాల్సిన లోక్‌సభ ఎన్నికలను ముందుకు తీసుకువచ్చి రాష్ట్రాల శాసనసభల ఎన్నికలతో పాటు జరిపే బదులు, కొన్ని రాష్ట్రాల ఎన్నికలను ముందుకు తీసుకువెళ్లి 2019 మేలో లోక్‌సభ ఎన్నికలతో పాటు జరపడం మంచిదేమో బీజేపీ నాయకత్వం ఆలోచించాలి. బీజేపీ 19 రాష్ట్రాలలో అధికారంలో ఉంది. బీజేపీ తలచుకుంటే ఈ రాష్ట్రాలలో శాసనసభలను రద్దు చేసి, ఏదో ఒక సమయంలో ఎన్నికలు నిర్వహించడం కష్టమైన విషయమేమీ కాదు. 2019 సార్వత్రిక ఎన్నికల తర్వాత జార్ఖండ్, మహారాష్ట్రల శాసనసభలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. ఆ రాష్ట్రాలకు కూడా 2019 ఏప్రిల్-మేలో లోక్‌సభ ఎన్నికలతో పాటే ఎన్నికలు జరిపే విషయం కూడా బీజేపీ ఆలోచించాల్సిన అంశమే.

వీరవల్లి నుంచి విప్లవ కవిత్వానికి..

''నన్నయ్యను నరేంద్రుని బొందలోనే / నిద్రపోనియ్యి / లేపకు / పీకనులిమి గోతిలోకి లాగుతాడు....'' అంటూ 'ఆత్మయోని' కవితతో దిగంబర కవిత్వానికి అంకురార్పణ చేసిన నిఖిలేశ్వర్ సాగించిన అయిదున్నర దశాబ్దాల కవితా ప్రస్థానం 'నిఖిలేశ్వర్ కవిత్వం' మన ముందుకొచ్చింది. ప్రపంచపు ఆచ్ఛాదనల్ని చీల్చుకుని, పెద్ద పెద్ద అలలతో ఒక ఉప్పెనలా దిగంబర కవిత్వం విరుచుకుపడింది. చైతన్యం కోల్పోతున్న నాటి సమాజాన్ని తిట్టిపోసి, తట్టి మేల్కొల్పడానికి వచ్చిన దిగంబరకవుల్లో నిఖిలేశ్వర్‌ది సొంత వ్యక్తీకరణ.



దిగంబర శకం కాలమానం ప్రకారం 1966ను నిఖిలేశ్వర నామ సంవత్సరంగా వ్యవహరించారు. 'ఎన్నడైనా గుడిసె గడప ముందు ప్రశాంతంగా నిద్రిస్తున్న శవాన్ని చూశావా?' అని ప్రశ్నిస్తారు. 'పరవళ్లు తొక్కుతున్న నెత్తురులో సామ్రాజ్యవాదులు తినేది తెగిన కాళ్లు, చేతు'లంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తారు.

ఏడున్నర దశాబ్దాల వెనక్కి చూసుకుంటే, తాను జన్మించిన నల్గొండ జిల్లా వీరవల్లి గ్రామంలో 'తలలూపుతూ పల్కరించిన తంగేడుపూల పసుపు ముఖాలు' నిఖిలేశ్వర్‌కు గుర్తుకొస్తాయి. సన్నకారు రైతు కుటుంబంలో ఏకైక సంతానంగా జన్మించిన కె.యాదవ రెడ్డి పుట్టిన ఏడాదికే తండ్రి మరణించారు. గ్రామాలపై రజాకార్లు పడి దాడులు చేస్తుంటే గడ్డివాముల్లో దాక్కున్న బాల్యం ఆయనది. భాగ్యనగరానికి వలస వచ్చిన వైనం, తనను పెంచడానికి ఫ్యాక్టరీలో కార్మికురాలిగా తల్లిపడిన కష్టాలు, ఆ జీవితాలను ఎన్నటికీ మర్చిపోలేరు.

'నవ్యత నింపుకోవాలంటే కోపంతో వెనక్కిచూడు' అంటారు. అలా కోపంతో వెనక్కి చూసిన చూపే తరువాత దిగంబర కవిగా అవతరించడానికి దోహదపడింది. దిగంబర కవిత్వానికంటే ముందు కె.యాదవ రెడ్డి అన్న పేరుతో 1960-65 మధ్య రాసిన కవితల్లో లోకానుభూతితో పాటు స్వీయానుభూతి ఎక్కువగా కనిపిస్తుంది. 1956 నుంచే హిందీలో కవిత్వం రాయడం మొదలుపెట్టారు. ఆర్మీలో సివిలియన్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, క్లర్కుగా మద్రాసు ఎయిర్‌ఫోర్సుకు బదిలీపై వెళ్లినా, తిరిగి వచ్చి హైదరాబాదులోనే ఉపాధ్యాయుడుగా స్థిరపడ్డారు. 1969లో వచ్చిన నక్సల్‌బరీ, శ్రీకాకుళ పోరాటాలు, పౌరహక్కుల ఉద్యమాలు నిఖిలేశ్వర్‌ని నిమ్మళంగా కూర్చోనివ్వలేదు. ఆయన కలం నుంచి 'మండుతున్న తరం' వచ్చింది. పీడీ చట్టం కింద 1971లో అరెస్టయ్యారు. 'చంపిన ప్రతి తుపాకి గుండు శత్రువు భయానికి గుర్తు'అంటూ జైలులో 'నేరస్తుల ద్వీపం' రాశారు.

'దుక్కిదున్నిన చేతులకు దక్కినదేమిటి?' అని 'ఈనాటికీ' ప్రశ్నిస్తారు. 'యథార్థాన్ని వికృతం చేసి వికటాట్టహాసం చేస్తున్న వెండితెర'ని తూర్పారబడతారు. బాల్యంలో వీరవల్లి వదిలాక హైదరాబాదు మహానగరమే అక్కున చేర్చుకుంది. 'ప్రశ్నించే గొంతులను, తెగించే యువకులను ఎన్‌కౌంటర్ చేస్తున్నదెవరు?' అని 'ఎవరీ ప్రజాశత్రువు?'లో నిలదీస్తారు. 'చరిత్ర గుణపాఠాలను నేర్వలేని వాళ్ల చరిత్రను అసలే నిర్మించలేరు' అంటూ కుండబద్దలు కొడతారు. నిఖిలేశ్వర్ కవిత్వమంతా భీతిగొలిపే తాత్కాలిక తుఫానులానో, ఎగిసిపడుతున్న అలల్లానో, అట్టహాసంగా, ఆడంబరంగా కనిపించి ఆగిపోయేది కాదు. నిత్యం తనతోను, తన చుట్టూ ఉన్న మనుషులతోను సంభాషిస్తున్నట్టుంటుంది. ఉద్యమాల ఉధృతి, అనుభవాల గాఢత ఆ కవిత్వాన్ని నడిపించాయి.

నిరంతరం అలలతో కదలాడే జీవనదిలా సాగుతుంటుంది. హృదయంతో పరికిస్తే తప్ప ప్రవాహగానం వినిపించదు. అందుకే 'ప్రపంచంలో ఆకలి, దారిద్ర్యం ఉన్నంతకాలం మార్క్సిజాన్ని సవాలు చేసే దమ్ము ఎవరికీ లేద'ంటారు నిఖిలేశ్వర్. వీరి కవిత్వం ఇంగ్లీషు, హిందీ వంటి పలుభాషల్లోకి అనువాదమైంది. నిఖిలేశ్వర్ స్వయంగా హిందీ, ఉర్దూ భాషల్లో కూడా కవిత్వం రాశారు. తన కవితలను ఆంగ్లంలోకి అనువాదం చేశారు. దేశవిదేశాల కవితలను అనుసృజన చేశారు. 'ముసలితనం అంటే సంస్కారాల సాయంత్రం, ముసలితనం అంటే చావుకోసం పాడే జోలపాట' అంటూ నామ్ దేవ్ తారాచందాణె సింధీలో రాసిన 'ముసలితనం' అన్న కవితకు నిఖిలేశ్వర్ చేసిన అనువాదం కాలాతీత సజీవ శిల్పం.

(హైదరాబాదులోని తెలంగాణా సారస్వతపరిషత్ హాల్‌లో నేటి సాయంత్రం 5.30 గంటలకు 'నిఖిలేశ్వర్ కవిత్వం' ఆవిష్కరణ)

◆ ఆలూరు రాఘవశర్మ

ఎమ్మార్పీఎస్‌పై నిర్బంధ వ్యతిరేక సదస్సు

కరపత్రం

తెలుగు నేలపై ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం ఇరవై నాలుగేళ్లుగా ఎమ్మార్పీస్ నాయకత్వంలో ఉద్యమం నడుస్తోంది. యాభై తొమ్మిది ఎస్సీ కులాల మధ్య రిజర్వేషన్ ఫలాలు జనాభా దామాషా ప్రకారం పంపిణీ జరగాలని ఆ సంస్థ పోరాడుతున్నది. వర్గీకరణ ఉద్యమం మాదిగల జీవితాలకు చదువు, కొలువుల్ని మాత్రమే తీసుకురాగలదు. మొత్తం మాదిగ ప్రజల విముక్తి సమాజ విముక్తిలోనే సాధ్యమవుతుంది. ఈ నేపథ్యంలో విప్లవ సాహిత్య, సాంస్కృతిక సంస్థగా విరసం ఎమ్మార్పీఎస్ ఉద్యమ కాలంలో వచ్చిన సాహిత్యం, ఆ ఉద్యమానికి ఉన్న సామాజిక పునాది, ఆ ఉద్యమం మీద రాజ్యం అమలు చేస్తున్న నిర్బంధంపై మార్చి 4 ఉదయం 10 గంటలకు హైదరాబాద్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లిలో సదస్సు నిర్వహిస్తోంది. గీతాంజలి, కె. నాగేశ్వర్, డి. ఉదయ్‌భాను, రత్నమాల, సి. కాశీం, మందకృష్ణ మాదిగ, వరవరరావు తదితర ప్రముఖులు పాల్గొంటున్నారు.

- విప్లవ రచయితల సంఘం (విరసం)

ఎడిట్ పేజీకి వ్యాసాలు, లేఖలు పంపేవారు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ రెండు ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manamlekhalu@gmail.com

వీరోచితం

సైన్యం

భారతీయ సైనిక రెజిమెంట్లు ప్రత్యేకమైన కొన్ని బ్యాడ్జిల్ని వాడుతుంటాయి. ఇవి సైన్యంలో వాటి హోదాకు సంబంధించిన సంకేత చిహ్నాలు. ఒక్కో రెజిమెంట్‌కు ఒక్కో ప్రత్యేక బ్యాడ్జి ఉంటుంది. మరి, ఈ బ్యాడ్జిల అర్థమేమిటో మీకు తెలుసా? ఫలానా రెజిమెంట్‌కు ఫలానా బ్యాడ్జి అంటూ ఎలా, ఎందుకు కేటాయించారో తెలుసుకుందాం...



బ్రిగేడ్ ఆఫ్ ది గార్డ్స్

బ్రిగేడ్ ఆఫ్ ది గార్డ్స్ అనేది భారతీయ సైన్యంలో అన్ని వర్గాల సమాహారంగా ఉన్న పదాతిదళాలకు చెందిన మొట్టమొదటి రెజిమెంట్. దీనిలో 21 బెటాలియన్స్ ఉంటాయి. బ్రిగేడ్ ఆఫ్ ది గార్డ్స్ రెజిమెంట్ సంకేత చిహ్నం గరుడ దేవుడు. హిందూ పురాణాల ప్రకారం సాక్షాత్తు విష్ణుమూర్తి వాహనమే గరుడ దేవుడు. అత్యంత వేగవంతం, శక్తిమంతం అయిన గరుడ దేవుడి ప్రస్తావన మనకు మహాభారతంలో కనిపిస్తుంది. గరుడ దేవునిలా అత్యంత శక్తిమంతమైన సైనిక విభాగంగా బ్రిగేడ్ ఆఫ్ ది గార్డ్స్‌ని గుర్తించడం వల్లే ఈ రెజిమెంట్‌కు గరుడ దేవుణ్ణి సంకేత చిత్రంగా నిర్ణయించారు.

ది పారాచ్యూట్ రెజిమెంట్




భారతీయ సైన్యంలో వైమానిక దళానికి చెందిన ఈ రెజిమెంట్ పారాచ్యూట్‌ను తన సంకేత చిత్రంగా స్వీకరించింది. ఈ రెజిమెంట్ బ్యాడ్జిలో తెరు చుకున్న పారాచ్యూట్ రెక్కలు ఒక వలయానికి వెలుపలి వరకు విస్తరించి ఉంటాయి. ఈ పారాచ్యూట్ మీద రెండు కత్తులు ఎక్స్ ఆకారంలో ఉంటాయి. ఈ సంకేత చిత్రాన్ని బట్టే ఆ రెజిమెంట్ బాధ్యతలేమిటో అర్థమవుతోంది కదా!

మెకనైజ్డ్ పదాతి దళాల రెజిమెంట్




ఇది పదాతి దళాల బెటాలియన్స్ తాలూకు యుద్ధ ట్యాంకులకు సంబంధించింది. అన్ని రెజిమెంట్ల కదలికల్ని వేగవంతం చేయడమే దీని ప్రధాన బాధ్యత. ఈ రెజిమెంట్ బిఎంపి1 అనే యుద్ధ వాహనం మీద రైఫిల్ బాయ్‌నెట్ ఉన్న చిత్రాన్ని తన సంకేత చిహ్నంగా కలిగి ఉంటుంది.

పంజాబ్ రెజిమెంట్



నౌకను సంకేత చిహ్నంగా కలిగిన ఉన్న పదాతిదళాల రెజిమెంట్ ప్రపంచంలో ఇదొక్కటే. సముద్ర తలం మీద ప్రతిభావంతమైన యుద్ధ సేవల్ని అందించినందుకు గాను ఈ రెజిమెంట్‌కు 1824లో బహుమతి లభించింది. తెడ్లతో కూడిన అతి పెద్ద నౌక ఈ రెజిమెంట్ చిహ్నంగా ఉంది.

రాజ్‌పుతానా రైఫిల్స్




రాజపుత్రుల ఆయుధమైన కటారిని తన సంకేత చిహ్నంగా కలిగిన రెజిమెంట్ రాజ్‌పుతానా రైఫిల్స్. భారతీయ సైన్యంలో సీనియర్ రెజిమెంట్ ఇది. ఈ సంకేత చిహ్నంలో కటారితో పాటు ఒక కొమ్ము బూర కూడా ఉంటుంది. కటారిని కులీన రాజ్‌పుత్‌లు ఉపయోగించే వారు. ఇది వారి సంపదకు, హోదాకు చిహ్నం.

సిఖ్ రెజిమెంట్



సిక్కుల ప్రాబల్యం ఉన్న ఈ రెజిమెంట్ సంకేత చిహ్నంలో సిక్కు ఖల్సా సైనికులు ఉపయోగించే 'చక్రం' ఉంటుంది. ఆ చక్రంలో సింగ్ లేదా సిక్కు ధైర్యసాహసాలకు చిహ్నమైన సింహం బొమ్మ ఉంటుంది. సాధారణంగా సిక్కుల పేర్ల చివర ఉండే 'సింగ్' అనే పదానికి సంకేతమే ఈ సింహం.

మద్రాసు రెజిమెంట్



బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి, మరాఠా సామ్రాజ్యానికి మధ్య అస్సాయి అనే చోట 23 సెప్టెంబరు 1803న జరిగిన యుద్ధంలో ప్రదర్శించిన ధైర్యసాహసాలకు, పోరాట పటిమకు గుర్తుగా మద్రాస్ రెజిమెంట్ సంకేత చిత్రంలో అస్సాయి ఏనుగు బొమ్మ ఉంటుంది. ఇప్పటికీ ఆ రెజిమెంట్‌కు చెందిన సైనికులు ఈ చిత్రంలో కూడిన బెల్ట్‌లను ధరిస్తుంటారు.

ఇవి మాత్రమే కాకుండా డోగ్రా రెజిమెంట్, జాట్ రెజిమెంట్, కుమావ్ రెజిమెంట్‌లతో పాటు మరికొన్ని రెజిమెంట్లు తమ స్థానీయత ఆధారంగా పలు సంకేత చిత్రాల్ని కలిగి ఉంటున్నాయి.

మాట కాని మాట





మౌనభాష

'నిశ్శబ్దం భగవంతుని భాష, మిగిలిన దంతా అరాకొరా అనువాదమే' అని అంటాడు పర్షియన్ కవి జలాలుద్దీన్ రూమీ. మౌనం మూసిన తలుపు, దాన్ని తెరిచేదే భాష. అయితే మనిషికి, మనిషికి మధ్య భావవినిమయాన్ని సజావుగా నడిపించడమే భాష ప్రధాన కర్తవ్యం. ప్రపంచంలో 6,500 భాషలున్నాయంటారు. కానీ నిజానికి 7,106 భాషలు సజీవంగా ఉన్నాయన్న వాదన మరొకటుంది. అయితే ఈ భాషలన్నింటి మధ్య ప్రాంతాలు, తెగలు, జాతులు వంటి అడ్డంకులు ఉన్నాయి. 'నీ భాషను అర్థం చేసుకునే వ్యక్తితో మాట్లాడితే, అది అతని బుర్రలోకి వెళుతుంది, అదే అతని భాషలో నువ్వు మాట్లాడితే, అది అతని హృదయంలోకి వెళుతుంది' అని అంటారు నెల్సన్ మండేలా. కానీ అందరికీ ఏకకాలంలో మనసులోకి, మెదడులోకి వెళ్ళే భాష ఒకటి ఉంది, దానికి మాటలు అక్కర్లేదు. అదే సంకేత చిత్రభాష. ఇవాళ మైత్రి ఆ సంకేత చిత్రాలకు సంబంధించిన కొన్ని విశేషాల్ని మీ ముందుకు తెచ్చింది.

– మీ 'మైత్రి'

చరిత్ర

మనిషి తన భావాలను కళాత్మకంగా వ్యక్తం పరిచేందుకు చేసిన మొదటి ప్రయత్నమే సంకేత చిత్రాలకు నాంది పలికింది. ఆదిమానవుని ఉనికికి గుర్తుగా నిలిచిన ప్రాచీన గుహల్లో కుడ్యచిత్రాల మొదలు టోక్యోలాంటి అత్యాధునిక డిజిటల్ నగరం వరకు సంకేత చిత్రాలు మనిషి భావోద్వేగాలకు, జ్ఞాపకాలకు, వస్తుసేవల ప్రకటనలకు.., ఇలా అనేకానేక మానవ అవసరాలన్నింటికీ కేంద్రంగా మారాయి. ఇవాళ మనం చూస్తున్న సంకేత చిత్రాలకు మూలాలు ప్రాచీన గ్రీకులు, రోములు మానవ జాతికి అందించిన ప్రాథమిక కళారూపాల్లో ఉన్నాయి. ఆ కాలంలో మట్టి, రాళ్ళతో శిల్పాల్ని రూపొందించే వారు. అప్పట్లో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉన్నందున వారికి అర్థమయ్యే విధంగా కొన్ని ఉద్వేగాలు, చిహ్నాల్ని సంకేత రూపంలో శిల్పాలుగా తయారు చేసేవారు. ఇళ్ళు, కర్మాగారాలు వంటి వాటిని గుర్తించడానికి వీలుగా కొన్ని విశిష్టమైన చిహ్నాల్ని కొయ్య, చర్మం, రాళ్ళు, లోహాలతో తయారు చేసే వారు. తొలుత క్రైస్తవులు వీధుల కూడళ్ళను సూచించేందుకు 'క్రాస్' చిహ్నాన్ని వాడే వారు. అన్యమతస్తులు సూర్య, చంద్రులను సూచించేందుకు సంకేత చిత్రాల్ని ఉపయోగించారు. క్రమంగా రాతియుగపు చిహ్నాలన్నీ అంతరించి, నాగరికత, వాణిజ్యం విస్తరించిన తరువాత సంకేత చిహ్నాల అవసరం మరింతగా పెరిగింది. ఇంగ్లండ్ ప్రభువు మూడవ రిచర్డ్ 1389లో దేశంలో మద్యం విక్రయించే వారందరూ తమ తమ ఇళ్ళ ముందు సంబంధిత చిహ్నాన్ని ప్రదర్శించాలని చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. ప్రాథమికంగా ఈ సంకేత చిత్రాలన్నీ ఆయా వాణిజ్య అవసరాల్ని మాత్రమే ప్రదర్శించేవి. కానీ క్రమంగా వాణిజ్య అవసరాల నిమిత్తం లోగోలు ఉనికిలోకి వచ్చాయి. ఈ చిత్రాల్లో సింహాలు, సర్పాలు, డాలు వంటి రూపాలు వచ్చి చేరాయి. వ్యాపారంలో పోటీని తట్టుకునేందుకు మరింత విస్తృతార్థంలో లోగోల్ని రూపొందించాల్సిన అవసరాన్ని వాణిజ్య సంస్థలు గుర్తించాయి. తదనంతరకాలంలో సంకేత చిత్రాల్ని మరింత అందంగా, అలంకారయుతంగా తయారు చేయడం ప్రారంభమైంది. పదహారు, పదిహేడు శతాబ్ద కాలానికి సంకేత చిత్రాల్ని రూపొందించడమన్నది భేషజానికి సంకేతంగా మారింది. లోహాల్ని కరిగించి, బంగారు తాపడం చేసి, దారుశిల్పాకృతిలో లోగోల్ని తయారు చేసే వారు. అయితే నగర సంస్కృతి పెరిగిన తరువాత ఇలాంటి భారీ లోగోలు నగరంలో రహదారులకు, ప్రజల రాకపోకలకు అడ్డంకిగా మారాయి. నగరాలు, పట్టణాల్లో జనసందోహం పెరిగింది. దాంతో సంకేత చిహ్నాలు, లేదా లోగోల పరిమాణం చిన్నవిగా ఉండాలంటూ చట్టాలు అమల్లోకి వచ్చాయి. లండన్, పారిస్‌లలో లోగోల ప్రదర్శనను తొలగించాలని లేదా గోడలకు తగిలించాలని ఆదేశాల్ని జారీ చేశారు. గ్యాస్ లైటింగ్, పారిశ్రామిక అచ్చుయంత్రాల తయారీ, ముద్రణా సౌకర్యాల ఆధునీకరణ, విద్యుదీకరణ వంటి ఆధునిక సాంకేతికత పెరగడంతో 18వ శతాబ్దానికి ఆధునిక సంకేత చిత్రాల రూపకల్పన వేగాన్ని పుంజుకుంది. వినియోగదారుల్ని ఆకర్షించేలా కళాత్మక సంకేత చిత్రాల్ని రూపొందించడంలో కళాకారుల ప్రతిభకు రాణింపు లభించింది. రెండో ప్రపంచ యుద్ధకాలానికి పెద్దయెత్తున సంకేత చిత్రాల తయారీకి మార్గం సుగమమైంది. ప్లాస్టిక్ తయారీలో సాంకేతిక సౌలభ్యం పెరగడం వల్ల భారీ పరిమాణంలో, ఎక్కువ సంఖ్యలో సులభంగా సంకేత చిత్రాల్ని రూపొందించడం సుసాధ్యమైంది. నేటికి ప్రపంచవ్యాప్తంగా సంకేత చిత్రాల తయారీ పరిశ్రమ యాభై బిలియన్ డాలర్ల వ్యాపారాన్ని అందుకుంది. నేటికీ సంకేత చిత్రాల కన్నా సమర్థవంతమైన భావవినిమయ సాధనం మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు.

– కల్కి

గ్యాస్ లైటింగ్, పారిశ్రామిక అచ్చుయంత్రాల తయారీ, ముద్రణా సౌకర్యాల ఆధునీకరణ, విద్యుదీకరణ వంటి ఆధునిక సాంకేతికత పెరగడంతో 18వ శతాబ్దానికి ఆధునిక సంకేత చిత్రాల రూపకల్పన వేగాన్ని పుంజుకుంది.

'ధర్మ' సంకేతం

బాటసారి

బహుదూరపు బాటసారికి చీకటి పడితే, ఆకలితో కడుపు కనలి పోతుంటే, అడుగు ముందుకు పడకపోతే.., ఊరూ, పేరూ తెలియని చోట.., ఆదుకుని, పిడికెడు అన్నం పెట్టే దిక్కెవరు? పూర్వకాలంలో అయితే పూటకూళ్ళమ్మలు ఉండే వాళ్ళు, కాణీ తీసుకుని కడుపు నిండా అన్నం పెట్టి, సేద తీరడానికి కాసింత చోటు చూపించే వాళ్ళు. కాకపోతే వాళ్ళకి కాణీ లేదా అణా, అర్థణా ఇవ్వాలి కదా! చేతిలో రూక లేకపోతే పూటకూళ్ళమ్మ కూడా కరుణించడం కష్టమే. మరి అలాంటి పేద బాటసారులకు అన్నంతో పాటు, తలదాచుకునేందుకు కాసింత నీడను కూడా పంచేవే ధర్మ సత్రాలు. పూర్వకాలంలో రాజులు, ధనికులు తమ పేరిట, తమ ఆప్తుల పేరిట అన్నార్తులకు ఉచితంగా కూడు, నీడ వసతి కల్పించేందుకు ఈ ధర్మసత్రాల్ని నిర్మించే వారు. పాతకాలంలో మన తెలుగు నేల మీదే కాదు, ప్రపంచంలో అన్ని చోట్లా ఇలాంటి ఏర్పాట్లే ఉండేవట. మనం ధర్మసత్రం అన్నట్టే, అమెరికాలో ఇలాంటి ధర్మసత్రాన్ని 'టావెర్న్' అని పిలుస్తారు. మరి వాళ్ళు ఒకింత ముందుకు వెళ్ళి, ఊరు గాని ఊరు నుంచి వచ్చి, పరిచ యస్తులు లేని చోట బాటసారులు కాస్త నడుం వాల్చడానికి ఎక్కడి వెళతారు? ఎవరి తలుపు కొడతారు? ఎవరి తలుపు కొడితే, ఎవరు ఊరుకుంటారు గనుక... అందుకే, ఊరికి కొత్తగా వచ్చిన బాటసారులకు ఉచితంగా అన్నపానీయాల్ని సమకూర్చే టావెర్న్‌ల ఆచూకీని చెప్పడానికి అమెరికాలో ఆ కాలంలో 'టావెర్న్ సైన్' అనే సంకేత చిత్రాన్ని ఉపయోగించే వారట! అమెరికాలోని కానెకట్ అనే చోట 1672 నుంచి ఎవరైనా ఇలా ఉచితంగా బాటసారులకు ఆహార సదుపాయాల్ని కల్పించేటట్లయితే, వారు తమ ఇళ్ళ ముందు బాటసారులకు కనిపించేలా ఆ విషయాన్ని సంకేత చిత్రం ద్వారా తెలియపరచాల్సి ఉంటుందని అలాంటి ధర్మసత్రాలకు అనుమతుల్ని మంజూరు చేసే సమయంలోనే ఆంక్షలు విధించే వారట. అయితే ఈ సంకేత చిత్రం ఎలా ఉండాలన్న విషయంలో ఏ స్పష్టతా ఉండేది కాదట. ఇలా ధర్మసత్రాల ముందు ఏర్పాటు చేసిన సంకేత చిత్రాలు కూడా ఆరుబయట ఉంచడం వల్ల ఎండకు ఎండి, వానకు తడిసి తొందరగా పాడై పోయేవట. ఒక్క కానెకట్‌లోనే 1750 నుంచి 1850 వరకు దాదాపు ఐదువేల టావెర్న్ సైన్‌లు ఉండేవట. కానీ వాటిలో కేవలం 70 మాత్రమే మిగలగా, మిగతావన్నీ కాలగర్భంలో కలిసి పోయాయి. అయితే ఈ టావెర్న్ సైన్‌లన్నీ జానపద చిత్రశైలిలోనే ఉండేవి. ఈ టావెర్న్ సంకేత చిహ్నాలు సాధారణంగా చెక్క శిల్పాల రూపంలో కానీ, పెయింటింగ్‌ల రూపంలో కానీ ఉండేవి.





మైలు రాళ్ళు

రహదారి

దారి అనే సూత్రం లేకపోతే ప్రయాణం, గమ్యం రెండూ కూడా అగమ్య గోచరాలే కదా! దారిని తెలుసుకోవడానికి ఉపయోగించే సంకేత చిహ్నాల్నే మనం 'మైలురాళ్ళు' అని పిలుస్తున్నాం.చరిత్రలో మొట్టమొదటి ట్రాఫిక్ సైన్‌లు ఇవే. ప్రారంభంలో రోము నగరానికి దారిని తెలిపేలా దారిపొడవునా పెద్ద పెద్ద రాతి స్తంభాల్ని పాతారు. తదనంతర కాలంలో నగరాలు, పట్టణాల మధ్య దారిని, దిశను సూచించే విధంగా ట్రాఫిక్ సైన్‌లను రూపొందించారు. యూరప్‌లో మొట్టమొదటిసారిగా 1686లో పోర్చుగల్ రాజు రెండవ పీటరు ట్రాఫిక్ నియంత్రణ చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. లిస్బన్ నగరంలో ఇరుకైన రోడ్లలో దారిని సూచించే చిహ్నాల్ని నెలకొల్పాలని ఆ చట్టం ద్వారా ఆదేశించారు. ఇప్పుడు మనకు తెలిసిన ఆధునిక ట్రాఫిక్ చిహ్నాలకు మూలం 1870ల కాలంలో సాధారణ సైకిల్ చోదకుల కోసం ఏర్పాటు చేసిన రహదారి గుర్తుల్లో ఉంది. దారి తాలూకు దిశ, దారిలో ఏవైనా అడ్డంకులు ఉంటే దాని వివరాలు, దారిలో పొంచి ఉన్న ప్రమాదాల్ని సూచిస్తూ ఈ ట్రాఫిక్ సైన్‌లకు మరింత మెరుగులు దిద్దడం జరిగింది.



అటు తరువాత ఆటోమొబైల్ రంగం అభివృద్ధి చెంది, రహదారుల మీద రకరకాల వాహనాలు తిరగడం మొదలైంది. ఇటాలియన్ టూరింగ్ క్లబ్ 1895లో మొదటి ఆధునిక రహదారి చిహ్నాలకు రూపకల్పన చేసింది. అయితే ఇంటర్నేషనల్ లీగ్ ఆఫ్ టూరింగ్ ఆర్గనైజేషన్స్ 1900లో రహదారి చిహ్నాల్ని క్రమబద్ధీకరణ చేయడానికి ప్రతిపాదనల్ని ఆహ్వానించింది. చివరికి 1908లో పారిస్‌లో అంతర్జాతీయ రహదారి సమాఖ్య రహదారి చిహ్నాలకు తుదిరూపాన్నిచ్చింది. మిట్ట, పల్లం, నాలుగు రోడ్ల కూడలి వంటి వాటిని తెలియజెప్పే కొన్ని సంకేత చిహ్నాల్ని తొమ్మిది యురోపియన్ ప్రభుత్వాలు 1909లో ఆమోదించాయి. కాగా 1926 నుంచి 1949 వరకు యూరోపు దేశాల్లో అంతర్జాతీయ ట్రాఫిక్ చిహ్నాల అభివృద్ధి జరిగింది. ఇరవయ్యో శతాబ్ద మధ్యకాలం వరకు ఇనుమును మాత్రమే ట్రాఫిక్ చిహ్నాల తయారీకి వాడే వారు. అటు తరువాత అల్యూమినియం, తదితర లోహాల్ని కూడా ఉపయోగించడం మొదలు పెట్టారు. అనంతర కాలంలో ట్రాఫిక్ చిహ్నాల రూపకల్పనలో పెను మార్పులు చోటు చేసుకున్నాయి. సెన్సార్‌ల వంటి అత్యాధునిక పరిజ్ఞానం వృద్ధి చెందిన తరువాత, 'రిమోట్ ఇన్‌ఫ్రారెడ్ ఆడిబుల్ సైనేజ్' వంటి సాంకేతిక సౌలభ్యాలు అందుబాటులోకి వచ్చాయి.





పోస్టుమార్టం వీడియో తీయండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు
- గడ్డం లక్ష్మణ్ అత్యవసర పిల్‌పై విచారణ
- ఎన్‌కౌంటర్ జరిగింది ఛత్తీస్‌గఢ్‌లో తెలంగాణలో కాదు: ఏజీ రామచంద్రరావు

హైదరాబాద్, మార్చి 2 (మనం లీగల్ ప్రతినిధి): తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని తొండపాల్ అటవీప్రాంతంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారి మృతదేహాలకు పోస్టుమార్టంపై తెలుగు రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు శుక్రవారం మధ్యంతర ఆదేశాలిచ్చింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారి మృతదేహాలను భద్రాచలం ఆస్పత్రికి తీసుకొచ్చి ఉంటే వాటికి పోస్టుమార్టం నిర్వహించేప్పుడు వీడియో చిత్రీకరణ చేయాలని ఆదేశించింది. ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం చేయించాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. పోస్టుమార్టం నిర్వహించాక మృతదేహాలను కుటుంబసభ్యులకు అందజేయాలని బెంచ్ ఆదేశించింది. మరణించిన వారిలో ఎంతమంది తెలంగాణ వారున్నారని బెంచ్ ఆరా తీసింది. తెలంగాణ వారుంటే వారి మృతదేహాల విషయంలో కూడా అలాగే చేయాలని తెలంగాణ సర్కార్‌ను బెంచ్ ఆదేశించింది. మృతదేహాలకు వరంగల్ ఎంజీఎం లేదా ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించాలని, ఎన్‌కౌంటర్‌పై సీబీఐతో దర్యాప్తునకు ఆదేశించాలని, ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై 302 (హత్యానేరం) కింద కేసు నమోదు చేయాలని కోరుతూ పౌరహక్కుల కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ దాఖలు చేసిన అత్యవసర ప్రజాహిత వ్యాజ్యాన్ని బెంచ్ భోజన విరామ సమయంలో విచారణ జరిపింది. ఎన్‌కౌంటర్‌లో మొత్తం 12 మంది మావోయిస్టులు మరణించారని, అందులో హరిభూషణ్ అనే మావోయిస్టు తెలంగాణ ప్రాంతానికి చెందిన వారని పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పారు. ఫోరెన్సిక్ వైద్యుడు భద్రచలం ఆస్పత్రిలో లేనందున వరంగల్‌లో పోస్టుమార్టానికి ఆదేశించాలని కోరారు. ఎన్‌కౌంటర్ ఘటన తెలంగాణ రాష్ట్రంలో జరగలేదని, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని హుసూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిందని తెలంగాణ ప్రభుత్వ అదనపు అడ్వకేట్ జనరల్ రామచంద్రరావు చెప్పారు. హైకోర్టు పరిధిలోకి ఘటన లేదన్నారు. మృతదేహాలను భద్రాచలం ఆస్పత్రికి తీసుకొచ్చినందున తాము జోక్యం చేసుకోవచ్చునని బెంచ్ స్పష్టం చేసింది. భద్రాచలంలో అన్ని వసతులున్నాయని చెప్పారు. విచారణను కోర్టు రెండువారాలకు వాయిదా వేసింది. ఈలోగా ప్రతివాదులు తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు వేయాలని ఆదేశించింది.

హోలీ విషాదం

- వేడుకల్లో పాల్గొని వస్తూ.. ప్రమాదంలో ఐదుగురి మృతి



సంగారెడ్డి, మార్చి 2 (మనం న్యూస్): హోలీ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. దాంతో పాటు మద్యం సేవించారు. ఇంటికి వస్తూ ఓ దాబా దగ్గర ఆగి విందు భోజనం ఆరగించారు. తిరిగి తమ వాహనంలో బయలుదేరారు. అయితే.. మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతూ హైవేపైకి తీసుకువచ్చే క్రమంలో ఒక్కసారిగా వేగం పెంచారు. అదుపుతప్పిన కారు డివైడర్ ఎక్కి అవతలి వైపు పల్టీ కొట్టింది. అదే సమయంలో.. అటువైపుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆ వాహనాన్ని ఢీకొట్టింది. దాంతో ఆ వాహనం పల్టీలు కొడుతూ రోడ్డుపక్కన గుంతలో పడిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు చికిత్స పొందతూ కన్నుమూశారు. ఈ ఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా కంది మండలం పరిధిలోని ఐఐటీ సమీపంలో చోటు చేసుకుంది. సంగారెడ్డికి చెందిన కేతకీ డిజిటల్ యజమాని మహేశ్, స్నేహితులతో కలిసి రుద్రారంలో నిర్వహించిన హోలీ వేడుకల ఈవెంట్‌లో పాల్గొని ఎర్టిగా కారులో తిరిగి బయలుదేరారు. మార్గమధ్యంలో ఓ దాబా వద్ద ఆగి భోజనం చేశారు. అనంతరం హైవేపైకి వచ్చే క్రమంలో కారు వేగాన్ని ఒక్కసారిగా పెంచేశారు. దాంతో కారు ఒక్కసారిగా డివైడర్‌పైకి ఎక్కి అవతలివైపు బోల్తా కొట్టింది. అదే సమయంలో జహీర్‌బాద్ నుంచి పటాన్‌చెరు వెళ్తున్న బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు, కారు రెండూ రోడ్డు పక్కన గుంతలోకి దూసుకుపోయాయి. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే కన్నుమూశారు. మృతులు మహేశ్, నరేందర్, నాగరాజు, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకట్ రెడ్డిగా గుర్తించారు. సంఘటనా స్థలాన్ని సంగారెడ్డి ఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. కారులో ముందు సీట్ల వద్ద ఉన్న ఎయిర్‌బ్యాగులు తెరుచుకున్నా ప్రయోజనం లేకపోయింది. కారు తుక్కుతుక్కు అయిపోవడంతో కారులో ఉన్న ఐదుగురిలో ఏ ఒక్కరూ బతికి బట్టకట్టలేకపోయారు.

లేటుగా నిద్రలేస్తోంది!

- రుచికరమైన వంట చేయదు
- నాకు విడాకులిప్పించండి
- బాంబే హైకోర్టులో పిటిషన్
- తిరస్కరించిన న్యాయస్థానం

ముంబై, మార్చి 2: ''నా భార్య తన 'విధుల'ను సరిగా నిర్వర్తించడం లేదు. ఆలస్యంగా నిద్రలేస్తోంది. నా తల్లిదండ్రులు లేపే ప్రయత్నం చేస్తే వారిని కసురుకుంటుంది. రుచికరమైన వంట కూడా చేయదు. అలసిపోయి ఉద్యోగం నుంచి వచ్చినప్పుడు కూడా నన్ను పట్టించుకోదు. ఆమెతో ఉండలేను. విడాకులు ఇప్పించండి'' అంటూ ముంబైకి చెందిన ఓ వ్యక్తి బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. అయితే ఈ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. పిటిషనర్ చేసినా ఆయా ఆరోపణలేవీ క్రూరత్వంగా పరిగణించలేమంటూ ఇప్పటికే దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. పిటిషనర్ భార్య ఓ ఉద్యోగిని అయినందున ఆమె కార్యాలయ విధులు చేసుకుని రావడంతోపాటు కూరగాయాలు తేవడం, ఇంటికి అవసరమైన ఇతర సరుకులు తేవడం వంటి పనులను చేస్తూనే ఉందని కోర్టు పేర్కొంది. ఆమె ఉద్యోగం చేస్తున్నప్పటికీ ఆయా విధులను నిర్వర్తిస్తోందని.. లేటుగా నిద్రలేవడం, రుచికరమైన వంట చేయకపోవం వంటివాటిని పరిగణనలోకి తీసుకుని విడాకులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. మరోవైపు పిటిషనర్ భార్య తన భర్త ఆరోపణలను ఖండించింది. ఆమె బాగా వంట చేస్తానని, ఉద్యోగం చేస్తున్నప్పటికీ రెండు పూటలా వంట చేసేది తానేనని పేర్కొంది. అలాగే అత్తమామలనూ బాగా చూసుకుంటానని తెలిపింది.

అడవిలో నెత్తుటేరు

తొండపాల్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్.. 12 మంది మావోయిస్టుల మృతి



- గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సునీల్ మరణం

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 2 (మనం న్యూస్ బ్యూరో): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పరిధిలోని కొండపాల్ అటవీ ప్రాంతం సమీపంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మరణించారు. వీరిలో 10 మంది మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎదురు కాల్పుల్లో సుశీల్ అనే గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ కూడా ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు పోలీసులకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం తరలించారు. మరణించిన మావోయిస్టులలో పార్టీ అగ్రనేత హరిభూషణ్ కూడా ఉన్నట్లు పోలీసులు నిర్ధరించారు. మావోయిస్టులు.. పోలీసు బలగాల మధ్య ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతుండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఘటనా స్థలంలో రెండు ఏకే 47లతో పాటు పది ఆయుధాలను, రూ. 41 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇంత పెద్దమొత్తంలో ఆయుధాలు దొరకడంతో పాటు.. రెండు ఏకే 47లు కూడా ఉండటంతో... మృతుల్లో హరిభూషణ్ ఒక్కరే కాక మరో అగ్రనేత కూడా ఉండి ఉంటారని భావిస్తున్నారు.

ఉలిక్కిపడ్డ ఏవోబీ

ఎన్‌కౌంటర్ ఘటనతో ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం (ఏవోబీ)గా పిలుచుకునే కారిడార్ మొత్తం మరోసారి ఉలిక్కిపడింది. ఈ ప్రాంతమంతా పోలీసులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఏవోబీ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్లను అప్రమత్తం చేసి పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటుచేశారు. సరిహద్దుల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు.

డిప్యూటేషన్‌పై వెళ్లి...

మొదటిపేజీ తరువాయి



డిప్యూటేషన్ మీద గ్రేహౌండ్స్ దళంలోకి వెళ్లారు. సుశీల్ స్వస్థలం వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం మేకవనంపల్లి గ్రామం. సుశీల్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. కాగా.. ఆయన భార్య ఇప్పుడు మళ్లీ గర్భవతి. భర్త లేడన్న విష యం తెలిసి ఆమె కన్నీరుమున్నీరవుతున్నారు. మరోవైపు ఎదురు కాల్పుల్లో సుశీ ల్ మరణించిన విషయం తెలిసి స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

అల్లాడుతున్న గిరిజనం

ఒకవైపు మావోయిస్టుల కదలికలు.. మరోవైపు పోలీసుల పదఘట్టనలు.. మధ్యమధ్యలో జోరుగా వినిపించే తుపాకుల మోతతో అమాయక గిరిజనం అల్లాడుతున్నారు. ఎప్పుడు.. ఎటువైపు నుంచి ఎలాంటి ఉపద్రవం వచ్చిపడుతుందో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల మధ్య, తూర్పుగోదావరి జిల్లా కొండప్రాంతాన్ని మావోయిస్టులు ప్రధాన అడ్డాగా ఎంచుకున్నారు. పోలీసులకు అనుమానం రాకుండా పొరుగు రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలు సాగిస్తూ ఈ అడ్డాను శిక్షణకు వినియోగించుకుంటున్నారు. శుక్రవారం నాటి ఎన్‌కౌంటర్‌తో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా పోలీసులు కూడా అప్రమత్తమయ్యారు.

మృతదేహాల తరలింపు ఆలస్యం

ఘటనా స్థలంలో ఇంకా కాల్పులు జరుగుతుండటం, అక్కడ సురక్షిత వాతావరణం లేకపోవడంతో మృతదేహాల తరలింపు కొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

హరిభూషణ్‌పై రూ. 30లక్షల రివార్డు

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్ అలియాస్ జగన్ మరణించారని కథనాలు వచ్చాయి. హరిభూషణ్ భార్య సైతం ఈ ఘటనలోనే ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. అయితే, ఆ తర్వాత అందిన సమాచారం ప్రకారం.. హరిభూషణ్ తృటిలో ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్నట్లు కూడా తెలిసింది. ఆయన బాగా ఎత్తుగా, లావుగా ఉంటారని.. మృతదేహాల్లో అలాంటిది లేకపోవడంతో హరిభూషణ్ క్షేమంగానే ఉండి ఉండొచ్చని అంటున్నారు. ఆయన అసలు పేరు వేప నారాయణ. ఆయన స్వగ్రామం వరంగల్ జిల్లా కొత్తగూడ మండలం మద్రిగూడెం. ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు అప్పటి రాడికల్స్ యూనియన్‌లో కీలక నేతగా ఉంటూ ఆయన అజ్ఞాతం బాటపట్టారు. ప్రస్తుతం హరిభూషణ్ మావోయిస్టు పార్టీలో కేంద్ర ప్లటూన్ కమాండెంట్, తెలంగాణ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. మొబైల్ దాడులు ఎలా చెయ్యాలో పలు రాష్ట్రాలలోని మావోయిస్టులకు ఆయన శిక్షణ ఇచ్చేవారని తెలుస్తోంది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో జరిగిన దాదాపు ప్రతి దాడిలోనూ హరిభూషణ్ హస్తం ఉందని పోలీసులు చెబుతున్నారు. ఆయనపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో వందలాది కేసులు ఉన్నాయి. కాగా ఆయన తలపై రూ. 30 లక్షల రివార్డు ఉందని పోలీసులు తెలిపారు. ఇటీవలి కాలంలో హరిభూషణ్, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ పరిధిలో మావోయిస్టుల కార్యకలాపాలు పెంచుతున్నారన్న సమాచారం ఉందని స్పష్టం చేశారు.



మూడో సీటు ఎవరికి?

మొదటిపేజీ తరువాయి

టీఆర్ఎస్‌కు తిరుగులేని మెజారిటీ ఉన్నప్పటికీ పోటీ ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ దిశగా కాంగ్రెస్ నెమ్మదిగా పావులు కదుపుతోంది. టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా రాజకీయంగా కాంగ్రెస్‌తో కలిసి వచ్చే పార్టీలు లేవనే చెప్పాలి. బీజేపీ, టీడీపీ, ఎంఐఎం ఈ మూడు పార్టీలు రాజకీయంగా కాంగ్రెస్‌తో జతకట్టేది అనుమానమే. అయినా మూడో అభ్యర్థి విషయంలో పోటీ ఆలోచనలు చేస్తున్నారు. తెలంగాణ అమరవీరుల పేరుతో పోటీని తెరపైకి తీసుకు వచ్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు ప్రారంభించింది. తెలంగాణ కోసం పోరాడమని చెప్పుకునే పార్టీలు రాజకీయాలకు అతీతంగా అమరవీరుల కుటుంబాల్లో ఒకరికి మద్దతు కోరాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లుగా తెల్సింది. కాంగ్రెస్ తన అభ్యర్థిని రంగంలోకి దించితే రాజకీయంగా మిగిలిన విపక్షాలు కలిసి వచ్చే అవకాశం లేదు. అదే అమరవీరుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి మద్ధతు ఇవ్వాల్సి వస్తే.. ఏ పార్టీ కాదని చెప్పే పరిస్థితి ఉండదని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలించి మూడో అభ్యర్థిగా అమరుల కుటుంబ సభ్యుల్లో ఒకరిని తెరపైకి తీసుకు వస్తే మాత్రం, టీఆర్ఎస్‌కు కొంత ఇరకాట పరిస్థితి తప్పదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అమరుల కుటుంబాలకు ఎంతో చేశామని చెప్పినా, రాజకీయంగా వచ్చే సరికి ఏదో ఒక పదవి ఇవ్వాల్సి వస్తే ఖరాఖండిగా లేదని చెప్పడం టీఆర్ఎస్‌కు ఇబ్బందికరమే అంటున్నారు. సరిగ్గా ఇదే పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. దీని వల్ల మూడు ప్రయోజనాలు పొందవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. తెలంగాణ కోసం పోరాడిన అమరులకు సముచిత గౌరవాన్ని కల్పించిన పార్టీగా పేరు సంపాదించడం, రాజకీయంగా టీఆర్ఎస్ పై పై చేయి సాధించడంతో పాటు పార్టీ ఫిరాయింపుదార్లకు గట్టి షాక్ ఇవ్వవచ్చని భావిస్తోంది. కేసీఆర్ దుకూడుకు పగ్గాలు వేయవచ్చని అంచనా వేస్తోంది. రాజ్యసభ ఎన్నికల్లో ఓపెన్ బ్యాలెట్ పద్దతి ఉంటుంది. ఓటును శాసన సభ్యులు చూపించి వేయాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలించి పోటీ అనివార్యమైతే అన్ని పార్టీలు విప్ జారీ చేస్తాయి. విప్‌ను ధిక్కరించి అవతల పార్టీకి ఓటు చేస్తే, అనర్హత వేటు వేయాల్సిన పరిస్థితి స్పీకర్‌కు తప్పనిసరి అవుతుంది. పార్టీ ఫిరాయించిన వారిని అనర్హులుగా ప్రకటించాలని ఆయా పార్టీలు గతంలో ఎన్నిమార్లు కోరినా స్పీకర్ వాటిని వాయిదా వేస్తూ వస్తున్నారు. 2014లో ఎన్నికల్లో టీఆర్ఎస్ 63 స్థానాలు గెలుచుకుంది. బీఎస్పీ విలీనంతో సంఖ్య 65కు పెరిగింది. ఆ తరువాత కాలంలో టీడీపీ కి చెందిన 13 మంది, కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు , వైసీపీకి చెందిన ముగ్గురు, సీపీఐకి చెందిన ఒక సభ్యుడు బంగారు తెలంగాణ పేరుతో టీఆర్ఎస్‌లో చేరిపోయారు. దీంతో సభలో టీఆర్ఎస్ బలం 90కి చేరింది. టీడీపీ శాసన సభ పక్ష నాయకుడిగా ఉన్న ఎర్రబెల్లి దయాకర్ రావు పార్టీని టీఆర్ఎస్‌లో విలీనం చేస్తున్నట్లు స్పీకర్‌కు ఒక లేఖ ఇచ్చారు. పార్టీ కాకుండా కేవలం శాసనసభా పక్షం విలీనం ఎలా సాధ్యమన్న దానిపై వివాదం నడుస్తోంది. అందు వల్ల టీడీపీ విప్ జారీ చేస్తే ఈ సభ్యుల ఓటును ఎలా పరిగణిస్తారన్న దానిపై సందిగ్ధత నెలకొనే అవకాశం ఉంది. స్పీకర్ కార్యాలయం విలీనం జరిగినట్లు ప్రకటన జారీ చేసినందున టీడీపీ సభ్యులు టీఆర్ఎస్‌గా పరిగణించే అవకాశం ఉంది. కాంగ్రెస్ సభ్యులు మాత్రం తప్పనిసరిగా విప్‌ను పాటించాలి లేదంటే వారిపై అనర్హత వేటు వేయక తప్పదు. ఇది సీపీఐ సభ్యుడికి కూడా వర్తిస్తుంది. విప్ జారీ చేసే అధికారం పార్టీ అధ్యక్షుడు లేదా కార్యదర్శికి ఉంటుంది. అమరవీరుల కుటుంబాల నుంచి ఒకరిని పోటీ పెడితే... రాజకీయంగా టీఆర్ఎస్‌ను సంకట స్థితికి నెట్టవచ్చని కాంగ్రెస్ ఎత్తు వేస్తోంది. ఇటీవలనే టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన రేవంత్ రెడ్డి ఈ ప్రతిపాదనను తెరపైకి తీసుకు వచ్చారు. దీనికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హన్మంత రావు మద్దతు ప్రకటించారు. ఈ విషయంపై రేవంత్ రెడ్డి ఇప్పటికే సీఎల్పీ నాయకుడు జానారెడ్డితో చర్చించారు. రేవంత్ వాదనతో జానా రెడ్డి కూడా ఏకీభవించినట్లు తెల్సింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి ఆర్సీ కుంతియాతో చర్చించి, పార్టీ హై కమాండ్ దృష్టికి తీసుకువెళ్లిన తరువాత కాంగ్రెస్ దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అమరవీరుల కుటుంబాలను కాదని సంతోష్‌కు సీటు ఖరారు చేస్తే అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి రావచ్చు. సంతోష్ తెలంగాణ ఉద్యమంలో ఏనాడు పాల్గొనలేదని, ఆయనపై కనీసం పిటీ కేసు కూడా నమోదు కాలేదని కాంగ్రెస్ ఇప్పటికీ విమర్శించింది. కేసీఆర్ కుటుంబ పాలన చేస్తున్నరన్న విమర్శలు దీంతో మరింత పెరుగుతాయి. సాధారణ ఎన్నికలు ముంచుకు వస్తున్న సమయంలో ఈ అంశం మరింత భంగం కలుగుతుందని టీఆర్ఎస్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. తేలిగ్గా గెలుచుకుంటామనుకున్న మూడు సీట్ల విషయంలో అనుహ్యంగా తెరపైకి తెలంగాణ సెంటిమెంట్ రావడంతో రాజకీయంగా టీఆర్ఎస్ ఉక్కిరిబిక్కిరి కావడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఎన్‌కౌంటర్‌పై అనుమానాలున్నాయి

- న్యాయవిచారణ జరిపించాలి: చాడ



హైదరాబాద్, మార్చి 2(మనం ప్రతినిధి): ఛత్తీస్‌గఢ్-భద్రాచలం ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై అనేక అనుమానాలున్నాయని సీపీఐ రాష్ట్రకార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలాన్ని గోప్యంగా ఉంచడం వెనుక ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ ప్రభుత్వాల నిరంకుశ, నియంతృత్వ విధానాలకు ఇది నిదర్శమని చాడ పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

అజర్‌బైజాన్‌లో 30 మంది ఆహుతి

డ్రగ్ పునరావాస కేంద్రంలో అగ్నిప్రమాదం

బాకు, మార్చి 2: అజర్‌బైజాన్ రాజధాని బాకులో పెను విషాదం చోటు చేసుకుంది. శుక్రవారం మాదక ద్రవ్యాల పునరావాస కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాదంలో కనీసం 30 మంది మరణించారు. ఏపీఏ వార్త సంస్థ ఈ విషయాన్ని వెల్లడించింది. అగ్నిమాపక సిబ్బంది, సహాయక సిబ్బంది వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మంటలను ఆర్పివేసి, సహాయక చర్యలు చేపట్టాయి. అగ్నిప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నారు.

పాక్‌లో భారత రాయబారికి అవమానం

ఎలైట్ క్లబ్‌లో చేరకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డగింత

ఇస్లామాబాద్, మార్చి 2: దాయాది పాకిస్తాన్ మరోసారి తన వంకరబుద్ధిని బయటపెట్టుకుంది. భారత రాయబారి అజయ్ బిసారియాను ఉద్దేశపూర్వకంగా అవమానించింది.పలు దేశాల రాయబారులు, ఉన్నతాధికారులు సభ్యులుగా ఉండే ఇస్లామాబాద్ క్లబ్‌లో బిసారియా చేరకుండా అడ్డుకునేయత్నం చేస్తోంది. సభ్యత్వం కోసం సాధారణంగా ఒకటి రెండు రోజుల్లో ప్రక్రియ ముగియాల్సి ఉన్నా కావాలని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పక్కన పెట్టింది. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో రాయబార కార్యాలయాలకు సమీపంగా ఇస్లామాబాద్ క్లబ్ ఉంది. 350 ఎకరాల సువిశాల ప్రాగణంలో గోల్ఫ్, స్విమ్మింగ్, రెస్టారెంట్ సహా సకల సదుపాయాలుంటాయి. పాక్‌లో పనిచేసే అన్ని దేశాల రాయబారులు, వారి కుటుంబాలు, అత్యున్నతాధికారులకు అదొక రిక్రియేషన్ ప్లేస్. ఏ దేశం నుంచైనా కొత్తగా రాయబారి నియమితులయ్యారంటే, గంటల వ్యవధిలోనే ఆ క్లబ్‌లో మెంబర్ కావడం రివాజుగా వస్తోంది. అలా ఇస్లామాబాద్ క్లబ్ రాయబారుల అడ్డాగా పేరుపొందింది. కాగా, గత డిసెంబర్‌లో అజయ్ బిసారియా పాకిస్తాన్‌లో భారత రాయబారిగా బాధ్యతలు చేపట్టారు. సంప్రదాయం ప్రకారం ఇస్లామాబాద్ క్లబ్ మెంబర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. నెలలు గడుస్తున్నప్పటికీ పాక్ అధికారులు ఆయనకు సభ్యత్వం ఇవ్వలేదు. భారత రాయబారుల కార్యకలాపాలపై ఆంక్షలు విధించాలన్న ఉద్దేశంలోనే పాక్ ఈ రీతిగా వ్యవహరిస్తోందని అంటున్నారు.

మోదీని కించపరిచే ఉద్దేశం లేదు!

మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యలపై దుమారం రేగిన నేపథ్యంలో ఆమె శుక్రవారం ఇలా స్పందించారు. మాటల మధ్యలో మోదీ గారు అనే సందర్భంలో దొర్లిన మాట తప్ప సంకుచిత స్వభావంతో ప్రధాన మంత్రిని కించపరిచే ఉద్దేశం ముఖ్యమంత్రికి ఏ మాత్రం లేదన్నారు. అది పొరబాటుగా జరిగిన అంశమేనన్నారు. ఏమీలేని అంశాన్ని పట్టుకుని బీజేపీ వాళ్లు ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం తగదన్నారు. దావోస్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ 600 కోట్ల మంది ప్రజలు తనకు ఓట్లేశారని అన్నారని, దానిపై తాము ఏనాడైనా విమర్శలు చేశామా? అని ప్రశ్నించారు. దేశంలో ఉన్నదే 130 కోట్లమంది జనాభా అని గుర్తుచేశారు. కీలక ప్రసంగాలు చేసేటప్పుడు కూడా కొన్ని పొరబాట్లు జరుగుతుంటాయని ఆమె చెప్పారు. ఈ దేశంలో ప్రధాని మోదీ మంచి పని చేస్తే పొగిడిన వారిలో కేసీఆర్ అందరికంటే ముందున్నారని గుర్తు చేశారు. ఆయన సభలో మాట్లాడుతున్నప్పుడు వేగంగా పలికిన పదాల మధ్యలో చిన్నగా జరిగిన విషయంపై అనవసర రాద్ధాంతం తగదని బీజేపీ నేతలకు కవిత హితవు పలికారు. కాగా, ఇదే విషయంపై గురువారం నిర్మలా సీతారామన్ ప్రస్తావించినప్పుడు సీఎం కేసీఆర్ పొరబాటున నోరు జారారని కేటీఆర్ వ్యాఖ్యానించిన విషయం తెలిసింది. ఆ వ్యాఖ్యలను పట్టించుకోవద్దని ఆయన కోరినా బీజేపీ నేతలు విమర్శలు ఆపకపోవడంతో స్పందించిన కవిత తండ్రి కేసీఆర్‌కు బాసటగా పై వ్యాఖ్యలు చేశారు.

దలైలామాపై మా వైఖరి మారదు

చైనాను సంతృప్తిపర్చేలా నిర్ణయం ఉండదు: భారత్

న్యూఢిల్లీ, మార్చి 2: టిబెట్‌కు చెందిన బౌద్ధమత గురువు దలైలామాపై భారత అభిప్రాయంలో ఎలాంటి మార్పు ఉండబోదని.. ఆయనను దేశ ప్రజలు ఎప్పటిలాగే గౌరవిస్తారని కేంద్ర విదేశాంగ శాఖ తెలిపింది. దలైలామా కార్యక్రమాల నుంచి ప్రభుత్వ అధికారులు దూరంగా ఉండాలని కేంద్రం ఆదేశించినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో విదేశాంగ శాఖ ఈ విధంగా స్పందించింది. ''దలైలామా విషయంలో భారత అభిప్రాయం స్పష్టంగా, స్థిరంగా ఉంది'' అని వెల్లడించింది.

అమ్మ మాట!

- తిరిగొచ్చిన కశ్మీరీ ఉగ్రవాది
- దారి తప్పిన కొడుకు హింసబాట
- కదిలించిన మాతృమూర్తి కన్నీరు



జమ్ము/శ్రీనగర్, మార్చి 2: మమకారానికి ప్రతీక మాతృమూర్తి! ఎంతటి కరుడుగట్టిన గుండెనైనా కరిగించే శక్తి అమ్మ మాటకు సొంతం!! అటువంటి ఆ ప్రేమ మూర్తి కంట నీరు పెడితే.. కఠిన పాషానుడైనా చలించిపోవాల్సిందే!! దీనికి తార్కాణమే కశ్మీర్‌లో దారితప్పి ఉగ్రవాదానికి ఆకర్షితుడైన ఓ యువకుడు తిరిగి ఇంటి బాటపట్టడం. అమ్మ ఏడుస్తూ ఆ కుర్రాడిని ''రారా.. నాన్నా ఆ హింసను వదిలేయ్..'' అంటూ మొరపెట్టుకుంది. ఉగ్ర మూకల మధ్య అలవడిన కఠిన మనస్తత్వం నిలువెల్లా నీరుగారిపోయింది. అమ్మ ప్రేమ మనసును కరిగించేసింది. తాను తిరిగి ఇంటికి చేరాలనుకుంటున్న విషయాన్ని అత్యంత రహస్యంగా కశ్మీర్ పోలీసులకు చేరవేశాడు. వారి సాయంతో అమ్మ చెంతకు చేరుకున్నాడు. ఇన్నాళ్లు దూరమైనందుకు కన్నీటితో క్షమాపణ చెప్పుకొన్నాడు. ఆ కుర్రాడి రాకతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. ఈ ఘటన వివరాలను జమ్ము కశ్మీర్ డీజీపీ శేష్‌పాల్ వైద్ ట్విటర్ ద్వారా వెల్లడించారు. తిరిగి ఒక్కటైన ఆ కుటుంబం సంతోషంగా ఉండాలిని కోరుకుంటున్నట్లు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆ యువకుడితోపాటు కుటుంబం భద్రత దృష్ట్యా వారి పేర్లు వెల్లడించడం కుదరదని పేర్కొన్నారు. ఉగ్ర శిబిరాల మాయమాటలకు లోబడి వారితో కలిసిపోయిన యువకులను తిరిగి జనజీవన స్రవంతిలోకి రావాలని గత ఏడాది కశ్మీర్ పోలీసులు ఆహ్వానించారు. ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్న సమయంలో లొంగిపోయేందుకు ముందుకు వచ్చినా.. వారికి నిర్ణీత కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబంతో కలిసిపోయే అవకాశం కల్పించారు. దీంతో ఇప్పటి వరకు 12 మందికి పైగా యువకులు ఉగ్రవాదాన్ని విడిచి తిరిగి వారి కుటుంబాలతో సంతోషంగా గడుపుతున్నారు. గత నెలలో జరిగిన కశ్మీర్ శాసనసభ సమావేశాల్లో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ సీఎం మెహబూబా ముఫ్తీ ఈ ఏడాదిలోనే నలుగురు యువకులు హింసా మార్గాన్ని వదిలి వెనక్కి వచ్చినట్లు తెలిపారు. ఉగ్రవాదంలోకి వెళ్లిన వారిని వెనక్కి రప్పించేందుకు ఆయా కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇచ్చి.. వారితో యువకులను ఒప్పిస్తున్నట్లు పేర్కొన్నారు. యువకులు హింసను వదిలేసేలా తమ ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని, ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో యూత్ క్లబ్‌లు ఏర్పాటు చేసి ఐటీ శిక్షణ, ఇండోర్ గేమ్స్‌లో తర్ఫీదు ఇస్తున్నామని ముఫ్తీ వెల్లడించారు. తరచూ క్రికెట్ టోర్నమెంట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే సామాజిక మాధ్యమాల ద్వారానే యువతను ఉగ్రవాదులు ఆకర్షిస్తున్నట్లు గుర్తించామని, అందుకే దీనిపై నిఘా పెంచామని వివరించారు.

కూతురు మరణించినా..

- విధినిర్వహణలో పోలీసు తెగువ
- చావుబతుకుల్లోని వ్యక్తిని కాపాడిన భూపేంద్ర
- ఉత్తరప్రదేశ్ హెడ్‌కానిస్టేబుల్‌కు ప్రశంసలు

మీరట్, మార్చి 2: అది ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పూర్ జిల్లా. ఫిబ్రవరి 23వ తేదీ ఉదయం 9 గంటల సమయం. హెడ్‌కానిస్టేబుల్ భూపేంద్ర తోమర్ (57), ఆయన బృందం 100 వాహనంలో (క్విక్ రెస్పాన్స్) పెట్రోలింగ్ ప్రారంభించారు. బడగావ్ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తుండగా వాళ్లకు ఓ ఫోన్ వచ్చింది. రోడ్డు పక్కన ఒక మనిషి పడి ఉన్నాడని, అతడికి చాలా కత్తిపోట్లు ఉన్నాయని ఫోన్ సారాంశం. వెంటనే అక్కడకు వెళ్తుండగా అంతలోనే భూపేంద్రకు మరో ఫోన్ వచ్చింది. ఈసారి అది ఇంటినుంచి వచ్చింది. ఏడాది క్రితమే పెళ్లయిన అతడి కుమార్తె జ్యోతి (27) ఉన్నట్టుండి మరణించింది. ఒక్క నిమిషం పాటు భూపేంద్రకు కాలం స్తంభించిపోయినట్లయింది. ఏం చేయాలో అర్థం కాలేదు. కాసేపు ఆగిన తర్వాత పక్కన ఉన్నవాళ్లకు చెప్పారు. వెంటనే ఇంటికి వెళ్దామని పక్కన ఉన్నవాళ్లంతా అన్నారు. కానీ.. భూపేంద్ర మాత్రం జీపు వెనక్కి తిప్పే సమస్యే లేదని.. ముందు అవతలి ప్రాణాపాయంలో ఉన్న మనిషిని కాపాడాలని చెప్పారు. ఉబికి వస్తున్న కన్నీళ్లను లోలోపలే దాచుకుని, కత్తిపోట్లతో తీవ్రంగా గాయపడ్డ ఆ వ్యక్తిని ఆస్పత్రిలో చేర్చి.. ఆ తర్వాత ఇంటికి వెళ్లారు. సకాలంలో ఆస్పత్రికి వెళ్లడంతో పశువైద్యుడైన ఆ బాధితుడి ప్రాణాలు దక్కాయి. ఇంట్లో తన కూతురి ప్రాణాలు ఎటూ తిరిగి తీసుకురాలేమని.. కనీసం బాధితుడి దగ్గరకు సమయానికి వెళ్లగలిగితే అతడి ప్రాణాలైనా కాపాడినట్లవుతుందని భావించి అక్కడకే వెళ్లడం సముచితమనుకున్నానని భూపేంద్ర గద్గద స్వరంతో చెప్పారు.



జ్యోతి బక్సర్‌లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నర్సుగా పనిచేసేది. గత సంవత్సరమే సౌరభ్‌తో ఆమెకు పెళ్లయింది. ఇద్దరూ సంతోషంగానే ఉన్నారు. ఉన్నట్టుండి బాత్రూంకు వెళ్లి అక్కడే కుప్పకూలి చనిపోయింది. దాంతో కుటుంబమంతా ఒక్కసారిగా దిగ్భ్రాంతి చెందారు. వెంటనే ఆ విషయం భూపేంద్రకు ఫోన్ చేశారు. కానీ ఆయన మాత్రం ముందు అవతలి వ్యక్తి ప్రాణాలు కాపాడటమే కర్తవ్యంగా భావించి అటు వెళ్లారు. ఒకవైపు కుమార్తె మరణించిన విషయం తెలిసినా బాధను దిగమింగుకుని విధి నిర్వహణలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించిన భూపేంద్రను రాష్ట్రంలోని పోలీసు ఉన్నతాధికారులంతా అభినందించారు. స్వయంగా రాష్ట్ర డీజీపీ ఓపీ సింగ్ స్వయంగా భూపేంద్రను పిలిచి.. ముందుగా కూతురి మరణానికి తన సానుభూతి తెలిపారు. తర్వాత విధినిర్వహణలో చూపిన చొరవకు అభినందించారు. సహారన్‌పూర్ డీ ఐజీ శరద్ సచన్, సీనియర్ ఎస్పీ బబ్లూకుమార్ కూడా భూపేంద్రను సత్కరించారు.



గాల్ బ్లాడర్‌లో 99 రాళ్లు!



కర్ణాటకలోని ఓ మహిళ గాల్ బ్లాడర్ (పిత్తాశయం)లో దాదాపు 99 రాళ్లను వైద్యులు ఆపరేషన్ చేసిన తొలగించారు. సల్మా (45) అనే మహిళ కడుపు నొప్పితో తుముకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా.. స్కానింగ్ చేయగా రాళ్లు ఉన్నట్లుగా గుర్తించి ఆపరేషన్ చేశారు. ఆ రాళ్లలో కొన్ని చాలా పెద్దవిగా ఉండటం విశేషం.

ఒకే చోట 15 లక్షల పెంగ్విన్లు!

పారిస్, మార్చి 2: అవునూ.. మీరు చదువుతున్నది నిజమే! అంటార్కిటికాలో గుంపులు గుంపులుగా.. వందల సంఖ్యలో మాత్రమే కనిపించే పెంగ్విన్ పక్షులు ఒకే చోట 15 లక్షల వరకు నివాసం ఉంటున్నట్లుగా పరిశోధకులు గుర్తించారు. అంటార్కిటికాలో డేంజర్ దీవుల్లో వీటిని గుర్తించినట్లు పారిస్ పరిశోధకులు వెల్లడించారు. పశ్చిమ అంటార్కిటికాకు 160 కిలోమీటర్ల దూరంలో ఈ సమూహం ఉందని తెలిపారు. గ్లోబల్ వార్మింగ్ కారణంతో అంటార్కిటికా కరిగిపోతోందని, పెంగ్విన్ల ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో ఈ విషయం వెలుగులోకి రావడం పర్యావరణ ప్రేమికులకు ఊరటనిస్తోంది.

ఆర్‌ఎస్‌ఎస్ నం.2గా హోసబళె!

- భయ్యాజీ జోషి స్థానంలో అవకాశం
- వచ్చే వారం నాగ్‌పూర్‌లో సమావేశం



నాగ్‌పూర్, మార్చి 2: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)లో రెండో స్థానంలో ఉన్న భయ్యాజీ జోషి స్థానంలో దత్తాత్రేయ హోసబళెను నియమించే అవకాశముంది. ఈ నెల 9-11 తేదీల్లో నాగ్‌పూర్‌లో జరిగే ఆర్‌ఎస్‌ఎస్-అఖిల భారతీయ ప్రతినిధి సభ (ఏబీపీఎస్) సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే సూచనలు వెలువడుతున్నాయి. ఈ సమావేశాల్లో ఆర్‌ఎస్‌ఎస్ సర్‌కార్యవాహ్‌గా ఉన్న జోషి పదవి నుంచి వైదొలుగుతారని, ఆయన స్థానంలో హోసబళెను ఎన్నికుంటారని సమాచారం. సంఘ్ పరివార్ సంస్థలకు చెందిన దాదాపు 1500 మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారు. మూడేళ్లకోసారి నాగ్‌పూర్‌లోని ఆర్‌ఎస్‌స్ ప్రధాన కార్యాయంలో ఏబీపీఎస్ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో సర్‌కార్యవాహ్ స్థానానికి ఎన్నికలు నిర్వహించనుండటం కీలకమైన విషయం. ఆర్‌ఎస్‌ఎస్‌లో సర్‌సంఘచాలక్‌ది అగ్రస్థానం. హిందుత్వను పరిరక్షించే ప్రపంచ అతిపెద్ద సంస్థకు మార్గదర్శిగా, దార్శనికుడిగా నాయకత్వ బాధ్యతలు నిర్వహిస్తారు. ఇక రెండోస్థానంలో ఉన్న సర్‌కార్యవాహ్ సంస్థ రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించడంతో పాటు కార్యనిర్వాహక పెద్దగా వ్యవహరిస్తారు.

ఇజ్రాయెల్ ప్రధానిపై విచారణ

- నెతన్యాహుపై అవినీతి ఆరోపణలు
- ఆయన ఇంటికి వచ్చిన పోలీసులు



జెరూసలెం, మార్చి 2: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై మరోసారి అవినీతి ఆరోపణలు వచ్చాయి. మోసానికి పాల్పడం, లంచం తీసుకున్నారన్న అభియోగాలపై నెతన్యాహును ఎనిమిదో సారి ప్రశ్నించడానికి శుక్రవారం ఆయన ఇంటికి పోలీసులు వచ్చినట్టు మీడియా కథనాలు వెలువడ్డాయి. జెరూసలెంలోని నెతన్యాహు అధికార నివాసానికి రెండు వాహనాల్లో పోలీసులు వచ్చినట్టు ఏఎఫ్‌పీ వెల్లడించింది. ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు. కాగా నెతన్యాహు భార్య సారా నుంచి పోలీసులు వాంగ్మూలం తీసుకోనున్నట్టు మీడియా వెల్లడించింది. అవినీతి కేసులో నెతన్యాహు మాజీ సహాయకుడ్ని, ఓ అగ్ర వ్యాపారవేత్తను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. గతవారం మొత్తం ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నెతన్యాహు కుటుంబానికి మీడియా సలహాదారుగా పనిచేసిన నీర్ హెఫెట్జ్ ముడుపుల వ్యవహారంలో కీలక పాత్ర పోషించారని అభియోగాలు వచ్చాయి. ఆయా సంస్థలకు, నెతన్యాహుకు మధ్య ఆయన దూతగా వ్యవహరించారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన కేసులో ప్రధాని భార్య సారాను తప్పించడానికి రిటైర్డ్ న్యాయమూర్తికి లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారనే ఆరోపణలు వచ్చాయి. ఆయా కంపెనీలకు ఆర్థికంగా, ఇతరత్రా లబ్ధి చేకూర్చినందుకు సంపన్నుల నుంచి నెతన్యాహు కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున నగదు, బంగారు నగలు తీసుకున్నట్టు అభియోగాలు వచ్చాయి. అంతేగాక జర్మనీ నుంచి ఇజ్రాయెల్ కొనుగోలు చేసిన మూడు సబ్‌మెరిన్‌ల ఒప్పందంలో అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు వచ్చాయి. అవినీతి కేసుల నేపథ్యంలో రాజీనామా చేయాలని నెతన్యాహుపై ఒత్తిడి రానుందని లేదా ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాగా తాను ఎలాంటి తప్పు చేయలేదని, అక్రమాలకు పాల్పడలేదని నెతన్యాహు చెబుతున్నారు.

లోయలో కారు బోల్తా

- ఎనిమిది మంది దుర్మరణం
- మరో ప్రమాదంలో ముగ్గురి మృతి
- హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదాలు



సిమ్లా, మార్చి 2: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో హిమాచల్ ప్రదేశ్‌లో 11 మంది మరణించారు. కారు లోయలో పడిన ఘటనలో ఎనిమిది మంది భక్తులు మరణించగా, బస్సు, కారును ఢీ కొన్న ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఛండీగర్-మనాలీ జాతీయరహదారిలో స్వర్‌ఘాట్‌కు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ లోయలో కారు పడిన ఘటనలో ఎనిమిది మంది భక్తులు మరణించగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మణికారన్‌లోని సిక్కుల పుణ్యక్షేత్రంలో పూజలు ముగించుకుని పంజాబ్‌కు చెందిన భక్తులు అమృత్‌సర్‌కు కారులో తిరుగు ప్రయాణమయ్యారు.అయితే శుక్రవారం ఉదయం డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో వాహనం అదుపుతప్పి రహదారిని ఆనుకొని ఉన్న లోయలో పడింది. ఈ ఘటనలో ఏడుగురు సంఘటనా స్థలంలోనే మరణించగా ఒకరు చికిత్స పొందుతూ మరణించారు. మరో ఘటనలో బిర్‌బిల్లింగ్ నుంచి ఢిల్లీ వెళుతున్న స్థానిక ఆర్టీసీ బస్సు గురువారం రాత్రి ఉనా వద్ద ఓ కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి గురైన కారులో పది మంది ఉన్నారు. మరణించిన వారిలో ఇద్దరు దంపతులు. క్షతగాత్రులకు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

నీరవ్ మోదీని వేధించొద్దు

- రుణ వసూలుకు ప్రయత్నించొద్దు
- ఆస్తులు స్వాధీనం చేసుకోవద్దు..
- ఫోన్, మెయిల్ కూడా చేయొద్దు
- ఒత్తిడి తెస్తే చట్టపరమైన చర్యలు
- న్యూయార్క్ సదరన్ దివాలా కోర్టు ఆదేశాలు



వాషింగ్టన్, మార్చి 2: పీఎన్‌బీ బ్యాంకుకు వేల కోట్లు కుచ్చుటోపీ పెట్టిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీకి అమెరికా కోర్టులో ఊరట లభించింది. ఆయనకు చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ అమెరికాలోని కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో రుణదాతలు నీరవ్ దగ్గర నుంచి రుణాలను ఇప్పుడే వసూలు చేయొద్దని, అతడి మీద ఎటువంటి ఒత్తిడి తీసుకురావద్దని న్యూయార్క్ సదరన్ దివాలా కోర్టు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రెండు పేజీల నివేదికను విడుదల చేసింది. ఈ వారం మొదట్లో కోర్టులో నీరవ్ మోదీ దివాలా పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాల ప్రకారం..నీరవ్‌కు రుణాలు ఇచ్చిన రుణదాతలు ఆయన దగ్గర నుంచి డబ్బులు తిరిగి తీసుకోవడం కుదరదు. ఆయన ఆస్తులను స్వాధీనం చేసుకోవడం వంటివి చేయకూడదు. నీరవ్‌పై రుణదాతలు ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకునే పిటిషన్లు దాఖలు చేయకూడదు. రుణం చెల్లించాల్సిందిగా రుణగ్రహీతకు ఫోన్, మెయిల్ చేసి డిమాండ్ చేయకూడదు. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి ఎవరైనా నీరవ్ ఫైర్‌స్టార్ సంస్థ ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తే.. రుణదాతలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కోర్టు హెచ్చరించింది.

దీనికి సంబంధించిన నివేదికను నీరవ్‌కు రుణాలు ఇచ్చిన స్టాక్ హోల్డర్లకు పంపించింది. రుణదాతలతో మార్చి 30న సమావేశం నిర్వహించనున్నట్లు కూడా కోర్టు వెల్లడించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.12వేల కోట్ల కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న నీరవ్ మోదీకి చెందిన ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ ఈనెల 26న అమెరికాలో కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేసింది. నీరవ్ మోదీకి చెందిన ఫాంటసీ డైమండ్స్, ఫాంటసీ, జే జేఫ్ సంస్థల తరపున మిహిర్ భన్సాలీ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. పునర్వ్యవస్థీకరణకు వీలు కల్పించే చాప్టర్11(అమెరికా) నిబంధనల ప్రకారం ఫైర్‌స్టార్ డైమండ్ సంస్థ దీన్ని నమోదు చేసింది. వ్యాపారాన్ని సజీవంగా నిలుపుకోవడంతో పాటు రుణదాతలకు అప్పులు తిరిగి చెల్లించే వెసులుబాటు కోసం ఓ ప్రణాళికను ప్రతిపాదిస్తూ ఈ తరహా పిటిషన్‌ను దాఖలు చేస్తారు. మరోవైపు ఈ కంపెనీని కొనుగోలు చేసేందుకు అమెరికాలో పలు కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది.

నా భార్య వేధిస్తోంది!



- త్వరగా విడాకులివ్వండి
- మళ్లీ పెళ్లి చేసుకుంటా
- ఢిల్లీ హైకోర్టులో కశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా పిటిషన్

న్యూఢిల్లీ, మార్చి 1: ''నా భార్యతో దాంపత్య బంధం పూర్తిగా తెగిపోయింది. ఆమె నన్ను క్రూరంగా వేధిస్తోంది. ఇక మేం కలిసి ఉండలేం. నేను మరో పెళ్లి చేసుకుంటాను. త్వరగా విడాకులు ఇప్పించండి''... అంటూ జమ్ము కశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా కోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే కిందిస్థాయి కోర్టుకు వెళ్లగా అక్కడ విడాకులు మంజూరు కాలేదు. దీంతో ఆ తీర్పును సవాలు చేస్తూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని విచారణకు స్వీకరించిన జస్టిస్ సిద్ధార్థ్ మృదుల్, దీపా శర్మల ధర్మాసనం ఈ పిటిషన్‌పై ఆయన భార్య పాయల్‌కు నోటీసులు పంపింది. కేసు తదుపరి విచారణ జరిగే ఏప్రిల్ 23వ తేదీలోపు వివరణ తెలుపుతూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. కాగా, ఒమర్ అబ్దుల్లా 1994లో పాయల్ నాథ్ అనే యువతిని వివాహం చేసుకున్నారు. 2007 నుంచి ఇద్దరి మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. దాంతో 2009 నుంచి ఇద్దరూ వేరుగా ఉంటున్నారు. వీరిద్దరికీ ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు తల్లి వద్దే ఉంటున్నారు. అయితే పాయల్ క్రూరంగా తనను వేధిస్తోందని, ఇక ఆమెతో కలిసి జీవించలేనని పేర్కొంటూ తొలుత ఢిల్లీలోని ఓ కిందిస్థాయి కోర్టులో విడాకుల కోసం ఒమర్ పిటిషన్ వేశారు. ఆయా ఆరోపణలను ఒమర్ నిరూపించలేకపోయారని, పిటిషన్‌ను కొట్టేస్తూ2016 ఆగస్టు 30న కోర్టును తీర్పు వెల్లడించింది. దీంతో ఆయన ఇప్పుడు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. కాగా, నాడు మరో పెళ్లి చేసుకోవాలనుకుంటున్నట్లు కూడా పాయల్ చెప్పిందని, తర్వాత మాట మార్చిందని ఒమర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకుని తనకు త్వరగా విడాకులు మంజూరు చేస్తే.. తాను కూడా మరో పెళ్లి చేసుకుంటానని ఆయన వివరించారు.

నీరవ్ ఉన్నాడో.. లేడో!

- ఏమో చెప్పలేమంటున్న అమెరికా
- జనవరిలోనే చెక్కేసిన వ్యాపారి
- ఆయనతోనే మెహుల్ చోక్సీ కూడా
- బ్లూకార్నర్ నోటీసు జారీచేసిన సీబీఐ

వాషింగ్టన్, మార్చి 2: స్వదేశంలో వేలకోట్ల మేర బ్యాంకులలో అప్పులు చేసి వాటిని నిలువునా ముంచేసిన వజ్రాల వ్యాపారి నీరవ్‌మోదీ.. అమెరికాలో ఉన్నాడో లేడో తాము నిర్ధారించలేమని అమెరికా సన్నాయి నొక్కులు నొక్కుతోంది. అతడు అక్కడే ఉన్నట్లు మీడియా కథనాలు వస్తున్న మాట నిజమే కానీ, తాము వాటిని నిర్ధారించలేమని అమెరికా హోంశాఖ అధికార ప్రతినిధి అన్నారు. నీరవ్ మోదీ ఆచూకీ కనిపెట్టడంలో భారత ప్రభుత్వానికి అమెరికా హోంశాఖ ఏమైనా సహకరిస్తోందా అని ప్రశ్నించగా.. వాళ్లకు న్యాయపరమైన సాయం ఏమైనా కావాలంటే తమ న్యాయశాఖను సంప్రదించవచ్చని, నీరవ్‌మోదీ కేసు దర్యాప్తులో వాళ్లు సహకరిస్తారని అన్నారు.



పంజాబ్ నేషనల్ బ్యాంకు అధికారులు సీబీఐకి ఫిర్యాదు చేయడానికి చాలా ముందే.. అంటే జనవరిలోనే నీరవ్ మోదీ, అతడి కుటుంబ సభ్యులు, గీతాంజలి జెమ్స్ ప్రమోటర్ మెహుల్ చోక్సీ తదితరులంతా కలిసి దేశం వదిలి అమెరికాకు వెళ్లిపోయారు. ఈ కేసు దర్యాప్తు కోసం భారతదేశానికి రావాలని, తమకు సహకరించాలని సీబీఐ అడిగినా, తనకు విదేశాలలో వ్యాపారాలు ఉన్నాయి కాబట్టి వచ్చే ప్రసక్తి లేదని నీరవ్ కుండబద్దలు కొట్టిన విషయం తెలిసిందే. నీరవ్, చోక్సీ స్వదేశానికి భూ, వాయు, సముద్ర మార్గాల్లో ఎలా వచ్చినా వెంటనే గుర్తుపట్టి సీబీఐకి అప్పగించేందుకు వీలుగా ఇప్పటికే బ్లూ కార్నర్ నోటీసు ఒకటి జారీచేశారు. అలాగే అమెరికాలోని భారత రాయబార కార్యాలయాన్ని సైతం సీబీఐ సంప్రదించింది. అతడు ఎప్పుడు భారతదేశానికి ప్రయాణమవుతున్నా వెంటనే వారికి తెలుస్తుంది కాబట్టి ఆ సమాచారం అందుకోడానికి వీలుగా ఉంటుందని ప్రయత్నిస్తున్నారు.

అమెరికా X రష్యా

- ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితులకు రష్యా ఆజ్యం
- ఒప్పందాలకు విరుద్ధంగా ఆయుధాల తయారీ: అమెరికా
- అమెరికా స్నేహపూర్వకంగా ఉండట్లేదు
- ఆ దేశంతో వ్యూహాత్మక చర్చలు రద్దు: రష్యా
- సిరియాలో కొనసాగిన టర్కీ దాడులు
- 17 మంది ప్రభుత్వ అనుకూల ఫైటర్ల మృతి



రష్యా ప్రయోగించిన అత్యాధునిక సార్మట్ ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి

వాషింగ్టన్/ మాస్కో/బీరుట్, మార్చి 2: రష్యా తిరిగి ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తోందని అమెరికా ఆరోపించింది. ''అత్యంత ఆధునికమైన శత్రు దేశాలు గుర్తించలేనంత సామర్థ్యంతో కూడిన కొత్త తరం అణ్వాయుధాలను అభివృద్ధి చేసింది. ఇందులో హైపర్‌సోనిక్ అణు క్షిపణులు, అధునాతన జలాంతర్గాములు ఉన్నట్లు తెలిసింది. ఇది తిరిగి ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితులను తలపిస్తోంది.'' అని వైట్‌హౌజ్ మీడియా కార్యదర్శి సారా శాండర్స్ పేర్కొన్నారు. ఇలా ఖండాతర క్షిపణులను రష్యా తయారు చేయడం గతంలో ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాలకు తీవ్ర విరుద్ధమని ఆమె వ్యాఖ్యానించారు. మరోవైపు, రష్యా నుంచి ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు అమెరికా సిద్ధంగా ఉందని పెంటగాన్ ప్రతినిధి డానా వైట్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, స్నేహపూర్వకంగా తమతో మసలుకోనందుకు నిరసనగా అమెరికాతో ఈ నెల చివర్లో జరగాల్సిన వ్యూహాత్మక చర్చలను రద్దు చేస్తున్నామని రష్యా ప్రకటించింది. జెనీవాలో ఈ అంశంపై గత నెల చివరల్లో చర్చలు జరగాల్సి ఉన్నా.. అమెరికా అకస్మాత్తుగా వైదొలగిందని, ఇలా చేసినం దుకు నిరసనగా తాము చర్చలను రద్దు చేసుకున్నామని అమెరికాలోని రష్యా రాయబారి అటోనీ అంటోవ్ వెల్లడించారు.

సిరియాలో కొనసాగిన టర్కీ దాడులు

సిరియాపై దాడుల పరంపర కొనసాగుతూనే ఉన్నది. శుక్రవారం అమెరికా మిత్రపక్షమైన టర్కీకి చెందిన ఫైటర్ విమానాలు సిరియాలోని అఫ్రిన్ ప్రాంతంలోని ప్రభుత్వ అనుకూల వర్గాలే లక్ష్యంగా పలు చోట్ల గగనతల దాడులు జరిపాయి. ఈ దాడుల్లో పెద్ద సంఖ్యల్లో ప్రభుత్వ అనుకూల ఫైటర్లు 17 మంది వరకు మృతి చెందారని హ్యూమన్ రైట్స్ వాచ్ సంస్థ వెల్లడించింది. అయితే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని వార్తలు వస్తున్నాయి. మరోవైపు, తిరుగుబాటుదారుల ప్రాబల్యమున్న గౌటాలో.. స్థానికులు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేందుకు సమయం ఇవ్వాలని సిరియా అధ్యక్షుడు బషర్-అల్-అస్సాద్‌పై ఒత్తిడి తేవాలని రష్యాకు అమెరికా విజ్ఞప్తి చేసింది. ''తూర్పు గౌటాలో.. ముఖ్యంగా జనావాసాలపై అసద్ బలగాలు దాడులు జరుపుతూనే ఉన్నాయి. ఇది చాలా విచారకరం'' అని పెంటగాన్ ప్రతినిధి డానా వైట్ పేర్కొన్నారు. ''సిరియాతో ఘర్షణ పడాలన్నది మా ఉద్దేశం కాదు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా చేపడుతున్న ఆపరేషన్లకు అడ్డుతగలకూడదని అస్సాద్‌కు రష్యా చెప్పాలని భావిస్తున్నాం'' అని వెల్లడించారు.



గెలుపోటములు తేలేది నేడే

- నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి



అగర్తల/కోహిమా/షిల్లాంగ్, మార్చి 2: ఈశాన్య రాష్ట్రాలైన నాగాలాండ్, మేఘాలయా, త్రిపురల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం తేలనున్నాయి. ఈ మూడు రాష్ట్రాల ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలను తేల్చేందుకు ఈసీ అన్ని ఏర్పాటు చేసింది. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఆయా రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంతో మూడ రాష్ట్రాల్లోనూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, త్రిపురలో ఫిబ్రవరి 18న, మేఘాలయా, నాగాలాండ్‌లలో ఫిబ్రవరి 27న పోలింగ్ జరిగింది. మూడు రాష్ట్రాల్లోనూ 60 చొప్పున అసెంబ్లీ స్థానాలున్నాయి. అయితే వేర్వేరు కారణాల వల్ల మూడింటిలోనూ 59 స్థానాలకే పోలింగ్ జరిగింది. కాగా, మేఘాలయాలో పదేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ముచ్చటగా మూడోసారి మేఘాలయా పీఠాన్ని దక్కించుకునేందుకు ఆ పార్టీ అన్ని ప్రయత్నాలు చేసింది. మళ్లీ అధికారాన్ని సొంతం చేసుకోవడంపై ఆ పార్టీ నాయకులు కూడా ధీమాగా ఉన్నారు. ఇక నాగాలాండ్‌లో 2003 నుంచి నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌ఎఫ్‌పీ) పార్టీనే అధికారంలో ఉంది. 2008లో ఇక్కడ రాజకీయ సంక్షోభం తలెత్తిన నేపథ్యంలో మూడు నెలల పాటు రాష్ట్రపతి పాలన విధించారు. అయినప్పటికీ ఆ తర్వాత కూడా ఎన్‌ఎఫ్‌పీనే అధికారంలోకి వచ్చింది. ఇక్కడ బీజేపీ-ఎన్డీపీపీ కూటమి అధికారాన్ని కైవసం చేసుకుంటుందని ఎగ్జిట్ పోల్స్ పేర్కొంటున్నాయి. మరోవైపు త్రిపురలో లెఫ్ట్‌ఫ్రంట్ వరుసగా ఐదు దఫాలుగా అధికారంలో కొనసాగుతోంది. 25 ఏళ్లుగా సీఎంగా ఉన్న మాణిక్ చంద్ నాయకత్వంలో ఎన్నికలకు వెళ్లిన సీపీఎం ఆరోసారి అధికారాన్ని సొంతం చేసుకుంటామనే ధీమాతో ఉంది. త్రిపురలోనూ బీజేపీకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి.

త్రిపుర మంత్రి ఖగేంద్ర కన్నుమూత

త్రిపుర మత్స్య శాఖ మంత్రి ఖగేంద్ర జమాతియా (64) కన్నుమూశారు. బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతూ ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న శుక్రవారం తుది శ్వాస విడిచారు. కాగా, ఫిబ్రవరి 18న జరిగిన ఎన్నికల్లో ఆయన కృష్ణపూర్ నియోజకవర్గం నుంచి సీపీఎం తరపున పోటీ చేశారు. మరో రోజులో ఎన్నికల ఫలితాలు విడుదల కానున్న సమయంలో మరణించడం గమనార్హం.

మనం మూవీ
manammovie
శనివారం, 3 మార్చి 2018 | హైదరాబాద్ | 8

నితిన్ చిత్రంలో...




'దిల్' వంటి విజయవంతమైన చిత్రం తరువాత నితిన్ కథానాయకుడిగా దిల్ రాజు ఓ సినిమాని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. 'శ్రీనివాస కల్యాణం' పేరుతో తెరకెక్కనున్న ఈ సినిమాలో రాశి ఖన్నా, నందితా శ్వేత కథానాయికలుగా నటిస్తున్నారు. 'శతమానం భవతి' ఫేమ్ సతీష్ వేగేశ్న ఈ సినిమాకి దర్శకత్వం వహించనున్నారు. ఇదిలా ఉంటే.. ఈ సినిమాలో కథకు కీలకమైన రాశి ఖన్నా తండ్రి పాత్ర కోసం సీనియర్ కథానాయకుడు శ్రీకాంత్‌ను సంప్రదించిందట చిత్ర బందం. అయితే.. ఆ పాత్ర చేసే విషయంలో శ్రీకాంత్ ఆలోచనలో పడడంతో.. ప్రకాష్ రాజ్‌ను సంప్రదించిందట చిత్ర యూనిట్. పాత్ర నచ్చడంతో ప్రకాష్ రాజ్ వెంటనే ఒప్పుకున్నారని సమాచారం. ఈరోజు పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానున్న ఈ సినిమా.. 23 నుంచి నిరవధికంగా చిత్రీకరణ జరుపుకోనుంది. మిక్కీ జే.మేయర్ ఈ చిత్రానికి సంగీతమందించనున్నారు.

బాలీవుడ్ సినిమాటోగ్రాఫర్‌తో



● మహేష్



● కె.యు. మోహన్

మహేశ్ హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. దేవిశ్రీ ప్రసాద్ సంగీత సారథ్యంలో నాలుగు పాటల రికార్డింగ్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బాలీవుడ్ చిత్రాలు డాన్, తలాష్, రాయిస్ చిత్రాలకు సినిమాటోగ్రఫీ అందించిన ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.యు.మోహన్ ఈ సినిమాకు కెమెరామెన్‌గా పనిచేయనున్నారు. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. మే నెలలో రెగ్యులర్ షూటింగ్ జరుపుకోనున్న ఈ సినిమాను అశ్వనీదత్, దిల్‌రాజు నిర్మిస్తున్నారు. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుంది. ఇది మహేశ్ 25వ సినిమా కావడం విశేషం.

రిలీజ్ ఎప్పుడంటే...



● సాయిధరమ్ తేజ్

తొలి చిత్రం 'తొలిప్రేమ' సక్సెస్‌తో దర్శకుడిగా తన టాలెంట్‌ను నిరూపించుకున్నాడు ప్రేమకథా చిత్రాల స్పెషలిస్ట్ ఎ.కరుణాకరన్. ప్రస్తుతం ఈయన దర్శకత్వంలో యువ కథానాయకుడు సాయిధరమ్ తేజ్ ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. పేరు నిర్ణయించని ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తుండగా.. గోపీ సుందర్ స్వరాలు అందిస్తున్నారు. క్రియేటివ్ కమర్షియల్స్ సంస్థ అధినేత కె.ఎస్.రామారావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఇదిలా ఉంటే.. ఈ సినిమాకి విడుదల తేదిగా జూన్ 14ని ఫిక్స్ చేసుకున్నట్లు టాలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. త్వరలోనే టైటిల్, రిలీజ్ డేట్‌పై క్లారిటీ వస్తుంది.

సినీ సమీక్షకుడు దేవరాజు రవి కన్నుమూత



ప్రముఖ కథకుడు, నవలాకారుడు, సినిమా సమీక్షకుడు అన్నిటినీ మించి సాంఘిక సేవా కార్యకర్త దేవరాజు రవి(79) కన్ను మూశారు. గత కొంతకాలంగా క్యాన్సర్ వాధితో బాధపడుతున్న ఆయన మార్చి 2వతేదీ ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లోని మేడిపల్లిలో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దేవరాజు రవి 12 నవలలు, 200కు పైగా కథలు, 1250 సినిమా సమీక్షలు, ఇంకా పలు ఇతర వ్యాసాలూ రాశారు. 1959లో రామం అనే నవలతో ప్రారంభమైన ఆయన రచనా వ్యాసంగం చివరిరోజు వరకు కొనసాగింది. మూడు కవితా సంపుటాలు, రెండు కథా సంపుటాలు వెలువరించారు. సితార, శివరంజని, మేఘసందేశం, నంబర్ వన్ సినిమా పత్రికలలో ఆయన రాసిన సమీక్షలు పాఠకుల్ని విశేషంగా ఆకట్టుకోడమేకాక నిష్పక్షపాత సమీక్షలు కావడంతో సినీ వర్గాల ప్రశంసల్ని పొందాయి. ఆయన రచనల్ని సర్వేపల్లి రాధాకృష్ణన్, వి.వి.గిరి వంటి ప్రముఖులు మెచ్చుకున్నారు. నంది అవార్డుల కమిటీలో రెండుసార్లు సభ్యులుగా ఉన్నారు. తెలుగులో తొలి డిటెక్టివ్ నవల 'వాడే వీడు' రచయిత దేవరాజు వెంకట కృష్ణారావు తనయులు దేవరాజు రవి. వీరి స్వస్థలం బరంపురం. దేవరాజు రవి సుప్రసిద్ధ సాంఘిక కార్యకర్త. కుష్టువ్యాధి నిర్మూలనకు విశేషంగా కృషి చేశారు. ఎంతోమంది రోగులకు స్వయంగా సేవ చేశారు. లెప్రసీ డాక్టర్‌గా ఏరికోరి ఉద్యోగం చేసి, పదవి విరమణ అనంతరం సైతం ఆ సేవల్ని కొనసాగించారు. శనివారం రేపు హైదరాబాద్‌లో ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. దేవరాజు రవి మృతి పట్ల ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది.

పోలీస్ ఆఫీసర్‌గా!



● అనుష్క

హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాలకు చిరునామాలా నిలిచిన తారలలో జ్యోతిక, అనుష్కను ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు. తమిళనాట ఇలాంటి చిత్రాలతో జ్యోతిక ఆకట్టుకుంటే.. తెలుగు నాట ఈ తరహా చిత్రాలలో అనుష్క మెప్పించారు. ఇదిలా ఉంటే.. విలక్షణ దర్శకుడు బాలా దర్శకత్వంలో జ్యోతిక ఓ సినిమా చేసిన సంగతి తెలిసిందే. 'నాచియార్' పేరుతో రూపొందిన ఈ తమిళ చిత్రంలో జ్యోతిక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించారు. ఈ చిత్రానికి అక్కడ మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో.. ఇప్పుడు ఈ సినిమా రీమేక్ హక్కులను కల్పన కోనేరు కొనుగోలు చేశారు. అంతేగాకుండా, చిత్ర దర్శకుడు బాలా సలహా మేరకు అనుష్కతో ఈ చిత్రం రీమేక్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని సమాచారం. 'భాగమతి' తరువాత మరో చిత్రానికి సంతకం చేయని అనుష్క.. ఈ రీమేక్ చేస్తారా? లేదా అనేదానిపై త్వరలోనే క్లారిటీ వస్తుంది. అన్నట్టు.. తమిళ చిత్రం 'శకుని'లో అనుష్క పోలీస్ అధికారి పాత్రలో కాసేపు తళుక్కున మెరిసిన సంగతి తెలిసిందే. ఆ తరువాత మళ్ళీ ఆ తరహా పాత్రలో ఆమె కనిపించనేలేదు. ఈ రీమేక్ కార్యరూపం దాల్చితే.. పూర్తి స్థాయి పోలీస్ పాత్రలో అనుష్కని తెరపై చూసే అవకాశం ఆమె అభిమానులకు దక్కినట్టే.

బన్ని చిత్రంలో నదియా

నిన్నటి తరం కథానాయిక నదియా.. 'మిర్చి' (2013) సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో రీ-ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇక అదే సంవత్సరంలో విడుదలైన పవన్ కళ్యాణ్ 'అత్తారింటికి దారేది' చిత్రంలో పవన్‌కు మేనత్త పాత్రలో నటించారు. ఈ సినిమా పవన్



కెరీర్లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలవడమే కాకుండా.. ఇండస్ట్రీ హిట్‌గా కూడా నిలిచింది. అంతేగాకుండా, అత్త పాత్రలో నదియా నటన కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తరువాత.. రెండు సంవత్సరాల గ్యాప్‌తో రామ్ చరణ్ నటించిన 'బ్రూస్ లీ' (2015) చిత్రంలో కూడా ఆమె ముఖ్య భూమికను పోషించారు. కట్ చేస్తే.. మూడు సంవత్సరాల తర్వాత మరో మెగా హీరో చిత్రంలో నదియా సందడి చేయనున్నారు. ఆ హీరో అల్లు అర్జున్ కాగా.. ఆ చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. ఇందులో కూడా నదియా ఓ కీలక పాత్రను పోషిస్తున్నారు. మరి పవన్‌కు కలిసొచ్చిన నదియా.. బన్నీకు కూడా కెరీర్‌లో మరచిపోలేని విజయాన్ని అందిస్తారేమో చూడాలి. కాగా, వక్కంతం వంశీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 4న విడుదల కానుంది.

ప్రాణాలు పణంగా పెట్టి...



● కంగనా రనౌత్

'గౌతమి పుత్ర శాతకర్ణి' తర్వాత క్రిష్ దర్శకత్వం వహిస్తున్న మరో చారిత్రాత్మక చిత్రం 'మణికర్ణిక'(ది క్వీన్ ఆఫ్ ఝూన్సీ). ఈ సినిమాకి సంబంధించిన తొలి భాగం రామోజీ ఫిలింసిటీలో చిత్రీకరించారు. ప్రస్తుతం రాజస్థాన్‌లోని బికెనిర్‌లో షూటింగ్ జరుగుతోంది. యుద్ధ నేపథ్యంలో సాగే చిత్రం కావడంతో కంగనా... కత్తి సాము, గుర్రపు స్వారీ వంటి విద్యలను నేర్చుకోవాల్సి వచ్చింది. ఆ క్రమంలో ఆమె ఎన్నో ప్రమాదాలకు లోనైంది. ''ఇది నాకు ఛాలెంజ్‌తో కూడుకున్న సినిమా. కొన్ని రిస్కీ షాట్స్‌లో పాల్గొనాల్సి వచ్చేది. అలా నేను చాలా సార్లు ప్రమాదానికి గురయ్యాను. కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి కూడా ఏర్పడింది'' అంటూ చెప్పుకొచ్చింది కంగనా. ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ ఈ సినిమాకు కథను అందించారు. మరో విజువల్ వండర్‌గా 'మణికర్ణిక' చిత్రాన్ని రూపొందించేందుకు దర్శకుడు క్రిష్ ఎంతో కృషి చేస్తున్నారు. ఈ చిత్రంలో సోనూ సూద్, అంకితా లోఖాండే, అతుల్ కులకర్ణి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

రెండేళ్ల తర్వాత!



● అభిషేక్ బచ్చన్

'కెమెరా ముందుకు రాక దాదాపుగా రెండేళ్ల అవుతుంది. కొత్త ప్రయాణం. కొత్త సినిమా ప్రారంభమైంది. మీ అందరి ఆశీర్వాదం కావాలి' అంటూ సోషల్ మీడియాలో ట్వీట్ చేశాడు బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్. 'మన్మార్జియాన్' అనే కొత్త చిత్రంలో అభిషేక్ నటిస్తుండగా.. ఈ చిత్రం శుక్రవారం ప్రారంభమైంది. ఇందులో అభిషేక్ సరసన తాప్సీ నటించనుండగా.. విక్కీ కౌశల్ కీలక పాత్రలో కనిపించనుంది. ప్రముఖ దర్శకుడు అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి మరో దర్శకుడు ఆనంద్ ఎల్.రాయ్ నిర్మించడం విశేషం. అయితే 2016లో 'హౌస్‌ఫుల్-3' తర్వాత అభిషేక్ నటిస్తోన్న చిత్రమిదే.

'కణం' ఎంతో ఇష్టపడి చేశాను

- సాయిపల్లవి



● నాగశౌర్య, సాయిపల్లవి

నాగ శౌర్య, సాయిపల్లవి జంటగా ఎన్.వి.ఆర్. సినిమా సమర్పణలో లైకా ప్రొడక్షన్స్ పతాకంపై విజయ్ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'కణం'. ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ పూర్తయింది. మార్చి5న హైదరాబాద్‌లో 'కణం' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సాయిపల్లవి మాట్లాడుతూ ''కణం' చిత్రం తల్లి, కూతురికి మధ్య ఉండే భావోద్వేగాల ఆధారంగా ఉంటుంది. నేను ఏదైనా సినిమా చేస్తున్నప్పుడు అందులో నా పాత్రకి ఎలా న్యాయం చేయగలను అనేది చూసుకుంటాను. విజయ్‌గారు ఈ కథ చెప్పి, ఇందులో నేను తల్లి పాత్ర చేయాలి అని అడిగినప్పుడు ఈ పాత్రలోని ఎమోషన్స్‌ని పండించగలనా అనుకున్నాను. ఎందుకంటే ఇలాంటి పాత్ర ఇది వరకు నేను చేయలేదు. విజయ్ గారు, నేను సినిమా గురించి చాలా చర్చించుకున్నాం. చిత్రంలో నా కూతురిగా కనిపించే వెరోనికాతో చాలా సమయం గడిపాను. తాను నేను నిజంగానే తల్లీకూతుళ్ల లాగ కలిసిపోయాం. అందువల్ల సినిమాలో కనిపించే ఎమోషన్స్ అన్ని చాలా సహజంగా ఉంటాయి. ఏ సీన్‌కి ఎలాంటి ఎమోషన్ ఉంటే బావుంటుందో విజయ్‌గారికి బాగా తెలుసు. 'నన్ను మీరు యాక్ట్ చేయనివ్వట్లేదు' అని విజయ్‌గారితో అనేదాన్ని. నటిగా ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైంది. పాత్రని ఎంతో ఇష్టపడి చేసాను.'' అన్నారు.

స్నేహం ఒకవైపు... శత్రుత్వం మరో వైపు



● విజయ్ సేతుపతి

ఇద్దరు స్టార్ హీరోల్లో ఒకరితో స్నేహం.. మరొకరితో శత్రుత్వం కొనసాగిస్తున్నారు యువ కథానాయకుడు. ఇంతకు ఆ హీరో ఎవరో కాదు. కోలీవుడ్‌కి చెందిన విజయ్ సేతుపతి. ఇంతకు ఒకరితో స్నేహం.. మరొకరితో శత్రుత్వం ఎందుకని అనుకుంటున్నారా?.. కాస్త వివరాల్లోకి వెళితే.. చిరంజీవి కథానాయకుడిగా రూపొందుతున్న 'సైరా నరసింహారెడ్డి'లో తమిళ కథానాయకుడు విజయ్ సేతుపతి ఓ కీలకమైన పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఆయన చిరుకి సహాయకుడిగా నమ్మినబంటు తరహా పాత్రలో కనిపించనున్నారు. ఇక ఇదే విజయ్ సేతుపతి.. రజనీకాంత్ కథానాయకుడిగా 'పిజ్జా' దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ రూపొందిస్తున్న చిత్రంలో విలన్‌గా నటించబోతున్నారని సమాచారం. అంటే చిరుతో స్నేహం.. రజనీతో శత్రుత్వం పాటించనున్నారన్నమాట విజయ్. త్వరలోనే రజనీ చిత్రంలో విజయ్ పాత్రపై క్లారిటీ వస్తుంది.






శుక్రవారం విజయవాడలో పిల్లలు, యువతీ యువకులు, మహిళలు హోలీ సంబరాలు చేసుకున్నారు. రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు

14న జనసేన ఆవిర్భావ సభ

- గుంటూరులో నిర్వహణకు ఏర్పాట్లు
- నాలుగేళ్ల ప్రస్థానంపై చర్చ: పవన్ కల్యాణ్



హైదరాబాద్, మార్చి 2(మనం ప్రతినిధి): జనసేన పార్టీని స్థాపించి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 14న పార్టీ ఆవిర్భావ మహా సభను నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వెల్లడించారు. జనసేన సిద్ధాంతాలు, నాలుగేళ్ల ప్రస్థానంపై ఈ సభలో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. గుంటూరులో నాగార్జున వర్సిటీ ఎదురుగా ఉన్న 35 ఎకరాల స్థలంలో సభకు సంబంధించిన ఏర్పాట్లు విస్తృతంగా జరుగుతున్నా యన్నారు. జనసేనను అభిమానించే వారందరూ ఒకచోట కలిసి తెలుగు ప్రజల సేవకు పునరంకితమయ్యే ఆ దినం జన సైనికులందరికీ పండగ వంటిదని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంపై సమన్వయం కోసం విజయవాడలోని భారతీనగర్‌లో ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సభకు వచ్చే వారి భద్రత, ఇతర ఏర్పాట్లపై అంతర్గత కమిటీలను నియమించినట్లు పేర్కొన్నారు.



తెలంగాణకు 24.. ఏపీకి 9 టీఎంసీలు

- కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయం
- సాగర్ వద్ద జల జగడం నేపథ్యంలో భేటీ
- ప్రస్తుత నీటి లభ్యత ఆధారంగా కేటాయింపు

హైదరాబాద్, మార్చి 2(మనం ప్రతినిధి): కృష్ణా నదిలో ప్రస్తుతం ఉన్న నీటి లభ్యత ఆధారంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు నీటి కేటాయింపులు చేస్తూ కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుంది. మొత్తంగా ఉన్న 33 టీఎంసీల్లో తెలంగాణకు 24.. ఏపీకి 9 టీఎంసీలు కేటాయించింది. ఈ మేరకు సాగర్ నుంచి నీటిని విడుదల చేసేందుకు నిర్ణయించింది. నాగార్జున సాగర్ వద్ద కృష్ణా జలాల వివాదం రగిలిన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో కమిటీ సమావేశమైంది. ఇప్పటికే ఏపీ తన వాటాకు మించి అదనంగా కృష్ణా జలాలను వాడుకొందని, ఏపీ అవసరాల కోసం తమ రాష్ట్ర ప్రయోజనాలను నష్టం కలిగించే ప్రయత్నం తగదని ఈ సందర్భంగా తెలంగాణ వాదించింది. మార్చి 20 వరకు సాగర్ మట్టం 520 అడుగులు ఉండేలా రెండు రాష్ట్రాలు అంగీకరించాయి. మార్చి చివరికి 515 అడుగుల నీటిమట్టం ఉండేలా ఒప్పందం కుదిరింది. ఇందుకుగాను శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను సాగర్‌కు విడుదల చేసేందుకు ఏపీ అంగీకారం తెలిపింది. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలకు సంబంధించి మళ్లీ ఉత్తర్వులు జారీచేయాలని కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ నిర్ణయం తీసుకుంది. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ, ఏపీ ఇరిగేషన్ ఈఎన్సీలు మురళీధరరావు, వెంకటేశ్వరరావు, నాగార్జున సాగర్ సీఈ ఎస్.సునీల్, కర్నూలు సీఈ నారాయణ రెడ్డి, అంతర్రాష్ట్ర జలవనరుల సీఈ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ న్యాయవాదుల నిరసన

- హైకోర్టు విధుల బహిష్కరణ

హైదరాబాద్, మార్చి 2 (మనం లీగల్ ప్రతినిధి): న్యాయమూర్తుల పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల నిరసన రెండో రోజూ కొనసాగింది. న్యాయవాదుల సంఘాల పిలుపు మేరకు శుక్రవారం కూడా న్యాయవాదులు హైకోర్టు విధుల్ని బహిష్కరించారు. అత్యవసర కేసులు మాత్రమే విచారణ జరిగాయి. ఇరు సంఘాల అధ్యక్షులు కనకయ్య/ధనుంజయల ఆధ్వర్యంలో హైకోర్టు గేటు వద్ద న్యాయవాదులు సమావేశమై తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. 'హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ పెట్టాలి. ఉమ్మడి హైకోర్టులోని 61 జడ్జీల పోస్టుల్లో ఖాళీగా ఉన్న సగం పోస్టుల్ని వెంటనే భర్తీ చేయాలి. 2015 నుంచి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఉన్నారు. పూర్తి స్థాయి సీజేను నియమించాలి. సీఆర్‌పీసీలోని సెక్షన్ 41-ఏను రద్దు చేయాలి. 2012 వరకూ ఉన్న పెండింగ్ కేసుల్ని హైకోర్టులు సత్వరమే పరిష్కరించాలనే ఉత్తర్వుల్ని రద్దు చేయాలి' అన్న డిమాండ్లతో న్యాయవాద సంఘాలు నిరసనలు చేపడుతున్నాయి.

థియేటర్ల బంద్ సంపూర్ణం

విశాఖపట్నం, మార్చి 2 (మనం న్యూస్ బ్యూరో): డిజిటల్ ఫీజుల పెంపుదలను నిరసిస్తూ విశాఖ నగరంలోని 44 థియేటర్లలో ప్రదర్శనలను నిలిపివేశారు. విశాఖ రూరల్ జిల్లాలోని మరో 25 థియేటర్లు మతపడ్డాయి. ఉత్తరాంధ్ర జిల్లాలలోని మొత్తం 150 థియేటర్లు మూతపడ్డాయని, యజమానులు బంద్ పాటించారని ఫిలిం ఛాంబర్ ప్రతినిధులు చెప్పారు. సమస్య పరిష్కారమయ్యే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళలో థియేటర్లను బంద్ చేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే.

భారత ధాన్యాగారం ఏపీ

- వ్యవసాయంలో ఎక్కువ వృద్ధి రేటు: సీఎం
- వరి పరిశోధన కేంద్రం బృందం సమావేశం
- ఇన్నోవేషన్ కేంద్రం ఏర్పాటుకు సుముఖత



అమరావతి, మార్చి 2 (మనం ప్రతినిధి): వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ వృద్ధి రేటు కేంద్రం కన్నా ఎక్కువగా ఉందని, దక్షిణ భారతదేశంలోనే వరిని అత్యధికంగా ఉత్పత్తి చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. పిలిఫ్పీన్స్‌కు చెందిన అంతర్జాతీయ వరి పరిశోధన కేంద్రం బృందం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయన నివాసంలో కలిసింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక సహాయం, తక్కువ ఖర్చు, మేలైన నాణ్యత ప్రమాణాలతో అధిక దిగుబడులు సాధించటానికి తగిన శాస్త్రీయ పద్ధతులతో కూడిన నివేదిక సమర్పించాలని పరిశోధన బృందాన్ని కోరారు. భారత ధాన్యాగారంగా ఆంధ్రప్రదేశ్ పేరుగాంచిందని వివరించారు. వ్యవసాయం, ఉద్యాన పంటలు, ఆక్వా రంగాలలో ఏపీని బెస్ట్ హబ్‌గా రూపొందించాలనేదే తమ లక్ష్యమని సీఎం చెప్పారు. వాతావరణం, వర్షపాతం, ఉత్పత్తి, ఉత్తమ పద్ధతులు, యాంత్రీకరణ, వాల్యూయాడెడ్ ప్రొడక్షన్, కాస్ట్ ఎఫెక్టివ్ వంటి అంశాలను అధ్యయనం చేసి ఏపీలో ఇన్నోవేషన్ సెంటర్ స్థాపనకు నివేదిక ఇవ్వాలని సీఎం కోరారు. వరి పరిశోధన కేంద్రం డైరెక్టర్ జనరల్ మాథ్యూ మోరెల్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో శాటిలైట్ ఆధారిత ఇంటర్ నేషనల్ ఇన్నోవేషన్ సెంటర్ స్థాపనకు ముందుకొచ్చినట్లు చెప్పారు. ఇప్పటికే ఉత్తరప్రదేశ్‌లోని వారణాశిలో ఒక సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు నఫీస్, అరవింద్ కుమార్, ఆల్డాస్ జానయ్య, ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం కులపతి దామోదర్ నాయుడు, వ్యవసాయ శాఖ కమిషనర్ జవహర్ లాల్ పాల్గొన్నారు.

టెండర్ల ప్రక్రియ పూర్తి

- డిసెంబర్‌కు అమరావతిలో రోడ్ల నిర్మాణం
- రైతులకు మాట ఇచ్చినట్టుగా సదుపాయాలు
- పనులను పరిశీలించిన మంత్రి నారాయణ



అమరావతి, మార్చి 2 (మనం ప్రతినిధి): రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న రోడ్లను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పారు. శుక్రవారం రాజధానిలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 217 చ.కి.మీలో నిర్మిస్తున్న రోడ్ నెట్‌వర్క్‌తో పాటు స్టార్మ్ వాటర్, సివరేజ్ వాటర్, తాగునీరు, అండర్ గ్రౌండ్ కేబుల్ నెట్‌వర్క్ తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా రాజధానిలో నిర్మించే రోడ్లన్నింటికీ టెండర్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. రోడ్డన్నింటినీ అనుసంధానం చేయాలన్న సీఎం చంద్రబాబు సూచన మేరకు పనులు చేపట్టామని నారాయణ తెలిపారు. అమరావతి డెవలెంప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాజధానిలో 365 కి.మీ మేర వివిధ రకాల రోడ్లను నిర్మిస్తామని చెప్పారు. రోడ్లన్ని ఒకేసారి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో 270 కి.మీ రోడ్డును నిర్మిస్తామని, వచ్చే జనవరికి పూర్తవుతాయని, దీనికి సంబంధించి 15 రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. రాజధానిలోని 29 గ్రామాల్లో రైతులకు లేఅవుట్‌లలో ప్లాట్స్ వేస్తామని, ఇక్కడ రోడ్లు అభివృద్ధి చేసామని తెలిపారు. రాజధాని ప్రాంతంలో పలు ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న రోడ్లను మంత్రి పరిశీలించారు. అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ విమానాశ్రయం రికార్డు

- విదేశాలకు వెళ్లే ప్రయాణికుల పెరుగుదల
- ఏటా గణనీయంగా పెరుగుతున్న సంఖ్య
- క్రమంగా పెరుగుతున్న విమాన సర్వీసులు
- మరిన్ని నడిపేందుకు పలు కంపెనీలు ఆసక్తి
- త్వరలో ఇక్కడి నుంచి బ్యాంకాక్‌కు విమానం




విశాఖపట్నం, మార్చి 2 (మనం న్యూస్ బ్యూరో): విదేశాలకు ప్రయాణికులను చేరవేయడంలో విశాఖ విమానాశ్రయం రికార్డులు సృష్టిస్తోంది. ఈ ఏడాది జనవరి మాసంలోనే 40.4 శాతం ప్రయాణికుల పెరుగుదలతో కొత్త రికార్డు సృష్టించింది. 2017 జనవరిలో విశాఖ విమానాశ్రయం నుంచి విదేశాలకు 10,221 మంది ప్రయాణించగా, ఈ ఏడాది జనవరిలో ఆ సంఖ్య గణనీయంగా 14,351కి పెరిగింది. పరిమితంగా సింగపూర్, శ్రీలంక, మలేసియా, దుబాయ్ వంటి దగ్గరి దేశాలకు మాత్రమే విమాన సర్వీసులన్నా ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. నిరుడు ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకూ 1,10,895 మంది విశాఖ నుంచి విదేశాలకు వెళ్లారు. 2016 ఏప్రిల్ నుంచి 2017 జనవరి వరకూ ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్లిన వారి సంఖ్య 81,650 మాత్రమే. ఇక్కడ కూడా 31.8 శాతం ప్రగతి కనిపించింది. విశాఖ నుంచి విదేశాలకు వెళ్లే వారి సంఖ్య బాగా పెరుగుతుండడంతో మరిన్ని సర్వీసులను ఇక్కడి నుంచి నడిపేందుకు పలు కంపెనీలు ముందుకు వస్తున్నాయి. త్వరలో బ్యాంకాక్‌కు ఇక్కడి నుంచి సర్వీసును ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దూర దేశాలకు వెళ్లేవారు కూడా గతంలో మాదిరిగా హైదరాబాద్, ముంబై వంటి ప్రాంతాల కు వెళ్లకుండా విశాఖ నుంచి సింగపూర్, మలేసియాల మీదుగా గమ్యాలకు చేరుకొంటున్నారు. విదేశాలకు విమాన సర్వీసులు పెరిగితే ప్రయాణికుల సంఖ్య కూడా పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. నిరుడు జనవరిలో 122 సర్వీసులు ఇక్కడి నుంచి నడపగా, ఈ ఏడాది ఆ విమానాల సంఖ్య 158కి పెరిగింది. 2016-17 సంవత్సరాల్లో విశాఖ విమానాశ్రయం నుంచి 1191 విదేశీ సర్వీసులు నడవగా, ఇప్పుడా సంఖ్య 1421కి చేరింది.

పెద్దగా పెరగని దేశీయ ప్రయాణికులు

విదేశీ ప్రయాణికుల సంఖ్య విషయంలో రికార్డులు సృష్టించిన విశాఖ విమానాశ్రయం దేశీయంగా మాత్రం కేవలం 1.2 శాతం ప్రగతినే నమోదు చేసింది. నిరుడు జనవరిలో విశాఖ నుంచి 2,10,085 మంది దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణించగా, ఈ ఏడాది ఆ సంఖ్య 2,12,554కు చేరింది. ఇటీవలే విశాఖ విమానాశ్రయం నుంచి కార్గో సేవలు ప్రారంభం కావడం, కొత్త సర్వీసులు వస్తుండటంతో ఈ ఏడాది మరింత ప్రగతి ఉంటుందని అధికారులు విశ్వసిస్తున్నారు.

5న ఢిల్లీకి రండి

- విభజన హామీలపై చర్చిద్దాం
- చంద్రబాబుకు అమిత్ షా ఫోన్



అమరావతి, మార్చి 2 (మనం ప్రతినిధి): మలి విడత పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యే మార్చి 5న టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబును ఢిల్లీకి రావాలని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఆహ్వానించారు. శుక్రవారం రాత్రి అమిత్ షా... చంద్రబాబుకు ఫోన్ చేసి ఆహ్వానించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. 'ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రానికి రావాల్సిన వాటిపై గురువారం సుదీర్ఘంగా చర్చించాం. మీరు ఢిల్లీ వస్తే అన్ని విషయాలు చర్చిద్దాం. విభజన హామీలతో పాటు ఏపీకి రావాల్సిన అన్ని అంశాలను సానుకూలంగా చర్చించి పరిష్కరించుకుందాం. ఈలోగా మీరు తొందరపడి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు' అని అమిత్‌షా చంద్రబాబుకు వివరించినట్లు తెలుస్తోంది.

ఏపీకి ఎంతో సాయం


- కేంద్రం ఏ రాష్ట్రానికీ ఇంతగా చేయలేదు
- త్వరలో విశాఖ రైల్వే జోన్‌పై నిర్ణయం
- బీజేపీ కార్యకర్తల సమావేశంలో హరిబాబు



విజయవాడ, మార్చి 2: కేంద్ర ప్రభుత్వం మూడున్నరేళ్ల కాలంలో దేశంలో ఏ రాష్ట్రానికి చేయనంత సాయం ఆంధ్రప్రదేశ్‌కు చేసిందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఎంపీ హరిబాబు అన్నారు. విజయవాడలో నిర్వహించిన కృష్ణా జిల్లా-విజయవాడ నగర బీజేపీ కార్యకర్తల సమావేశంలో హరిబాబు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతోనే ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతోందని పేర్కొన్నారు. విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలను, రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను, ఇవ్వని వాగ్దానాలను సైతం నెరవేరుస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేయాల్సినవి విస్మరించి, ఇప్పుడు మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై ఇస్తామని ప్రకటన చేయడం ప్రజలను మోసగించడమేనని విమర్శించారు. జాతీయ ప్రాజెక్టుగా పోలవరం నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని, ఇప్పటికే ముంపు మండలాలను తెలంగాణ నుంచి విడదీసి ఆంధ్రప్రదేశ్‌లో కలిపి పనుల వేగవంతానికి సహకరిస్తున్నామని చెప్పారు. పోలవరంపై మాట్లాడే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. రాష్ట్రానికి చెందిన ఐదు అంశాలు మాత్రమే కేంద్రం వద్ద పరిష్కారం కోసం ఉన్నాయని తెలపారు. విశాఖ రైల్వే జోన్ అంశంపై త్వరలోనే రాజకీయపరమైన నిర్ణయం వస్తుందని చెప్పారు. రెవెన్యూ లోటు భర్తీకి కేంద్రం కట్టుబడి ఉందని, ప్రత్యేక హోదా వల్ల వచ్చే ప్రయోజనాల కన్నా ప్యాకేజీ ద్వారా ఎక్కువ నిధులు అందించే విషయంలో ఏ మాత్రం వెనకడుగు వేసేదిలేదని చెప్పారు. మిత్రధర్మం కొనసాగాలని కోరుకుంటున్నామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వాస్తవాలు తెలుసుకుని బీజేపీపై విపక్షాలు చేస్తున్న విమర్శలకు దీటుగా జవాబు ఇవ్వాలని హరిబాబు కోరారు.

వెంకయ్య చొరవ తీసుకుంటేనే..

- రాష్ట్రానికి నిధులు: ఎంపీ దివాకర్ రెడ్డి
- పొత్తుపై నిర్ణయం తీసుకోవాలి: రమేశ్
- కేంద్రంపై రాజీలేని పోరు: నరసింహం
- దశలవారీగా పోరాటం: గల్లా జయదేవ్



టీడీపీ పార్లమెంటరీ సమావేశంలో ఎంపీలు మురళీ మోహన్, బుట్టా రేణుక, జయదేవ్,నాని, బాబు

అమరావతి, మార్చి 2 (మనం ప్రతినిధి): ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చొరవ తీసుకుంటేనే రాష్ట్రానికి నిధులు వస్తాయని, లేకపోతే కేంద్రం ఉదారంగా ఏపీని ఆదుకుంటుందని తాను అనుకోవడం లేదని ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ పార్లమెంటరీ సమావేశం అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఉచ్చులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇరుక్కున్నారని ఆయన అన్నారు. ప్రత్యేక హోదాకు ఇచ్చే అన్ని అంశాలను ఇస్తామని నమ్మబలకడంతో దాన్ని చంద్రబాబు నమ్మారని జేసీ చెప్పారు. ఉప ఎన్నికలు రావనే ఉద్దేశంతో జగన్మోహన్‌రెడ్డి ఏప్రిల్ 6న రాజీనామాలు చేస్తానని ప్రకటిస్తున్నారని మండిపడ్డారు. కావాలంటే అదే రోజున తాను రాజీనామా చేస్తానని జేసీ తెగేసి చెప్పారు. కాగా, రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై పోరాటం చేయక తప్పదని ఎంపీ సీఎం రమేశ్ పేర్కొన్నారు. కేంద్రంతో పొత్తుపై కీలక నిర్ణయం తీసుకునే సమయం ఆసన్నమైందని ఆయన చెప్పారు. రాష్ట్రానికి కాంగ్రెస్ చేసిన పాపాన్ని కడుక్కుందామని ఆ పార్టీ నేత కేవీపీ రాజ్యసభలో పోరాటం చేస్తే, వాళ్ల పార్టీ నేతలే పట్టించుకోని పరిస్థితి ఉందన్నారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రం గురించి ఏ విధంగా మాట్లాడుతుందని అనుకోవాలని ప్రశ్నించారు.

హోదాతో పాటు అన్ని ఇవ్వాలి: తోట

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు మిగిలిన 18 అంశాలు కూడా ఇవ్వాలని ఎంపీ తోట నరసింహం డిమాండ్ చేశారు. విభజన చట్టంలోని అన్ని అంశాలు రాష్ట్రానికి వచ్చేంతవరకూ కేంద్రంపై రాజీలేని పోరాటం చేస్తామని ఆయన వెల్లడించారు. ప్రత్యేక హోదా వద్దని టీడీపీ ఎప్పుడూ చెప్పలేదని ఆయన వివరించారు. పార్లమెంట్‌లో టీడీపీ ఎంపీలు ఏ విధంగా నిరసన చేయాలని అనే అంశంపై యాక్షన్ ప్లాన్ ఏర్పాటు చేసుకున్నామని దానికి అనుగుణంగా దశల వారీగా కేంద్రంపై పోరాటం చేస్తామని చెప్పారు.

ఫైనాన్స్ బిల్లును వ్యతిరేకించాలి: గల్లా

పార్లమెంట్‌లో ఇప్పటికే కేంద్రం ఫైనాన్స్ బిల్లును టేబుల్ చేసిందని.. ఆ బిల్లుపై చర్చించేటప్పుడు వ్యతిరేకించాలని చేయాలని నిర్ణయించుకున్నామని ఎంపీ గల్లా జయదేవ్ వెల్లడించారు. దశల వారీగా కేంద్రంపై పోరాటం చేస్తామని చెప్పారు. అవసరమైతే ప్రత్యేక హోదా, చట్టంలోని అంశాలపై కోర్టుకు కూడా వెళ్లాల్సిన పరిస్థితి ఉందని జయదేవ్ స్పష్టం చేశారు.

అన్ని పార్టీలకు లేఖలు: రామ్మోహన్

రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై దేశంలోని అన్ని పార్టీల నేతలకు, ఎంపీలకు లేఖలు రాయాలని సమావేశంలో నిర్ణయించామని ఎంపీ రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. రాష్ట్ర విభజన జరిగినప్పుడు అన్ని పార్టీల మద్దతుతో రాష్ట్రం విడిపోయిందని, అదే విధంగా అన్ని పార్టీల మద్దతుతోనే రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని వివరించి న్యాయం చేసుకోవాలని ఆయన వివరించారు.

ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై టారిఫ్‌లు విధించాలన్న ట్రంప్ నిర్ణయం వాణిజ్య వర్గాల్లో కలకలం సృష్టించింది

దిగుమతులపై 'పెద్ద'న్న సుంకాలు





వాషింగ్టన్: దిగుమతి అవుతున్న ఉక్కు, అల్యూమినియంపై భారీగా టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారంనాడు ప్రకటించారు. అమెరికా ఉత్పత్తి సంస్థలను కాపాడేందుకు తీసుకుంటున్నట్లు చెబుతున్న ఈ చర్య చైనా, యూరప్, పొరుగునున్న కెనడా వంటి ప్రధాన వర్తక భాగస్వాములను ప్రతి చర్యలకు పురికొల్పవచ్చని భావిస్తున్నారు. ఈ వర్తక సమర భయాలు వాల్‌స్ట్రీట్‌లో అమ్మకాలకు కారణమయ్యాయి. ఉక్కు దిగుమతులపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం సుంకాలను వచ్చే వారం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని ట్రంప్ చెప్పారు. కానీ, వైట్ హౌస్ అధికారులు ఆ తర్వాత, దీనికి సంబంధించి ఇంకా కొన్ని వివరాలను సిద్ధం చేసుకోవాల్సి ఉందని ప్రకటించారు. ఈ టారిఫ్‌లు అమెరికాలో ఉద్యోగాలను సంరక్షిస్తాయని ట్రంప్ భావిస్తున్నారు. కానీ, మోటారు వాహనాలు, చమురు పరిశ్రమలు వంటి ఉక్కు, అల్యూమినియం వినియోగ సంస్థలకు ఉత్పత్తి వ్యయాలు పెరిగితే, దిగుమతులపై ఆంక్షల వల్ల ఒనగూడే ఉద్యోగాలకన్నా నష్టపోయే ఉద్యోగాలే ఎక్కువగా ఉంటాయని చాలా మంది ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ''మేం మా ఉక్కు పరిశ్రమను, అల్యూమినియం పరిశ్రమను తిరిగి నిర్మించుకోదలచుకున్నాం'' అని ట్రంప్ అన్నారు.

ట్రంప్ ప్రకటన తర్వాత, అమెరికాలో ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తి సంస్థల షేర్ల ధరలు పెరగ్గా, ఆ లోహాలకు చెల్లించవలసి వచ్చే అధిక ఖరీదుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని మోటారు వాహనాల నుంచి విమానాల తయారీ సంస్థల వరకు వివిధ కంపెనీల షేర్ల ధరలు పతనమయ్యాయి. విస్తృతంగా చర్చలు జరిగిన మీదటే ట్రంప్ ప్రకటన వెలువడింది. ఆ చర్చలతో ప్రత్యక్ష పరిజ్ఞానం ఉన్న వ్యక్తి ఒకరు రాత్రంతా ''గందరగోళం''గా గడిచిందని అభివర్ణించారు. పాలనకు సంబంధించి తరచు వైఖరులను మార్చడంపై శ్వేత సౌధంలో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని ఆయన చెప్పారు.

టారిఫ్‌లను కొందరు సీనియర్ రిపబ్లికన్ చట్ట సభల ప్రతినిధులు, మోటారు వాహనాల నుంచి ఆయిల్, భవన నిర్మాణ పరికరాల పరిశ్రమలవారి వరకు చాలా మంది తీవ్రంగా విమర్శించారు. ఉక్కు ఎగుమతి చేస్తున్న దేశాలు ప్రతి చర్యలకు దిగితే అమెరికా వ్యవసాయ ఎగుమతులు తీవ్రంగా దెబ్బతింటాయని ముఖ్యంగా ఆందోళన వ్యక్తమవుతోంది. ''మనం ఈ పని చేసిన ప్రతిసారీ, ప్రతీకార చర్యలుంటున్నాయి. వ్యవసాయం మొదటి లక్ష్యంగా మారుతోంది. వ్యవసాయ ఆర్థిక వ్యవస్థపై ఇది దారుణమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని భావిస్తున్నాను'' అని చాంబర్స్ వ్యవసాయ కమిటీకి అధ్యక్షత వహిస్తున్న సెనెటర్ ప్యాట్ రాబర్ట్స్ అన్నారు.

ప్రతి చర్యలకు సిద్ధంగా ఉన్న కెనడా

అమెరికా సోయాబీన్ల దిగుమతులపై ఆంక్షలు విధిస్తామని చైనా ఇప్పటికే హెచ్చరించింది. తీసుకోవాల్సిన ఎదురు చర్యలను పరిశీలిస్తామని యూరోపియన్ ప్రకటించింది. అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు చెందిన అగ్ర ఆర్థిక సలహాదారు లి గురువారంనాడు వాషింగ్టన్‌లో ట్రంప్ పాలనా యంత్రాంగంతో చర్చలు జరిపారు. చర్చలు ''నిర్మొహమాటంగా, నిర్మాణాత్మకంగా'' సాగాయని వైట్ హౌస్ అధికారి ఒకరు అభివర్ణించారు. ''నిష్పక్షపాతంగా, ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వర్తకం సాగించే'' మార్గాలపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు ఆ ప్రతినిధి తెలిపారు.

ట్రంప్ 2017లో అధ్యక్ష పదవిని చేపట్టినప్పటి నుంచి అమెరికా-చైనాల మధ్య వర్తక సంబంధిత ఉద్రిక్తతలు పెరుగుతూ వస్తున్నాయి. నిజానికి, టారిఫ్‌ల వల్ల చైనా నేరుగా నష్టపోయేది ఏమంత లేదు. అమెరికా ఉక్కు డిమాండ్‌లో 16 శాతాన్ని కెనడా తీరుస్తూండగా, చైనా నుంచి 2 శాతం మాత్రమే సరఫరాలున్నాయి. ఉక్కు ఎగుమతిలో అగ్ర స్థానం కెనడాదే. బ్రెజిల్, దక్షిణ కొరియాలు ఆ తర్వాత స్థానాలలో ఉన్నాయి.

ఇతర దేశాలు కూడా ఏ విధంగా స్పందించాలనే ఆలోచనలో పడ్డాయి. ''కెనడా ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై ఆంక్షలు విధిస్తే, తన వాణిజ్య ప్రయోజనాలను, కార్మికులను కాపాడుకునేందుకు కెనడా కూడా దానికి తగ్గ చర్యలే తీసుకుంటుంది'' అని కెనడా విదేశీ వ్యవహారాల మంత్రి క్రిస్టియా ఫ్రీల్యాండ్ తీవ్ర పదజాలంతో కూడిన ప్రకటనలో పేర్కొన్నారు.

టారిఫ్‌లపై సొంతంగా లేదా ఇతర దేశాలతో కలసి చర్య తీసుకునే అంశాన్ని బ్రెజిల్ పరిశీలిస్తుందని బ్రెజిల్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. బ్రెజిల్‌లోని రెండు పెద్ద ఉక్కు సంస్థలైన సియా సైడ్‌రర్జికా నేసనల్, ఉసిమినాస్‌ల షేర్ల ధరలు వరుసగా 4.4 శాతం, 4.2 శాతం తగ్గాయి. ఆ రెండు కంపెనీల షేర్లలో అమ్మకాలు ముమ్మరంగా కనిపించాయి.

ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద ప్రతిపాదిత సవరణపై వాషింగ్టన్‌కు కెనడా, మెక్సికోలతో ఇప్పటికే వివాదం నడుస్తోంది. ఉద్రిక్తతలతో కూడిన చర్చలు నెలల తరబడి సాగుతున్నా ఏ విధమైన అర్థవంతమైన పురోగతినీ సాధించలేకపోయాయి. ఏవైనా దేశాలకు మినహాయింపులు ఇస్తారా అని అడిగినప్పుడు, వచ్చే వారంలో వెలువడనున్న ప్రకటనకు ముందు తాను ఏ విధమైన వివరాలూ వెల్లడించదలచుకోలేదని వైట్‌హౌస్ ప్రతినిధి శారా శాండర్స్ చెప్పారు. టారిఫ్‌లు ఇంకా తుది రూపు దిద్దుకుంటున్న దశలోనే ఉన్నాయని ఆమె చెప్పారు.

అమెరికా ఉక్కు దిగుమతులలో చైనా వాటా చాలా స్వల్పమే అయినప్పటికీ, దాని అపారమైన పారిశ్రామిక విస్తరణ ప్రపంచ స్థాయిలో ఉక్కు ఉత్పత్తిలో మిగులు ఏర్పడేందుకు తోడ్పడి, ధరలను తగ్గించింది.

టారిఫ్‌లు చూపగల విభిన్న ప్రభావాన్ని వాల్‌స్ట్రీట్ ట్రేడింగ్ ప్రతిబింబించింది. ఉక్కు ఉత్పత్తి సంస్థల్లో ఏకే స్టీల్ హోల్డింగ్ 9.5 శాతం, యు.ఎస్. స్టీల్ కార్ప్ 5.7 శాతం, నుకార్ 3.3 శాతం పెరిగాయి. ఉక్కును ఎక్కువగా వినియోగించే కంపెనీల షేర్ల ధరలు పతనమయ్యాయి. ఫోర్డ్ మోటార్ కంపెనీ 3 శాతం, జనరల్ మోటార్స్ కంపెనీ 4 శాతం తగ్గాయి. కానీ, మొత్తం మీద స్టాక్ మార్కెట్‌లో అవరోహణ సరళి కనిపించింది. డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 1.7 శాతం, ఎస్ అండ్ పి 500 ఇండెక్స్ 1.3 శాతం క్షీణించాయి.

ముడిపడిన జాతీయ భద్రత

ఈ చర్యకు జాతీయ భద్రతా ప్రయోజనాలు కూడా పురికొల్పాయని భావిస్తున్నారు. ట్యాంకులు, యుద్ధ నౌకలకు దేశీ సరఫరాలే మంచిదని అమెరికా భావిస్తోంది. కొన్నింటికి సంబంధించి మాత్రమే ఉక్కుపై టారిఫ్‌లు విధించాలని, అల్యూమినియంపై సుంకాలు విధించడంలో జాప్యం చేయాలని రక్షణ శాఖ సిఫార్సు చేసినట్లు తెలిసింది.

ఉద్యోగాలు పెరగవు ఉన్నవి పోతాయి...

సుంకాల వల్ల అమెరికన్ పరిశ్రమను సంరక్షించినట్లు అవుతుందని పాలనా యంత్రాంగం చెబుతున్నప్పటికీ, దానివల్ల పరిశ్రమలకు ఉత్పాదక వ్యయాలు పెరుగుతాయని విమర్శకులు అంటున్నారు. దేశంలో ఉద్యోగాల సంఖ్యను పెంపొందిస్తామని అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో ట్రంప్ విఫలమవుతారని వారు చెబుతున్నారు. టారిఫ్‌లను వైట్ హౌస్ వర్తక సలహాదారు పీటర్ నవరోతో సహా ట్రంప్ యంత్రాంగంలోని ట్రేడ్ హాక్‌లకు విజయంగా చెప్పవచ్చని భావిస్తున్నారు. పీటర్ ప్రాధాన్యం పెరుగుతూ వస్తోంది. టాప్ ఆర్థిక సలహాదారు గ్యారీ కొహెన్ వంటివారు పర్యవసానాల గురించి భయపడుతున్నారు. వారికి ఈ చర్య ఎదురుదెబ్బేనని అంటున్నారు. ఈ అంశంపై ముందుకు సాగాలా లేక వెనక్కి తగ్గాలా అని బుధవారం రాత్రంతా తీవ్రంగా చర్చలు జరగడంతో ట్రంప్ గురువారంనాడు టారిఫ్‌ల గురించి ప్రకటన చేయరనే అందరూ అనుకున్నారు. ''గత 12, 16 గంటల్లో దీనిపై ఊగిసలాట చాలానే సాగింది'' అని చర్చల గురించి తెలిసిన వ్యక్తి ఒకరు తన పేరును వెల్లడించకూడదనే షరతుపై చెప్పారు. ''ప్రకటిస్తారని అనుకున్నాం. ప్రకటించరనీ అనుకున్నాం. కానీ, చివరకు ప్రకటి ంచడమే వాస్తవం అయింది'' అని ఆయన అన్నారు.

టారిఫ్‌లతో వచ్చే ఉద్యోగాలు నామమాత్రమే

అమెరికాలో ఉక్కు తయారీ సంస్థల్లో 1962–2005 సంవత్సరాల మధ్య కాలంలో మూడొంతుల ఉద్యోగాలు తగ్గాయని అమెరికన్ ఎకనామిక్ అసోసియేషన్ జరిపిన ఒక ప్రధాన అధ్యయనంలో తేలింది. ఉత్పత్తి టెక్నాలజీ మెరుగుపడడం దీనికి చాలా వరకు కారణమని వెల్లడైంది. ఒక కార్మికుని నుంచి ఉత్పత్తి ఐదు పెరిగిందని తేలింది. ''కనుక, వాణిజ్య సంరక్షణ వల్ల దేశంలో ఉత్పత్తి పెరిగినా, ఉద్యోగాలు అనేక మంది ఆశపడుతున్నంతగా కాక, చాలా తక్కువగానే వస్తాయి'' అని స్వతంత్ర ఎకనామిస్ట్ నెట్‌వర్క్ ఎకనాఫ్యాక్ట్ గత వారంలో పేర్కొంది. ''ఉక్కు రంగంలో కాపాడే ఉద్యోగాలకన్నా, ఉక్కు వినియోగ పరిశ్రమలపై పడే ప్రతికూల ప్రభావంతో దెబ్బతినే ఉద్యోగాల సంఖ్యే అనేక రాష్ట్రాల్లో ఎక్కువ'' అని ఎకనాఫ్యాక్ట్ హెచ్చరించింది. టారిఫ్‌ల వల్ల కోర్ ద్రవ్యోల్బణం 0.1 శాతం పెరిగి, ఆర్థిక వృద్ధిలో 0.1–0.2 శాతం కోత పడుతుందని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ బార్‌క్లేస్ అంచనా వేసింది.

సంతృప్తినివ్వని నిర్ణయం



అహ్మదాబాద్: దేశీయ వంటనూనె ఉత్పత్తి పరిశ్రమ, దేశంలోని నూనె గింజల రైతుల ప్రయోజనాలను సంరక్షించే ఉద్దేశంతో రిఫైన్డ్, క్రూడ్ పామాయిల్ దిగుమతి సుంకాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవలి సంవత్సరాల్లో ఎన్నడూ చూడనంత హెచ్చు స్థాయిలకు పెంచుతూ గురువారం నిర్ణయం తీసుకుంది. రెవిన్యూ శాఖ గురువారం రాత్రి పొద్దుపోయాక ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. ముడి పామాయిలు(సి.పి.ఓ)పై దిగుమతి సుంకాన్ని 30 శాతం నుంచి 44 శాతానికి, శుద్ధి చేసిన బ్లీచ్డ్, డీఓడోరైజ్డ్ (ఆర్.బి.డి) పామాయిలుపై దిగుమతి సుంకాన్ని 40 శాతం నుంచి 54 శాతానికి 2018 మార్చి 1 నుంచి అమలయ్యే విధంగా పెంచారు. సాఫ్ట్ నూనెలపై సుంకంలో ఎలాంటి మార్పూ చేయలేదు. వంట నూనెలపై దిగుమతి సుంకం విధించడం ద్వారా దేశీయ నూనె గింజల రైతులు, క్రషింగ్ పరిశ్రమను కాపాడాలని డిమాండ్ చేస్తూ వచ్చిన ఈ వర్తక రంగ ఉన్నత సంస్థ సాల్వెంట్ ఎక్స్ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్.ఇ.ఏ) ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూనే, కొంత అసంతృప్తిని వ్యక్తపరచింది. ''దేశంలో వినియోగమవుతున్న వంట నూనెల్లో దిగుమతి అవుతున్న వంట నూనెల వాటా ప్రమాదకరమైన స్థాయిలో దాదాపు 70 శాతానికి చేరుకోవడంతో, అలా ఆధారపడడాన్ని తగ్గించాలని, దిగుమతి చేసుకుంటున్న నూనెలపై సుంకాలను పెంచాలని మేం ప్రభుత్వానికి విన్నవిస్తూ వచ్చాం. సుంకాల్లో తీసుకొచ్చిన ఈ పెరుగుదలను మేం స్వాగతిస్తున్నాం. కానీ, కేవలం, పామాయిలును మాత్రం వేరు చేసి, దానిపై సుంకాలు పెంచడం మమ్మల్ని ఆశ్చర్యపరచింది. ఇది పూర్తి అనుచితంగా కనిపిస్తోంది. దేశంలో వంట నూనెల విలువలు పెంచడం ద్వారా రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి విఘాతం కలిగించేదిగా ఉంది'' అని ఎస్.ఇ.ఎ అధ్యక్షుడు అతుల్ చతుర్వేది పేర్కొన్నారు.

ప్రభుత్వ చర్య నూనె గింజల రైతులను, ముఖ్యంగా ఆవాల పంట చేతికొస్తున్న సమయంలో నిరాశకు గురిచేస్తుందని ఆయన అన్నారు. ''పామాయిలు రకాలపై పెంచిన రీతిలో సోయా, పొద్దుతిరుగుడు, కెనోలా నూనెలపై దిగుమతి సుంకాలను పెంచకపోవడం రైతులను వంచించడమే అవుతుంది. ఈ నూనెలపై సుంకాలు పెంచకపోతే, నూనె గింజలను ఎక్కువగా పండించి, ఆదాయాన్ని పెంచుకోవలసిందని నూనె గింజల రైతులను ప్రోత్సహించడం కష్టం అవుతుందని వేరే చెప్పనవసరం లేదు'' అని ఆయన అన్నారు. రేపు మొక్క విత్తనాల నుండి పిండిన నూనెకి కెనడాలో వాడే వ్యాపార న్యామం కెనోలా. ఈ ఇంగ్లీషు పదంలో సిఏఎన్ అక్షరాలు కెనడాకి, ఓ అక్షరం ఆయిలుకి, ఎల్ఏ అక్షరాలు 'లో యాసిడ్'కి సంకేతాలు. క్రూడ్ పామాయిలుకి, పామోలిన్‌కి మధ్య (సుంకాల్లో ఉన్న) తేడాను ఇప్పుడున్న 10 శాతం నుంచి కనీసం 15 శాతం చేయాలని చిరకాలంగా చేస్తున్న డిమాండ్‌ను ఆమోదించకపోవడం కూడా పరిశ్రమకు అసంతృప్తి కలిగించిందని ఎస్.ఇ.ఎ తెలిపింది. భారతదేశంలో మొత్తంమీద వంట నూనెల దిగుమతులు 2017 నవంబరు నుంచి 2018 జనవరి మధ్య కాలంలో 3,628,734 టన్నులుగా ఉన్నాయి. ఇవి అంతకుముందు ఏడాది అదే కాలంలో దిగుమతి అయిన 3,414,008 టన్నులతో పోలిస్తే 6 శాతం ఎక్కువ కింద లెక్క.

బలపడుతున్న ఉక్కు డిమాండ్

కోల్‌కతా: దేశంలో ఉక్కు డిమాండ్ 2017-18 సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో 5.2 శాతం వృద్ధి చెందడం ఉక్కు పరిశ్రమకు సానుకూలాంశమని రేటింగ్ ఏజన్సీ 'ఇక్రా' పేర్కొంది. మౌలిక వసతుల కల్పనకు ముఖ్యంగా సరసమైన ధరలకు గృహ వసతి కల్పించడం, విద్యుచ్ఛక్తి ప్రసార విభాగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో ఉక్కు వినియోగం మరింత వృద్ధి చెందవచ్చని 'ఇక్రా' భావిస్తోంది. ''దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పెరుగుతున్న డిమాండ్ దిగుమతులలో తక్కువ వృద్ధి వంటి సానుకూల అంశాల సమ్మేళనం రానున్న కాలంలో ఈ రంగానికి సహాయపడుతుంది'' అని 'ఇక్రా' తెలిపింది.

'ఇక్రా' 22 పెద్ద, మధ్య తరహా ఉక్కు కంపెనీల్లో నిర్వహించిన నమూనా అధ్యయనంలో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో నిర్వహణా పరమైన మార్జిన్లు మెరుగుపడినట్లు వెల్లడైంది. అవి వడ్డీ వ్యయాలను సులభంగా చెల్లించగలుగుతున్నాయని తేలింది. ఉక్కు పరిశ్రమకు ఇప్పుడున్న ఉత్పాదక సామర్థ్యంలో సుమారు 60 శాతం ఈ కంపెనీల నుంచే లభిస్తోంది. ఐదు ఉక్కు కంపెనీలు ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్ట్సీ ప్రక్రియలో ఉన్నాయి. సంస్థాపక ఉత్పాదక సామర్థ్యంలో వాటి వాటా 17 శాతంగా ఉంది. ఆ ఐదు కంపెనీల స్వాధీనానికి దేశీయ, అంతర్జాతీయ కంపెనీలు పోటీ పడుతున్నాయని కూడా 'ఇక్రా' తెలిపింది.


హార్డ్‌వేర్ పరిశ్రమకు ఊతం

కొచ్చి: భారతదేశపు అతి పెద్ద హార్డ్‌వేర్ ఎలక్ట్రానిక్ ఇన్‌క్యుబేటర్ 'మేకర్ విలేజ్' మార్చి 10న ఇక్కడ ఒక రోజు జాతీయ సమావేశాన్ని నిర్వహిస్తోంది. హార్డ్‌వేర్ స్టార్టప్‌లను ప్రోత్సహించే ఉద్దేశంతో దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 1200 మంది ఈ సమావేశంలో పాల్గొననున్నారు. వారిలో హార్డ్‌వేర్ స్టార్టప్‌ల వారితోపాటు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, పరిశ్రమలు, టెక్నాలజీ సంస్థలు, ఫండింగ్ ఏజన్సీల ప్రతినిధులు కూడా ఉంటారు. యాక్సిలరేటర్లు, హార్డ్‌వేర్ ఇన్‌క్యుబేటర్లు, బ్రాండింగ్ గురువులతో, విద్యా సంస్థల ప్రతినిధులతో కేరళలో ఈ రకమైన సమావేశాన్ని నిర్వహించడం ఇదే మొదటిసారని మేకర్ విలేజ్ సి.ఇ.ఓ ప్రసాద్ బాలకృష్ణన్ నాయర్ చెప్పారు. బలమైన హార్డ్‌వేర్ ఎలక్ట్రానిక్ వస్తూత్పత్తి పరిశ్రమను నిర్మించేందుకు కేరళ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్న సమయంలో ఈ సమావేశ నిర్వహణ ప్రాముఖ్యం సంతరించుకుంటోందని ఆయన చెప్పారు. ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్-వస్తూత్పత్తి పరిశ్రమ అభివృద్ధికి ఇది నాంది పలుకుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమలు, టెక్నాలజీ సంస్థలు ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాయి. కొచ్చిలోని గోకులం కన్వెన్షన్ సెంటరులో దీన్ని నిర్వహించబోతున్నారు.

తక్షణ ప్రభావం లేదు



న్యూఢిల్లీ: ఉక్కు దిగుమతులపై ఆంక్షలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం వల్ల తక్షణ ప్రభావం ఏదీ ఉండకపోవచ్చని భారతదేశం భావిస్తోంది. ఉక్కు మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారి ఒకరు శుక్రవారం ఈ సంగతి చెప్పారు. అమెరికా ఉత్పత్తి సంస్థలను కాపాడేందుకు దిగుమతి చేసుకుంటున్న ఉక్కు, అల్యూమినియంపై భారీగా టారిఫ్‌లు విధించబోతున్నట్లు ట్రంప్ గురువారం ప్రకటించారు. ప్రధాన వర్తక భాగస్వాములైన చైనా, యూరప్, పొరుగునున్న కెనడాలతో సహా వివిధ దేశాల నుంచి దానిపై ప్రతీకార చర్యలకు అవకాశం ఉన్నప్పటికీ ట్రంప్ తెగువను ప్రదర్శించారు. అమెరికా వర్తక క్లాజును అమలులోకి తేవడం గురించి ప్రస్తావిస్తూ ''మన ఎగుమతులలో అమెరికా వాటా 2 శాతం మాత్రమే. కనుక తక్షణం తగ్గిపోయేదేమీ లేదు. కానీ, టారిఫ్ ప్రతిబంధకంగా ఉపయోగించుకునేందుకు సెక్షన్ 232 చెల్లుబాటును సాగదీసినట్లు కనిపిస్తోంది'' అని ఉక్కు శాఖ కార్యదర్శి అరుణ శర్మ అన్నారు. నిర్దిష్ట ఎగుమతులు లేదా హెచ్చు స్థాయిలలో కొన్ని రకాల దిగుమతులు జాతీయ భద్రతకు ముప్పు కలిగిస్తున్నాయా అనే అంశంపై దర్యాప్తు జరిపేందుకు 1962 నాటి వర్తక విస్తరణ చట్టంలోని సెక్షన్ 232 (బి) అమెరికాకు అధికారమిస్తోంది.



ఎస్సార్ స్టీల్‌పై ఆర్సిలార్ ఆసక్తి

న్యూఢిల్లీ: దివాలా ప్రొసీడింగులలో ఉన్న ఎస్సార్ స్టీల్ ఇండియా లిమిటెడ్‌ను కొనుగోలు చేసేందుకు తన భారతీయ విభాగం జపాన్‌కు చెందిన ఉక్కు ఉత్పత్తి సంస్థ నిప్పన్ స్టీల్ అండ్ సుమిటోమో మెటల్ కార్పొరేషన్‌తో కలసి సంయుక్త రంగంలో ఒక సంస్థను ఏర్పాటు చేస్తుందని ప్రపంచంలోనే అతి పెద్ద ఉక్కు తయారీ సంస్థ ఆర్సిలార్ మిత్తల్ ఎస్ఏ శుక్రవారంనాడు వెల్లడించింది. నిప్పన్ స్టీల్‌తో కలసి ఎస్సార్ స్టీల్ స్వాధీనానికి ఆసక్తి చూపుతున్నట్లు దివాలా, కంపెనీ వివాదాలతో వ్యవహరించే భారతదేశపు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌కి ఫిబ్రవరి 12న ఆర్సిలార్ మిత్తల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఒక ప్రణాళిక సమర్పించింది. ఎస్సార్ స్టీల్ కొనుగోలుకు ఆర్సిలార్ మిత్తల్, రష్యాకు చెందిన వి.టి.బి నేతృత్వంలోని గ్రూప్ ఒకటి ఫిబ్రవరిలో వేర్వేరుగా బిడ్లు సమర్పించాయి. బ్యాంకులు, ఇతర రుణ దాతలు, సరఫరాదార్ల నుంచి ఎస్సార్ స్టీల్ దాదాపు దాదాపు 800 కోట్ల డాలర్ల మేరకు క్లైములను ఎదుర్కొంటోంది. ఎస్సార్ స్టీల్ పనితీరు, లాభదాయకతను మెరుగుపరచే ''సవివర పారిశ్రామిక ప్రణాళిక''ను ఆర్సిలార్ మిత్తల్ ఆ సమయంలో ఆఫరు చేసింది. భారతదేశపు అతిపెద్ద రుణ ఎగవేతదార్లుగా చెప్పదగిన డజను సంస్థలలో ఎస్సార్ స్టీల్ వస్తుంది. భారతదేశపు బ్యాంకులను 147 బిలియన్ల డాలర్ల మేరకు ఉన్న మొండి బాకీలు ఊపిరాడనివ్వకుండా చేస్తున్న సమయంలో కేంద్ర బ్యాంక్ గత ఏడాది ఎస్సార్ స్టీల్‌ను దివాలా కోర్టుకు నెట్టింది. మొండి బాకీల పరిష్కారానికి కేంద్రం ప్రత్యేకించి ఒక చట్టాన్ని తీసుకువచ్చింది.

నాణ్యత చూడకపోతే మార్కెట్ దెబ్బతింటుంది



కోల్‌కతా: మొత్తంమీద తేయాకు ఉత్పత్తిలో చిన్న తోటల పెంపకందార్ల వాటా పెరుగుతూ దాదాపు 50 శాతానికి చేరుతోందని 2017 సంవత్సర అంచనాలు వెల్లడిస్తున్నాయని ఇండియన్ టీ అసోసియేషన్ (ఐ.టి.ఎ) తెలిపింది. ఈ ధోరణి శుభ సూచకం కాదని, ఇది మార్కెట్‌ను ''చెడగొట్టడానికి'' కారణం కావచ్చని టీ బోర్డు అభిప్రాయపడింది. మొత్తం ఉత్పత్తి 2017లో జనవరి-డిసెంబరు కాలంలో1348.84 మిలియన్ కిలోలుగా ఉంది. దీనిలో 631.69 మిలియన్ కిలోలు చిన్న తేయాకు తోటల పెంపకందార్ల నుంచి వచ్చాయని అంచనా. డిమాండ్ పెరగకపోతే, ఈ ధోరణి మొత్తం పరిశ్రమను అస్థిరపరచి, మార్కెట్ విచ్ఛిన్నం కావడానికి కారణమవుతుందని టీ బోర్డు చైర్మన్ పి.కె. బెజ్‌బారువా అన్నారు. సువ్యవస్థిత కాంపొజిట్ తోటలతో పోలిస్తే, తేయాకును కొనుగోలు చేసే ఫ్యాక్టరీల (బి.ఎల్.ఎఫ్), చిన్న తేయాకు తోటల పెంపకందార్ల ఉత్పాదక వ్యయం తక్కువగా ఉందని ఆయన తెలిపారు. అంతేకాకుండా, తేయాకు కొనే ఫ్యాక్టరీలు గ్రీన్ లీఫ్‌కి చిన్న తోటల పెంపకందార్లకు చాలా స్వల్ప మొత్తాలు చెల్లిస్తున్నాయి. జీవనోపాధి స్థాయిల వద్ద మాత్రమే చిన్న తోటల పెంపకందార్లు నెట్టుకొచ్చేట్లు చేస్తున్నాయని బెజ్‌బారువా చెప్పారు. ఖర్చుకి వారి రాబడి బొటాబొటీగా సరిపోయేట్లుగా ఉంది. చిన్న తేయాకు తోటల పెంపకందార్ల వాటా నిష్పత్తి దక్షిణాదిలో అధికంగా ఉంది. పశ్చిమ బెంగాల్, అస్సాంలు ఆ తర్వాత స్థానాలలో నిలుస్తున్నాయి. నాణ్యమైన తేయాకులను తెంపడం కూడా కీలకమేనని, చిన్న తేయాకు తోటల పెంపకందార్లు, కొన్ని కాంపొజిట్ తోటలవారు, ప్రస్తుతం, ఆ విధానాన్ని అంతగా పాటిస్తున్న జాడలు లేవని కూడా ఆయన చెప్పారు. ఉత్పత్తిని పెంచుకునేందుకు చిన్న తోటల పెంపకందార్లు పెద్ద సైజు ఆకులను, మొగ్గలను కూడా తెంపుకొస్తున్నారని ఆయన అన్నారు. ఈ విధానంతో టీ నాణ్యత తగ్గుతోందని ఆయన అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నాణ్యమైన తేయాకులను తెంపే విధంగా, దేశంలో డిమాండ్ పెంచే మార్గాలను కనుగొనే విధంగా తేయాకు తోటల పెంపకందార్లను చైతన్యపరచేందుకు టీ బోర్డు ప్రయత్నిస్తోంది.



అవసరం కోసం లేదా లాభం వస్తుందని ఇల్లు అమ్మకానికి పెట్టవచ్చు. కొనుగోలు దారుడూ రెడీ అయిపోవచ్చు. ఇక రిజిస్ట్రేషనే మిగిలి ఉండ వచ్చు. కానీ, ఈ ప్రక్రియ ముందు చట్టపరమైన నిబంధనలు, బాధ్య తల గురించి తప్ప కుండా తెలుసు కోవాలి...?

ఇల్లు అమ్మాలంటే..

అన్నింటికంటే ముందు క్యాలండర్‌ను చూడాలి. ఎందుకంటారా...? తేదీలో తేడా వస్తే పన్ను భారీగా చెల్లించాల్సి ఉంటుంది మరి.! ఓ ఇల్లు కొని మూడేళ్లు పూర్తి కాకముందే విక్రయించారనుకోండి. దానిపై వచ్చిన లాభాన్ని స్వల్పకాలిక మూలధన లాభంగా పరిగణిస్తుంది ఆదాయపన్ను చట్టం. దీనిపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇల్లు విక్రయించగా వచ్చిన లాభాన్ని ఆ ఏడాది ఆదాయానికి కలిపి రిటర్నుల్లో చూపించాలి. శ్లాబు రేటు ప్రకారం పన్ను చెల్లించాలి. ఏడాదికి రూ.10 లక్షల ఆదాయం అంతకంటే ఎక్కువ ఉన్న వారు 30 శాతం పన్ను పరిధిలో ఉంటారు. అలాంటి వారు మూడేళ్లలోపు ఇల్లు విక్రయిస్తే వచ్చిన లాభంలో 30 శాతం సమర్పించుకోవాల్సి ఉంటుంది.

పన్ను భారం ఎలా..?

స్వల్పకాల, దీర్ఘకాల మూలధన లాభాల పన్ను కట్టకుండా ప్రయోజనం పొందే మార్గాలు కూడా ఉన్నాయి. ఇల్లును విక్రయించగా వచ్చిన మూలధన లాభంతో మూడేళ్ల లోపు తిరిగి మరో ఇల్లు కొంటే పన్ను చెల్లించక్కర్లేదు. ఇల్లు కట్టుకునేందుకు కావాల్సిన స్థలం, నిర్మాణానికి అయిన అన్ని ఖర్చులూ మొత్తం వ్యయంలో భాగంగానే పరిగణిస్తారు. ఇంటిని విక్రయించడానికి ముందే ఓ ఏడాది దాటకుండా మరో ఇల్లు కొనుగోలు చేసి ఉన్నా ఈ పన్ను భారాన్ని తప్పించుకోవచ్చు. అయితే ఇల్లును విక్రయించే వ్యక్తికి సంబంధించినదే ఆ ఇల్లు కూడా అయి ఉండాలి. నివాస భవనాన్ని విక్రయిస్తే... తిరిగి నివాస భవనం కొనడం ద్వారానే పన్ను మినహాయింపు పొందేందుకు అవకాశం ఉంటుంది. ఉదాహరణకు రూ.10 లక్షల లాభం వచ్చిందనుకుందాం. ఇందులో రూ.5 లక్షలతోనే మరో ఇల్లు కొన్నారనుకుందాం. అప్పుడు మిగిలిన రూ.5 లక్షలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను వసూలు చేస్తారు. అయితే, ఇందులో రూ.5 లక్షలు పెట్టి కొన్న ఇల్లును మూడేళ్లు కాకముందే అమ్మేస్తే... ఇక అప్పుడు అంతకు ముందు ఇంటి విక్రయంపై వచ్చిన లాభానికి ఇచ్చిన పన్ను మినహాయింపు (స్వల్ప కాలిక లాభాన్ని దీర్ఘకాలిక లాభంగా పరిగణించినది)ను ఎత్తేస్తారు.



దీంతో ఆ మొత్తం, తాజాగా అమ్మిన ఇల్లుపై వచ్చిన లాభంపైనా స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

దీర్ఘకాల బాండ్లు

ఇల్లు విక్రయించగా వచ్చిన దీర్ఘకాల మూలధన లాభాలను తిరిగి మరో ఇంటిపై పెట్టడం ఇష్టం లేని వారు పన్ను కట్టకుండా ఉండేందుకు మరో మార్గం కూడా ఉంది. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 54ఈసీ కింద ఆ లాభాలను జాతీయ రహదారుల అభివ ద్ధి సంస్థ, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ లేదా ప్రభుత్వం నోటిఫై చేసిన బాండ్లలో పెట్టుబడి పెట్టవచ్చు. ఇలా మూడేళ్లు ఇన్వెస్ట్ చేస్తే పన్ను ఉండదు. ఇల్లు అమ్మిన ఆరు నెలల్లోపు ఇన్వెస్ట్ చేస్తేనే ఈ మినహాయింపు లభిస్తుంది. అలాగే గరిష్టంగా రూ.50 లక్షల పెట్టుబడుల వరకే పన్ను మినహాయింపు ఉంటుంది. ఒకవేళ ఇల్లు విక్రయించగా వచ్చిన మొత్తం అంతకంటే ఎక్కువే ఉంటే మిగిలిన మొత్తాలపై పన్ను చెల్లించాల్సి ఉంటుందని తెలుసుకోవాలి.

పన్ను ఉంటుందా..!

అందుకే ఇల్లును కొనుగోలు చేసిన తర్వాత కనీసం మూడేళ్ల పాటు దాన్ని అట్టిపెట్టుకోవాలి. మూడేళ్ల తర్వాత అయితే పన్ను ఉండదా... అంటే ఉంటుంది. కాకపోతే మూడేళ్ల తర్వాత విక్రయంపై వచ్చే లాభాన్ని దీర్ఘకాలిక మూలధన లాభంగా పరిగణిస్తారు. దీనిపై 20 శాతం పన్ను రేటు పడుతుంది. పైగా మూడేళ్ల పాటు ఉన్న ద్రవ్యోల్బణ ప్రభావాన్ని కూడా సగటున లెక్కించి దాన్ని కొనుగోలు ధరకు కలుపుకునే వెసులుబాటు ఉంది. దాంతో లాభం శాతం తగ్గుతుంది. ఫలితంగా పన్ను భారం కూడా తగ్గుతుంది. నిజానికి లాంగ్ టర్మ్ కేపిటల్ గెయిన్స్ కింద చాలా రకాల మినహాయింపులను పొందవచ్చు. అదే షార్ట్ టర్మ్ కేపిటల్ గెయిన్స్ పై ఈ అవకాశం లేదు. దీర్ఘకాల మూలధన లాభం కింద అయితే ఇల్లు నవీకరణకు చేసిన ఖర్చును సైతం మినహాయింపు పొందవచ్చు. నిర్మాణానికి ముందు రుణంపై చెల్లించిన వడ్డీని సైతం మినహాయింపు కోరవచ్చు.



పన్ను మినహాయింపు

సెక్షన్ 54ఈసీ కింద పన్ను మినహాయింపు అన్నది అసలు పెట్టుబడిపై లేదా లాభంపై పొందవచ్చు. ఈ రెండింటిలో ఏది తక్కువగా ఉంటే దానిపై మినహాయింపు లభిస్తుంది. ఒకవేళ తెలివిగా పన్ను తప్పించుకునేందుకు ఈ బాండ్లలో పెట్టుబడి పెట్టి వాటిపై రుణ సదుపాయం పొందితే అంతకుముందు ఇచ్చిన పన్ను ప్రయోజనాలు రద్దవుతాయి. మూడేళ్ల వరకు కొనసాగించడం ద్వారానే పన్ను మినహాయింపులు లభిస్తాయి.



టెక్నాలజీ పెట్టుబడితో..!

టెక్నాలజీ రంగంలో నూతన కంపెనీలకు నిధుల పరంగా సహకారం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిధులతో సొంతంగా టెక్నాలజీ స్టార్టప్ ప్రారంభించేందుకు పెట్టుబడిగా వినియోగించినా పన్ను మినహాయింపు పొందవచ్చు. కాకపోతే కంప్యూటర్లు, సాఫ్ట్ వేర్ వ్యయంపైనే ఇది లభిస్తుంది.



నష్టాలతో సర్దుబాటు

ఇంటి విక్రయంపై వచ్చిన దీర్ఘకాల మూలధన లాభాలను ఇతర ఆస్తులపై నష్టాలతో సర్దుబాటు చేసుకునే అవకాశం కూడా ఉంది. ఉదాహరణకు ఒక యువకుడు రూ.కోటితో ఓ ఇల్లు కొన్నాడు. ఐదేళ్ల తర్వాత దాన్ని రూ.కోటిన్నరకు విక్రయించాడు. అదే సమయంలో షేర్లపై పెట్టుబడి ద్వారా దీర్ఘకాలంలో అతను రూ.30 లక్షలు నష్టపోయాడనుకుందాం. అప్పుడు ఇంటిపై వచ్చిన రూ.50 లక్షల్లో రూ.30 లక్షలను మినహాయించుకోవచ్చు.

మిగిలిన మొత్తంపైనే పన్ను పరమైన బాధ్యతలు ఉంటాయి. అదే ఇంటిపై స్వల్ప కాల మూలధన లాభం పొందితే... ఇతర ఆస్తులపై స్వల్పకాలంలో ఎదురైన నష్టాలతో భర్తీ చేసుకునేందుకు అవకాశం ఉంది.

టీడీఎస్ చెల్లించాలి

రూ.50 లక్షలు అంతకంటే ఎక్కువ మొత్తం విలువతో ఇల్లు కొనుగోలు చేస్తుంటే... కొనుగోలు దారులే ఆదాయపన్ను శాఖకు టీడీఎస్‌ను జమ చేయాల్సి ఉంటుంది. విక్రయదారుడికి చెల్లించే మొత్తం నుంచి ఒక శాతాన్ని మినహాయించి దాన్ని టీడీఎస్ కింద ఆదాయపన్ను శాఖకు చెల్లించాలి. ఈ విషయాన్ని విక్రయదారులు కూడా తప్పకుండా తెలుసుకుని ఉండాలి. కొనుగోలుదారుడు ఒక శాతాన్ని మినహాయించుకుని... దాన్ని ఆదాయపన్ను శాఖకు జమ చేయకుంటే తర్వాత రిఫండ్ క్లెయిమ్ చేసుకునేందుకు అవకాశం ఉండదు. లావాదేవీ జరిగిన నెల ముగిసిన తర్వాత 30 రోజుల్లోపు టీడీఎస్ జమ చేయాలని ఆదాయపన్ను శాఖ నిబంధనలు చెబ్తుతున్నాయి. విక్రయదారుడి పాన్ నంబర్ పై టీడీఎస్‌ను జమ చేయాలి. విక్రయదారుడు ఈ టీడీఎస్‌కు సంబంధించి కొనుగోలుదారుడి నుంచి ఫామ్ 16బీ రూపంలో టీడీఎస్ సర్టిఫికెట్ తీసుకోవాలి. తర్వాత అతడు పన్ను చెల్లించే అవసరం లేకుంటే రిఫండ్ కోసం క్లెయిమ్ చేసుకోవచ్చు.

ఇవి గమనించండి

- పాత ఇల్లును రూ.50 లక్షలకు అమ్మారు. కొత్త ఇల్లును రూ.40 లక్షలకు కొన్నారు. అప్పుడు పన్ను మినహాయింపు రూ.40లక్షలకే ఉంటుంది. మిగిలిన 10 శాతంపైనా పన్ను మినహాయింపు పొందాలంటే దీర్ఘకాల బాండ్లలో పెట్టుబడి పెట్టాలి. లేదంటే దీర్ఘకాల నష్టాలు ఉంటే వాటి కింద మినహాయింపు పొందవచ్చు.
- బిల్డర్ మూడేళ్లలోపు నూతన ఇంటిని అందించలేకపోయినా పన్ను మినహాయింపు పొందవచ్చు.
- విలువను ఎలా ఎక్కిస్తారు అంటే... రాష్ట్ర ప్రభుత్వ రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం ఉన్న విలువ, స్టాంప్ డ్యూటీ ప్రకారం నిర్ణయిస్తారు. రిజిస్ట్రేషన్ శాఖ రికార్డుల విలువ కంటే తక్కువకు విక్రయించినట్టు చూపిస్తే ఆదాయపన్ను శాఖ అధికారుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావచ్చు.
- సెక్షన్ 54 అనేది ఇల్లు విక్రయంపై వచ్చిన దీర్ఘకాల మూలధన లాభంపై పన్ను మినహాయింపు కోసం ఉద్దేశించినది. 54 ఎఫ్ అనేది ఇల్లు కాకుండా ఇతర ఆస్తులపై వచ్చిన దీర్ఘకాల మూలధన లాభాలపై పన్ను మినహాయింపు పొందేందుకు. మొత్తానికి ఈ సెక్షన్ దీర్ఘకాల లాభాలపై పన్ను మినహాయింపుల కోసం అని అర్థం చేసుకోవాలి. పన్ను మినహాయింపులు ఒక ఇంటికే పరిమితం.

ఏదీ చేయకుంటే...?

ఇంటిని విక్రయించగా వచ్చిన సొమ్మును ఎందులోనూ పెట్టుబడి పెట్టనట్టయితే ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేసే వరకు బ్యాంకుల్లోని కేపిటల్ గెయిన్స్ అకౌంట్ స్కీమ్ 1988లో డిపాజిట్ చేయాలి. అప్పుడు ఈ నగదును నివాసిత భవనం కోసమే వినియోగించాల్సి ఉంటుంది. అలా చేయనట్టయితే దాన్ని దీర్ఘకాల మూలధన లాభాల పన్నుగా పరిగణించి పన్ను విధిస్తారు. కేపిటల్ గెయిన్స్ అకౌంట్ స్కీములోని డిపాజిట్లపై ఇతర డిపాజిట్లపై వడ్డీ రేటునే అమలు చేస్తారు. కాకపోతే ఈ వడ్డీపై కూడా పన్ను ఉంటుంది.



విక్రయం కోసం ఖర్చులు

విక్రయించిన ఆస్తిని గతంలో కొనేందుకు వెచ్చించిన మొత్తం, దాన్ని మెరుగుపరిచేందుకు చేసిన ఖర్చు, విక్రయం కోసం అయిన ఖర్చులు మినహాయించాలి. ఇవన్నీ తీసివేయగా మిగిలిన మొత్తంపై పన్ను పడుతుంది.

అదే మూడేళ్ల తర్వాత విక్రయించిన ఆస్తిపై ద్రవ్యోల్బణ ప్రభావాన్ని కూడా మినహాయించుకునే అవకాశం ఉంది. స్వల్ప కాలంలో ఆర్జించిన లాభాలను తమ పన్ను రేటు ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

మూల ధన ఆస్తి అంటే...?

వ్యక్తిగత అవసరాల కోసం లేదా పెట్టుబడుల కోసమైనా కావచ్చు. అన్ని రకాల ఆస్తులు దీని కిందకు వస్తాయి. అంటే ఇల్లు, షేర్లు, బాండ్లు, మ్యూచువల్ ఫండ్స్ ఇలా. ఏదైనా ఓ ఆస్తిని కొని, దాన్ని విక్రయించారనుకుందాం. కొన్న విలువలో, అమ్మిన విలువ తీసివేయగా మిగిలిందే లాభం లేదా నష్టం.





ఇంటి రుణం.. సిద్ధం!


అతి పెద్ద పెట్టుబడిగా భావించే వాటిల్లో ఇల్లు కొనడం ఒకటి. కాబట్టి, కొనేముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించి, మనకు నచ్చే ఇంటిని సొంతం చేసుకోవాలి. మన దగ్గరున్నదెంత? దానికి అదనంగా ఎంత రుణం తీసుకోవాలి? ఎంత మొత్తం అయితే, మనకు తేలిగ్గా ఉంటుంది? ఇలా అనేక విషయాలను తెలుసుకుంటే తప్ప సొంతింటి కల తీరదు. అందుకోసం మనం చేయాల్సిందేమిటంటే.. ఇంటి కంటే ముందే.. రుణం కోసం బ్యాంకులను సంప్రదించడం. రుణం కావాలని మీరు కోరగానే బ్యాంకులు మీ దగ్గర నుంచి ఆదాయపు పన్ను రిటర్నులు, బ్యాంకు ఖాతా వివరాలు, ఆదాయపు ధ్రువీకరణ కోసం వేతన స్లిప్పులు, గుర్తింపు, చిరునామా ధ్రువీకరణ పత్రాలు, పాన్ లాంటి అనేక పత్రాలు సమర్పించాల్సిందిగా సూచిస్తాయి. వీటితో పాటు సిబిల్ ఇచ్చే మీ రుణ చరిత్ర నివేదికను పరిశీలించి మీరు ఎంత రుణానికి అర్హులో తేల్చి చెబుతాయి. ఆ తర్వాత మీకు ఇంటి రుణాన్ని మంజూరు చేయడానికి అంగీకరిస్తూ.. 'ప్రీ అప్రూవ్డ్ హౌసింగ్ లోన్' పత్రాన్ని ఇస్తుంది. ఇది సాధారణంగా ఆరు నెలల పాటు అమల్లో ఉంటుంది. బడ్జెట్ తెలిసిపోతుంది కాబట్టి, ఆ పరిధి మేరకే ఇంటిని వెతుక్కోవచ్చు. దానివల్ల అనవసర ఇబ్బందులు తప్పుతాయి.



సొంతిల్లు కుదిరేలా

ప్రతి వ్యక్తి తన జీవితంలో సొంత ఇంటిని సమకూర్చుకోవాలని కలలు కంటాడు. దానిని నెరవేర్చుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తాడు. ప్రస్తుతం పెద్ద నోట్ల రద్దుతో తలెత్తిన ఇబ్బందులు తొలగిపోయాయి.. కొనుగోలుదారుల వద్ద నగదు లభ్యత పెరిగింది.. సహజంగానే ఇప్పుడు మళ్లీ అందరి చూపు ఇల్లు సమకూర్చుకోవడం వైపు మళ్లింది. మార్కెట్ క్రమంగా సాధారణ స్థితికి చేరడంతో తమ బడ్జెట్‌లో నివాసాల కోసం వెతకడం ప్రారంభించారు. కొనుగోలుకు వినియోగదారులు ముందుకు వస్తున్నారని స్థిరాస్తి సంస్థలు అంటున్నాయి. ఇల్లు కొనేముందు అక్కడ మౌలిక వసతులైన రహదారి, రవాణా, నీటి సదుపాయమే కాక విద్య, వైద్యం అందు బాటులో ఉన్నాయా? లేదా అన్నది కూడా చూశాక నిర్ణయం తీసుకుంటుంటారు. ఇటువంటి సౌకర్యాల పరంగా ప్రాంతాలు నగరం నలువైపులా విస్తరించాయి. ఎక్కువ మంది నిర్ణయాన్ని ప్రభావితం చేసేది మాత్రం బడ్జెట్‌నే.

గదిగదిలో ధగధగ



సొంతింటి కలను నిజం చేసుకునే క్రమంలో... గదుల్లోని కాంతి!! ఇళ్లల్లో లైటింగ్‌ను ప్రధానంగా మూడు భాగాలుగా విభజించుకోవచ్చు.. సాధారణ కాంతి, టాస్క్ లైటింగ్, యాక్సెంట్ లైటింగ్. ఈ మూడింటిని కలిపి అలంకరణ లైటింగ్‌నీ సిద్ధం చేసుకోవచ్చు. సాధారణంగా అలంకరణ లైటింగ్ మనసును ప్రభావితం చేసేదిగా ఉంటుంది. పలు రకాల రంగులు, ఆకారాల్లో దీనిని ఏర్పాటు చేస్తారు. షాండిలియర్స్, పెండెంట్ లైటింగ్‌లు ఈ కోవలోకి వస్తాయి. ఇది గదిలో అన్ని వస్తువులు కనిపించేట్లు వేస్తారు. గదుల పైకప్పు, సీలింగ్ వంటివి దీని పరిధిలోకి వచ్చేట్లు చూస్తారు. వీటి కోసం టార్చర్స్, వాల్ స్కోన్సెస్, చెస్ట్‌లైట్స్, కోన్స్ వాడుతుంటారు. సాధారణ లైటింగ్ కంటే మూడు రెట్లు కాంతిమంతంగా ఉంటుంది. అత్యధిక వాట్స్ శక్తి కల్గిన బల్బులను దీనిలో వినియోగిస్తారు. ఇంట్లోని ముఖ్యమైన అలంకరణ వస్తువుల్ని హైలైట్ చేసేందుకు వాడతారు. దీంతోపాటూ ఇంట్లో అద్భుతంగా నిర్మించిన కీలక నిర్మాణాలను హైలెట్ చేసేందుకూ వినియోగిస్తుంటారు. సాధారణంగా చుట్టుపక్కల ఉన్న కాంతి కంటే మూడు రెట్లు శక్తివంతమైన బల్బులను ఇందుకోసం వినియోగిస్తుంటారు.

మనం స్పోర్ట్స్
శనివారం 3 మార్చి 2018
www.manamnews.com



ఇద్దరూ ఇద్దరే

ధోనీ.. కోహ్లీలపై రవిశాస్త్రి ప్రశంసలు

ముంబాయి: సౌతాఫ్రికా సిరీస్‌లో టిమిండియా కెప్టెన్ కోహ్లీ అద్భుతంగా రాణించాడని కోచ్ రవిశాస్త్రి ప్రశంసల జల్లు కురిపించాడు. క్లిష్ట సమయాల్లనూ ఆత్మవిశ్వాసంతో కోహ్లీ జట్టు ను నడిపించిన తీరు మరచిపోలేనిదని శాస్త్రి అన్నాడు. టెస్టుల్లో ఓడిపోయినా జట్టులోని మిగతా ఆటగాళ్లకు కోహ్లీ ఇచ్చిన స్ఫూర్తి, ధైర్యం వన్డేల్లోనూ, టి.20ల్లోనూ గెలిచేందుకు ఉపయోగపడిందని రవిశాస్త్రి విశ్లేషించాడు. సౌతాఫ్రికా టూర్ నుంచి కెప్టెన్‌గా కోహ్లీ ఎన్నో పాఠాలు నేర్చుకున్నాడని చెప్పాడు. క్లిష్టమైన జట్టుతో ఆడటం ద్వారా ఎంతో అనుభవాన్ని సంపాదించాడని అభినందించాడు. సెంచూరియన్ టెస్ట్‌లో కోహ్లీ కొట్టిన సెంచరీ సౌతాఫ్రికా టూర్‌కే హైలైట్ అని శాస్త్రి అభిప్రాయ పడ్డాడు. సెంచూరియన్ ఇన్నింగ్స్‌తో కోహ్లీ వెను తిరిగి చూడలేదని టాప్ క్లాస్ ఆటతో వన్డేల్లోనూ సూపర్ ఫామ్‌ను ప్రదర్శించి వరల్డ్ టాప్ క్లాస్ బ్యాట్స్‌మెన్ అయ్యాడన్నాడు.

ధోని అనుభవం వెలకట్టలేనిది

ఇక మాజీ కెప్టెన్ ధోనీ అనుభవం కూడా వెలకట్టలేనిదన్న రవిశాస్త్రి ఆ అనుభవాన్ని మార్కెట్‌లో కొనలేమన్నాడు. ధోనీ అనుభవం కొనటానికి, అమ్మటానికి సాధ్యం కాదు, అనుభవానికి ప్రత్యామ్నాయం ఉండదు అని రవిశాస్త్రి పేర్కొన్నాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఆటగాడైనప్పటికీ ఒదిగి ఉండటం గొప్ప స్వభావమని, ఫిట్‌నెస్ అసాధారణమని అన్నాడు. డెత్ ఓవర్లలో ధోనీలా ఆడేవాళ్లు అరుదుగా ఉంటారన్నాడు.

అరుణకు ఘన స్వాగతం

నేడు ఎల్బీ స్టేడియంలో అపూర్వ సత్కారం



హైదరాబాద్: అంతర్జాతీయ స్థాయిలో మెరిసి భారత్‌కు పతకాన్నందించిన హైదరాబాద్ జిమ్నాస్ట్ అరుణారెడ్డికి క్రీడాభిమానులు ఘనస్వాగతం పలికారు. మెల్‌బోర్న్‌లో జరిగిన ప్రపంచ జిమ్నాస్టిక్స్ పోటీల్లో కాంస్య పతకం సాధించి చరిత్ర సృష్టించిన అరుణ శుక్రవారం హైదరాబాద్ చేరుకుంది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఒలింపిక్ సంఘం



ప్రతినిధులు, అభిమానులు భారీ ర్యాలీతో అత్తాపూర్‌లోని ఇంటి వరకూ అరుణను తీసుకొచ్చారు. పలువురు క్రీడాకారులు, అభిమానులు ఆరుణను అభినందించారు. మరిన్ని పతకాలు సాధించాలని, హైదరాబాద్ ఖ్యాతి అంతర్జాతీయ స్థాయిలో మరింత పెంచేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. అరుణను కలవటానికి అభిమానులు బారులు తీరారు. రియో ఒలింపిక్స్‌లో మెరిసిన భారత జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ తర్వాత అరుణారెడ్డి అత్యంత క్లిష్టమైన వాల్ట్ విభాగంలో భారత్‌కు పతకం అందించి రికార్డును తిరగరాసింది. భారత క్రీడారంగంలో అంతర్జాతీయ స్థాయిలో జిమ్నాస్టిక్స్ విభాగంలో పతకం సాధించటం అరుణకే సాధ్యమైంది.

అపూర్వ సన్మానానికి ఏర్పాట్లు

హైదరాబాద్‌లో పుట్టి పెరిగి, అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించి చరిత్ర సృష్టించిన అరుణారెడ్డిని తెలంగాణ ఒలింపిక్ సంఘం (శాట్స్) ఘనంగా సత్కరించాలని నిర్ణయించింది. అరుణారెడ్డితో పాటు ఆమె కోచ్ బ్రిజ్ కిశోర్‌ను కూడా సత్కరించేందుకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణ ప్రభుత్వంతో పాటు, పలు క్రీడా సంఘాలు కూడా అరుణను సత్కరిస్తాయి. క్రీడల మంత్రి పద్మారావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

కామన్‌వెల్త్ క్రీడల్లో పతకం సాధిస్తా

ఏప్రిల్‌లో జరిగే కామన్‌వెల్త్ క్రీడల్లో పతకం సాధించటమే తన లక్ష్యమని అరుణారెడ్డి తెలిపింది. మెల్‌బోర్న్ నుంచి విజయగర్వంతో హైదరాబాద్ తిరిగొచ్చిన ఆమె అభిమానుల ఆదరణకు ఉప్పొంగిపోయింది. అభిమానుల నమ్మకాన్ని నిలబెడతానని ఇక అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించటమే తన ముందున్న కర్తవ్యమని తెలిపింది. మెల్‌బోర్న్‌లో సాధించిన పతకంతో సంతృప్తి పడనని, ఇంకా ఎన్నో పతకాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని వివరించింది. మెల్‌బోర్న్‌లో జరిగిన ప్రపంచ జిమ్నాస్టిక్స్ పోటీల ద్వారా ఎన్నోపాఠాలు నేర్చుకున్నానని, అత్యంత క్లిష్టమైన ప్రత్యర్థులతో పోటీపడి పతకం సాధించటం చెప్పలేనంత సంతృప్తినిచ్చిందని ఆమె తెలిపింది. 'గెలిచిన దానితో సరి పెట్టుకోను.. ఇంకా నేర్చుకోవాల్సింది చాలా ఉంది.. నేర్చుకుంటూనే నా ముందున్న లక్ష్యాలను చేరుకునేందుకు ప్రయత్నిస్తా' అని అరుణ చెప్పింది. మెల్‌బోర్న్‌లో జరిగిన పోటీల కంటే ముందు తాష్కెంట్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పతకంపై ఆశలు పెట్టుకునానని, అయితే ఒత్తిడి కారణంగా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయానని వివరించింది. కామన్‌వెల్త్ క్రీడలు తనముందున్న అతిపెద్ద సవాల్ అంటున్న అరుణ రియో ఒలింపిక్ స్టార్ దీపా కర్మాకర్ తనకు ఎంతో సపోర్ట్‌గా నిలిచిందని, దీపా చెప్పిన విలువైన చిట్కాలు ఉపయోగపడ్డాయని వివరించింది.

నాన్నకు ప్రేమతో...

ప్రపంచ కప్‌లో సాధించిన ఈ పతకం తన తనండ్రికి అంకితమిస్తున్నట్టు అరుణ తెలిపింది. 8 ఏళ్ల వయసు నుంచి తనకు శిక్షణనిచ్చిన బ్రిజ్ కిశోర్‌కు ఎంతో రుణపడి ఉంటానని పేర్కొంది. కోచ్, స్పోర్ట్స్ అథారిటీ సభ్యుల సహకారంతోనే తానీ ఘనతను సాధించానని చెప్పిన అరుణ చార్టెడ్ ఆకౌం టెంట్ పూర్తి చేయాలను కున్నట్టు తెలిపింది.

ఉజ్వల భవిష్యత్ : కోచ్ గుర్‌దయాళ్

జిమ్నాస్టిక్స్‌లో అరుణకు ఉజ్వల భవిష్యత్ ఉందని జాతీయ కోచ్ గుర్‌దయాళ్ సింగ్ బవా ప్రశంసించారు. మెల్‌బోర్న్ ప్రపంచ జిమ్నాస్టిక్స్‌లో అరుణారెడ్డి ఆటతీరు అద్భుతమని అభినందించారు. అరుణలో చాలా ప్రతిభ ఉందని, ఫిజికల్‌గా, మెంటల్‌గా అరుణ చాలా శక్తివంతురాలని జిమ్నాస్టిక్స్‌లో ఈ రెండూ అతి ముఖ్యమైనవని బవా అన్నాడు. ఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ట్రైనింగ్ క్యాంప్ లో ఆరుణ శిక్షణ తీసుకుందని, ఇటీవల అరుణ ప్రతిభ ఎంతో మెరుగుపడిందని, మెల్‌బోర్న్ పోటీల్లో పతకం సాధించటమే కాకుండా ఆమె సాధించిన పాయింట్లు కూడా చాలా పెరిగాయని బవా అన్నారు. పతకం గెలిచిన పోటీల్లో అరుణ 13.649 పాయిట్లు సాధించటం ఆమె ప్రతిభకు నిదర్శనమని, అంతర్జాతీయ స్థాయిలో ఇదో అద్భుత ప్రదర్శన అని చెప్పారు. ఎంతో కష్టపడి అరుణ ఈ స్థాయికి చేరుకుందని, వరల్డ్ కప్ పోటీల్లోనూ ఆమె పతకం గెలుస్తుందని ఆశించానన్నారు. అంతర్జాతీయ పోటీల్లో జిమ్నాస్టిక్స్ విభాగంలో పతకం సాధించటం భారత క్రీడరంగంలో కొత్త అధ్యాయమని, దీపా కర్మాకర్, అరుణల ప్రతిభతో దేశంలో జిమ్నాస్టిక్స్‌కు గుర్తింపు వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. వీరి విజయాల ద్వారా మరికొంత మంది జిమ్నాస్ట్‌లు వెలుగులోకి రావటం ఖాయమన్నారు. దీపాకర్మాకర్‌తో అరుణను పోల్చలేమని, కఠోర సాధనతోనే అంతర్జాతీయ పోటీల్లో రాణించగలిగారని చెప్పారు.



అజ్లాన్ కా 'సుల్తాన్' ఎవరో?

నేటి నుంచి హాకీ టోర్నీ

తొలి మ్యాచ్‌లో అర్జెంటీనాతో ఇండియా ఢీ

స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఇపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా కప్ పురుషుల హాకీ టోర్నీ శనివారమిక్కడ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో 2016 ఒలింపిక్ చాంపియన్ అర్జెంటీనాతో భారత జట్టు తలపడనుంది. 18 మంది సభ్యుల భారత జట్టుకు అనుభవజ్ఞుడైన మిడ్‌ఫీల్డర్ సర్దార్ సింగ్ నేతృత్వం వహించనున్నాడు. ఈ టోర్నీకి సిద్ధపాటుపై సర్దార్ సింగ్ మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మక వార్షిక ఈవెంట్‌లో టైటిల్ విజయంపై తాము పూర్తి విశ్వాసంతో ఉన్నామని చెప్పాడు. మొత్తం 6 జట్లు పాల్గొనే ఈ టోర్నీలో ఆతిథ్య మలేసియాతో పాటు ప్రపంచ నంబర్ వన్ ఆస్ట్రేలియా, నంబర్-2 అర్జెంటీనా, ఇంగ్లండ్, ఐర్లాండ్‌తో ఇండియా తలపడుతుంది. 'చాలా కాలంగా నిర్వహిస్తున్న అజ్లాన్ షా కప్ చాలా మంచి టోర్నీ. ఇది క్యాలెండర్ ఇయర్‌లోని మిగతా టోర్నీలకు మన బలాలు, బలహీనతల్ని తెలియజేస్తుంది. ఈ టోర్నీలో రాణించడం మాకు చాలా ముఖ్యం. ఈ టోర్నీ కోసం బెంగళూరులోని సాయ్ సెంటర్‌లో కఠోర శిక్షణ తీసుకున్నాం. ముఖ్యంగా అటాక్, డిఫెన్సివ్ స్కిల్స్‌పై ప్రాక్టీస్ చేశాం' అని మలేసియాకు బయల్దేరే ముందు 31 ఏళ్ల కెప్టెన్ చెప్పాడు. గత ఎడిషన్‌లో ఇండియా 4-0తో న్యూజిలాండ్‌ను ఓడించి మూడో స్థానంలో నిలిచింది. కాగా ఫైనల్లో గ్రేట్ బ్రిటన్ జట్టు 4-3తో ఆస్ట్రేలియాపై గెలిచి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆ టోర్నీ గ్రూప్ దశలో ఇండియాకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. తొలి మ్యాచ్‌లో గ్రేట్ బ్రిటన్‌తో 2-2తో డ్రా చేసుకున్న ఇండియా తర్వాత రెండో



మ్యాచ్‌లో 3-0తో న్యూజిలాండ్‌పై గెలిచింది. కానీ తర్వాత మ్యాచ్‌లో ఇండియా 1-3తో ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలైంది. తర్వాతి మ్యాచ్‌లో ఇండియా 4-3తో జపాన్‌ను ఓడించింది. కానీ చివరిగా జరిగిన మ్యాచ్‌లో 0-1తో ఆతిథ్య మలేసియా చేతిలో ఓటమిపాలు కావడంతో ఇండియా ఫైనల్‌కు వెళ్లలేకపోయింది.



'టోర్నీని శుభారంభం చేయడం చాలా ముఖ్యం. అర్జెంటీనాపై సత్తా చాటితే తర్వాతి మ్యాచ్‌ల్లో జట్టు సభ్యులు పూర్తి విశ్వాసంతో ఆడతారు. ఫైనల్‌కు అర్హత సంపాదించాలంటే గ్రూప్ దశలోని ప్రతి మ్యాచ్ చాలా ముఖ్యమైంది. గతంలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ వంటి జట్లను ఓడించాం. అర్జెంటీనాపై కూడా బాగా ఆడాం. ఒక పద్ధతి ప్రకారంగా ఆడుతూ జట్టు ప్రణాళికలను తూచా తప్పకుండా ఆమలు చేయాలి' అని సర్దార్ అన్నాడు. 1983లో ఈ టోర్నీ ప్రారంభమైంది మొదలు భారత జట్టు ఈ ట్రోఫీని ఐదుసార్లు (1985, 1991, 1995, 2009, 2010లో కొరియాతో సంయుక్త విజేత) గెలిచింది. 2016లో సర్దార్ చివరిసారిగా జట్టుకు నేతృత్వం వహించాడు. ఆ టోర్నీలో ఫైనల్‌కు చేరిన



భారత జట్టు 0-4తో ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలై రజత పతకంతో సంతృప్తి చెందింది. 'భారత జట్టుకు నేతృత్వం వహించడం ఎప్పుడైనా గర్వకారణమే. అప్పటికీ ఇప్పటికీ నా పాత్రలో ఎటువంటి మార్పు లేదు. సీనియర్ ప్లేయర్స్‌గా మేము జూనియర్స్‌ను నడిపించాల్సిన బాధ్యత మాదే. టోర్నీల్లోనూ వాళ్లకు సహాయపడడం చాలా ముఖ్యం. వాళ్లపై ఉన్న ఒత్తిడిని తొలగించాలి. రమన్‌దీప్ సింగ్, ఎస్‌కె ఊతప్ప, సురేందర్ కుమార్, తల్వీందర్ సింగ్ వంటి సీనియర్లు, ప్రతిభావంతులైన జూనియర్లతో కలిసి సత్తా చాటుతామన్న పూర్తి నమ్మకం నాకుంది' అని సర్దార్ సింగ్ అన్నాడు. గ్రూప్ దశలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్‌కు చేరుకుంటాయి. ఈ నెల 10వ తేదీన ఫైనల్ జరుగుతుంది. గత ఎడిషన్‌లో రన్నరప్‌గా నిలిచిన భారత జట్టు ఈసారి టైటిల్‌ను గెలుచుకోవాలని పట్టుదలగా ఉంది. ఆస్ట్రేలియా జట్టు ఈ ట్రోఫీని అత్యధికంగా తొమ్మిదిసార్లు గెలిచింది. ఈసారి కూడా ఆస్ట్రేలియా జట్టు బరిలోకి దిగుతోంది. అయితే ఈ ఏడాది టోర్నీలో పాకిస్థాన్ జట్టు ఆడటం లేదు. పాక్ జట్టు ఈ టైటిల్‌ను మూడుసార్లు సొంతం చేసుకుంది. గెలిచిన జట్టుకు 3 పాయింట్లు, డ్రా చేసుకుంటూ 1 పాయింట్ లభిస్తుంది.

సుల్తాన్ అజ్లాన్ షా షెడ్యూల్

తేదీ	మ్యాచ్	సమయం (భారత కాలమానం)
మార్చి 3	ఇండియాXఅర్జెంటీనా	మII 1:30
	ఆస్ట్రేలియాXఇంగ్లండ్	మII 3:30
	మలేసియాXఐర్లాండ్	సాII 6:00
మార్చి 4	ఇండియాXఇంగ్లండ్	మII 1:30
	ఐర్లాండ్Xఅర్జెంటీనా	మII 3:30
	మలేసియాXఆస్ట్రేలియా	సాII 6:00
మార్చి 6	ఇంగ్లండ్Xఐర్లాండ్	మII 1:30
	ఇండియాXఆస్ట్రేలియా	మII 3:30
	మలేసియాXఅర్జెంటీనా	సాII 6:00
మార్చి 6	ఆస్ట్రేలియాXఐర్లాండ్	మII 1:30
	అర్జెంటీనాXఇంగ్లండ్	మII 3:30
	ఇండియాXమలేసియా	సాII 6:00
మార్చి 9	అర్జెంటీనా-ఆస్ట్రేలియా	మII 1:30
	ఐర్లాండ్-ఇండియా	మII 3:30
	ఇంగ్లండ్-మలేసియా	సాII 6:00
మార్చి 10	5/6 స్థానాల మ్యాచ్	మII 1:30
	3/4 స్థానాల మ్యాచ్	మII 3:30
	ఫైనల్	సాII 6:00

అత్యధిక టైటిళ్లు గెలిచిన జట్లు

- ఆస్ట్రేలియా 9సార్లు
- ఇండియా 5సార్లు
- పాకిస్థాన్ 3సార్లు

మొత్తం జట్లు

- ఇండియా
- మలేసియా (ఆతిథ్య జట్టు)
- అర్జెంటీనా
- ఆస్ట్రేలియా
- ఇంగ్లండ్
- ఐర్లాండ్

టీమ్	ర్యాంకింగ్స్
ఆస్ట్రేలియా	1
అర్జెంటీనా	2
ఇండియా	6
ఇంగ్లండ్	7
ఐర్లాండ్	10
మలేసియా	12



సచిన్ సాయం మరచిపోలేనిది

1996 లార్డ్స్ టెస్ట్ ఇన్నింగ్స్‌పై గంగూలీ

కోల్‌కతా: భారత క్రికెట్‌లో సచిన్-గంగూలీ గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. దశాబ్దానికిపైగా ఇద్దరూ కలిసి భారత క్రికెట్‌కు చిరస్మరణీయ విజయాలు అందించారు. రన్ మెషిన్లలా ఆడుతూ రికార్డులు తిరగరాశారు. 1996లో లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌తో గంగూలీ తొలి టెస్ట్ ఆడాడు. ఆ మ్యాచ్‌లో జరిగిన అనుభవాన్ని దాదా తన ఆత్మకథలో గుర్తు తెచ్చుకున్నాడు. ఆ మ్యాచ్‌లో సెంచరీ కొట్టి తొలి టెస్ట్‌లోనే సెంచరీ చేసిన బ్యాట్స్‌మెన్ జాబితాలోకె చేరాడు గంగూలీ. అయితే సెంచరీ పూర్తయ్యాక టీ బ్రేక్ ఇచ్చారు. ఈ సమయంలో డ్రస్సింగ్ రూమ్‌లో ఆసక్తికరమైన సన్నివేశం జరిగింది. జట్టులో సీనియర్ ఆటగాళ్లు ఎలా ఉంటారోనని కొత్త ప్లేయర్లు బిక్కుబిక్కుమంటుంటారు. అయితే

సచిన్ మాత్రం అందుకు భిన్నంగా గంగూలీతో వ్యవహరించాడు. టీ తాగుతామనుకుంటుండగా తన బ్యాట్ దగ్గర పగుళ్లను గుర్తించిన గంగూలీ టేప్ చుట్టేందుకు సిద్ధమయ్యాడు. ఈలోగా సచిన్ గంగూలీ దగ్గరకు వచ్చాడట. 'నువ్వు టీ తాగు, నేను టేప్ చుడతా, మళ్లీ బ్యాటింగ్ చేయాలి కదా' అని గంగూలీ బ్యాట్‌కు సచిన్ టేప్ చుట్టాడట.

' ఆ మ్యాచ్ నాకు తొలి టెస్ట్. ఇంగ్లండ్ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 344 రన్స్ చేసింది, తర్వాత మేం బ్యాటింగ్ మొదలుపెట్టాం, ఓపెనర్ విక్రమ్ రాథోడ్ అవుటయ్యాడు. నేను బ్యాటింగ్ మొదలుపెట్టి 100 పరుగులతో టీ బ్రేక్‌కు నాటౌట్‌గా ఉన్నా, అప్పటికే ఆరు గంటలకుపైగా బ్యాటింగ్ చేశా, నా బ్యాట్ కొద్దిగా పగిలింది, ఆ కాస్త సమయంలోనే నాకు ఓ కప్పు టీ తీసుకొచ్చి తాగమని సచిన్ సలహా ఇచ్చాడు, నా బ్యాట్‌కు టేప్ చుట్టాడు' అని గంగూలీ వెల్లడించాడు. ఆ ఇన్నింగ్స్‌లో గూంగూలీ 131 పరుగులు చేశాడు. రెండు ఇన్నింగ్స్‌లో మూడు వికె ట్లు పడగొట్టాడు. ఆ మ్యాచ్ డ్రాగాముగిసింది.



వెంకటేశ్ ప్రసాద్ రాజీనామా

న్యూఢిల్లీ : భారత క్రికెట్ జూనియర్ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ పదవికి మాజీ పేస్ బౌలర్ వెంకటేశ్ ప్రసాద్ రాజీనామా చేశాడు. అండర్ -19 ప్రపంచ కప్‌లో భారత్ టైటిల్ గెలుచుకుని నెల రోజులు కాకుండానే వెంకటేశ్ ప్రసాద్ రాజీనామా చేయటం చర్చనీయాంశమైంది. దాదాపు రెండున్నరేళ్ల పాటు వెంకటేశ్ ప్రసాద్ ఈ పదవిలో కొనసాగాడు. వ్యక్తిగత కారణాలే తన రాజీనామాకు కారణమని వెంకటేశ్ ప్రసాద్ చెబుతున్నప్పటికీ ఐపిఎల్ జట్టుకు సేవలందించే అవకాశం లేక పోలేదని సమాచారం. వెంకటేశ ప్రసాద్‌ను కోచ్‌గా కొనసాగించేందుకు చాలా ప్రయత్నాలు చేశామని బీసీసీఐ తెలిపింది.

శాంసన్ స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభం

తిరువనంతపురం: ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించనున్న కేరళ యువ క్రికెటర్ సంజు శాంసన్ శుక్రవారమిక్కడ సిక్స్ గన్స్ స్పోర్ట్స్ అకాడమీని ప్రారంభించాడు. ఈ అకాడమీలో క్రికెట్, ఫుట్‌బాల్ ప్లేయర్స్‌కు శిక్షణ ఇస్తారు. ఈ అకాడమీని తిరువనంతపురం లోక్‌సభ సభ్యుడు శశిథరూర్ ప్రారంభించారు. 'ఈ అకాడమీ క్రికెట్ మాత్రమే పరిమితం కాలేదు. ఫుట్‌బాల్ అటగాళ్లకు కూడా శిక్షణ ఇస్తారు. ఈ అకాడమీ రాజధానిలో ఏర్పాటు చేసినప్పటికీ రాష్ట్రమంతటా సెలెక్షన్ క్యాంప్‌లు నిర్వహిస్తాం' అని శాంసన్ అన్నాడు. ఫుట్‌బాల్‌లో ఢిల్లీ పోలీస్ జట్టుకు ఆడిన శాంసన్ తండ్రి ఈ అకాడమీని నడిపించనున్నారు. ఈ అకాడమీలో క్రికెట్‌తో పాటు ఫుట్‌బాల్ ఆటగాళ్లకు కూడా శిక్షణ ఇవ్వాలన్నది తన తండ్రి ఆలోచన అని శాంసన్ చెప్పాడు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న కోచ్‌లతో అకాడమీని నడిపిస్తామని.. భవిష్యత్తులో మరింత మంది కోచ్‌లు అవసరమైతే బయటి నుంచి రప్పిస్తామని శాంసన్ తెలిపాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.